UNIVERSAL LIBRARY
OU_204898
UNIVERSAL LIBRARY

తిక్కన సోమయాజి

గ్రంథకర్త:

చిలుకూరి వీరభద్రరావుగారు.

రెండవ ముద్రణము.

ఆంధ్ర బుక్ హౌస్
సుల్తాన బాజారు
హైద్రాబాదు దక్కన్.

ప్రకాశకులు,

ఆర్యన్ బుక్కుడిపో,

రాజమండ్రి.

1948.

సర్వస్వామ్యసంకలితము.]

'తిక్కన సోమయాజి'

సుప్రసిద్ధ చిత్రకారులు

అంకాల వేంకటసుబ్బారావుగారు చిత్రించినది.



చరిత్రచతురానన

శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు.

తిక్కన సోమయాజి

ప్రథమ భాగము

మొదటి ప్రకరణము

“సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన వాఁ
డనునాలుకకుఁ దొడ వైనవాఁడు,
చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన వాఁ
డనుశబ్దమునకర్థ మైనవాఁడు,
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁ డనిన వాఁ
డని చెప్పుటకుఁ బాత్ర మైనవాఁడు,
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వాఁ
డని చూపుటకు గుఱి యైనవాఁడు,

గీ. మనుమసిద్ధిమహీశ సమస్తరాజ్య
భారధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి.”

(కేతన)

“మ. తన కావించినసృష్టి తక్కొరులచేతం గాదు నా నేర్పు ముం
బునఁ దాఁ బల్కినఁ బల్కు లాగమములై పొల్పొందు నా వాణి న
త్తనుసేతం డొకరుండు నాఁ దను మహాత్వాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్.”

(ఎఱ్ఱాప్రగ్గడ)

తిక్కన వంశము — మంత్రిభాస్కరుఁడు

బ్రహ్మర్షి యగు గౌతముని పావనగోత్రంబున మానెనమంత్రి జనించెను. మానెనపూర్వులు కొట్టరువు గ్రామంబునఁ బెద్దకాలము నివసించినవా రగుటం జేసి వారికిఁ గొట్టరువువా రని యింటిపేరు గలిగినది. కొట్టరువు మానెనమంత్రికిఁ గేతనయు నాతనికి భాస్కరమంత్రియు జనించిరి. ఆకాలమునం దాఱ్వేలనాటిలోఁ (గుంటూరుమండలము) బ్రఖ్యాతి కెక్కిననియోగిబ్రాహ్మణకుటుంబములలో మంత్రిభాస్కరుని కుటుంబ మొక్కటి. కొట్టరువువంశమున భాస్కరమంత్రి యుదయించి పంద్రెండవశతాబ్దాంతమునఁ బూర్వచాళుక్యచోడచక్రవర్తులకుఁ బ్రతినిధులై వేఁగీదేశ మని వ్యవహరింపఁబడెడు నాంధ్రభూభాగమును బరిపాలించుచున్న చందవోలురాజుల యధికారము క్రిందను గుంటూరు సీమను బరిపాలించి విఖ్యాతిఁ గాంచెను. ఆకాలమునఁ బూర్వచాళుక్య చోడచక్రవర్తికి నామమాత్ర ప్రతినిధియై పృథ్వీశ్వరమహారాజు ధనదుపురము (చందవోలు) రాజధానిగా విక్రమసింహపురము మొదలుకొని సింహాచలముపర్యంతము నాంధ్రదేశమును బరిపాలించుచుండెను. పృథ్వీశ్వరుఁడు చాళుక్యచోడచక్రవర్తికి లోఁబడినవాఁ డని చెప్పుకొనఁబడుటయేగాని క్రీ. శ. ౧౨[illegible] వఱకును స్వతంత్రుఁడై పరిపాలనము చేసెను. అతనిక్రిందియధికారులలో నొక్కఁడై గుంటూరిసీమను బరిపాలించినవాఁడు మంత్రిభాస్కరుఁడు. తిక్కనసోమయాజి కూడ తన నిర్వచనోత్తరరామాయణములో

> " సారకవితాభిరాము గుంటూరివిభుని
> మంత్రిభాస్కరు మత్పితామహునిఁ దలఁచి"

అని మంత్రిభాస్కరుని గుంటూరివిభునిఁగాఁ జెప్పియుండెను. మంత్రిభాస్కరుఁ డోకసామాన్యశరణమే గాని ప్రాభవముగలవాఁడు గాఁ డనియు, అతఁ డోకగొప్పకవియునుగాఁ డనియు, తనవంశగౌరవమును దెలుపుకొను

టకై తిక్కన యట్లు చెప్పఁగ నని ననుభావమును దేటపఱచుచు భాస్కరో దంతమను విమర్శ గ్రంథమునఁ బరిహాసపూర్వక వ్యాఖ్యానము చేయఁబడి యెను. * కాని తదితరవిషయములను న్యాయైకదృష్టితోడను నిష్పక్ష పాతబుద్ధితోడను బరిశీలించి చూచినప్పుడుమాత్రము మన మాయభి ప్రాయముతో నేకీభవింపఁజాలము. అమలాచారుఁ డనియును, సాహిత్య విద్యాపారీణుఁ డనియును, శాపానుగ్రహశక్తియుక్తుఁ డనియును, ధర్మ మార్గపథికుఁ డనియును, అర్థార్థిలోకానసవ్యాపారవ్రతుఁ డనియును, గౌరీపతిశ్రీపాదప్రవణాంతరంగుఁ డనియును, విబుధశ్రేయస్కరుఁ డని యును అభినవదండినా వినుతి గాంచిన కేతనమహాకవి తన దశకుమార చరిత్రమునందు మంత్రిభాస్కరుని నభివర్ణించి యుండుటం జేసి మన మాతని నసామాన్యపురుషుఁ డనియే గ్రహింపవలసియుండును. ఈ

---

* ఈవిమర్శగ్రంథము ప్రయుత కాశీభట్ల బ్రహ్మయ్యగారిచే వ్రాయఁబడినది.

" ఏకాలమునందు మంత్రిభాస్కరుఁ డుండె నని ప్రతిపక్షులు తలంచుచు న్నారో యాకాలమున గుంటూరును బరిపాలించుచున్న ప్రభుఁ డొకఁడు గలఁ డని శాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. ఆకాలమున గుంటూరురాజ్యమునకుఁ బాల కుఁడు శ్రీమన్ మహామండలీక గుంటూరి యురయరాజు, అరసిమంత్రి బొల్లన; సేనాని రాయనిప్రెగ్గడయు నైనట్లుగా బెజవాడ మల్లేశ్వరస్వామివారి యాలయస్తంభమునఁ గలశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. ఈశాసనమును బట్టి చూడఁగా గుంటూరు పాలకుఁడు గాని, మంత్రికాని, సేనానికాని మంత్రిభాస్కరుఁడు కాఁ డని తోఁచు చున్నది." అని కాశీభట్ల బ్రహ్మయ్యగారు తమభాస్కరోదంత మను విమర్శనగ్రంథ మునందు వ్రాసి యున్నారు ఈశాసనము క్రీ. శ. ౧౨౧౬వ సంవత్సరమున వ్రాయఁ బడినది. ఈశాసనము వ్రాయఁబడినకాలమునఁ దిక్కభూపాలుఁడు జయంగొండచోళ మండలములోని పేరూరునాడును బరిపాలించుచున్నవాఁడు. మంత్రిభాస్కరుని మూఁడవకుమారుఁ డగుసిద్ధనామాత్యుఁ డాతని కాప్తమంత్రిగ నుండె నని తెలిసికొని యున్నారము. కాఁబట్టి మంత్రిభాస్కరుఁ డింతకుఁబూర్వము కొన్ని వత్సరములక్రిం దట నుండియుండెను. అప్పు డితఁడు గుంటూరునకుఁ బాలకుఁడుగా నుండె నని నమ్ముట కేవిధమైన యభ్యంతర ముండును? (ఆం॥ చ॥ పే. ౫౭-౫౮)

మంత్రి భాస్కరుఁడు రామాయణమును మొదట రచింపఁగా నది యేకారణముచేతనో అరణ్యకాండము తక్కఁ దక్కినకాండము లన్నియు శిథిలము లై పోవుటచేత హుళక్కిభాస్కరాదికవులు వానిం బూరించిరనియు, ఆరామాయణమే భాస్కరరామాయణ మనుపేరఁ బరఁగుచున్నదనియు నాంధ్రులచే విశ్వసింపఁబడుచున్నది. కాని యిది యెంతవఱకు విశ్వాసపాత్రమో చెప్పఁజాలము. భాస్కరరామాయణముఁ గూర్చిన యథార్థకథన మింకను మఱుఁగుననే యున్నది. అయ్యది భావిపరిశోధనములమూలమునఁ దెలిసికొనవలసి యున్నది.*

కొమ్మనదండనాథుఁడు

మంత్రి భాస్కరునకు మహాసాధ్వి యగుకొమ్మమాంబ గర్భమున నలువురుపుత్త్రు లుద్భవించి యఖండయశోధనులై వర్ధిల్లిరి. వీరిలోఁ గడపటి వాఁడైన కొమ్మనామాత్యుఁడు మంత్రి భాస్కరునిపిమ్మటఁ గుంటూరి సీమను బరిపాలించెను. తనమహాభారతములోని విరాటపర్వమునందుఁ దిక్కనకవి తనతండ్రిని,

"సీ. మజ్జనకుండు సన్మాన్యగౌతమగోత్ర
 మహితుండు భాస్కరమంత్రితనయుఁ,
డన్నమాంబాపతి యనఘులు కేతన
 మల్లన సిద్ధనామాత్యవరుల,
కూరిమితమ్ముండు గుంటూరివిభుఁడు కొ
 మ్మనదండనాథుఁడు మధురకీర్తి,
విస్తరస్ఫారుఁ డాపస్తంభసూత్రప
 విత్రశీలుఁడు సాంగవేదవేది."

అను పద్యములో నభివర్ణించి యుండుటచేతఁ గొమ్మన దండనాథుఁ డని

* ఈ భాస్కరరామాయణమునుగూర్చి ఆంధ్రులచరిత్రములోఁ బదుమూఁడవ ప్రకరణములో 'సాహిణిమారుఁడు భాస్కరరామాయణము' అనుశీర్షికక్రిందను విశేషముగాఁ జర్చింపఁబడి యున్నది.

కూడఁ దెలుపుచున్నది. దండనాథుఁ డన సేనాధిపతి. గుంటూరివిభుఁ డనియు, దండనాయకుఁ డనియు వర్ణింపఁబడిన కొమ్మనామాత్యుని సామాన్యకరణముగా వ్రాయుట మిక్కిలి శోచనీయము. మఱియును గేతనమహాకవి కొమ్మనామాత్యుని, శౌచమున గంగాత్మజన్ముఁ డని యును, శౌర్యమున గాండీవధన్వుఁ డనియును, సూర్యవంశకభూపాలసుచిర రాజ్యవనవసంతుఁ డనియును వర్ణించి యుండుటఁగూడ నతఁడు దండనాయకుఁడుగ నుండె నని ధ్వనింపఁ జేసి తిక్కనసోమయాజి వర్ణనమును బలపఱచుచున్నది గాని సామాన్యకరణముగా నుండె నని సూచింపుచుండలేదు. కొమ్మనామాత్యుఁడు పృథ్వీశ్వరమహారాజుకాలములో గుంటూరున దండనాయకుఁడుగా నుండి యామహారాజు పండ్రెండవ శతాబ్దాంతమున విక్రమసింహపురాధీశ్వరుఁ డైన మనుమసిద్ధిరాజుకుమారుఁ డైన తిక్కరాజుతో యుద్ధము చేసి వానిచేఁ జంపఁబడినందునఁ దరువాతఁ దాను సూర్యవంశ్యు లైన తెలుఁగుచోడరాజులకొల్వులోఁ బ్రవేశించి ప్రఖ్యాతుఁడై యుండును. అట్లు కానియెడలఁ గేతనకవి కొమ్మనామాత్యుని 'సూర్యవంశకభూపాలసుచిరరాజ్యవనవసంతుఁ' డని యూరక వర్ణింపఁడు. అతని మూఁడవయన్న యగు సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రియు, సేనాపతియు నై యుండుటచేతఁ గొమ్మనామాత్యుఁడు గాని వాని మరణానంతరము కుమారుఁడు తిక్కన గాని గుంటూరుమండలమును విడిచి నెల్లూరునకుఁ బోయియుందురు. కొమ్మనామాత్యుని మూఁడవయన్న యగు సిద్ధనామాత్యుఁడు తిక్కరాజున కాప్తమంత్రియు సేనాపతియు నై యుండె నని దశకుమారచరిత్రములోని,

"ఉ. స్థాపితసూర్యవంశవసుధాపతినాఁ బరతత్త్వభూతవా
ణీపతినా నుదాత్తనృపనీతిబృహస్పతినా గృహస్థగౌ
రీపతినాఁ గృపారసపయోనిధినాఁ బొగ డొంది సిద్ధసే
నాపతి ప్రోడ తిక్కజననాథశిఖామణి కాప్తమంత్రియై."

అనుపద్యములో విస్పష్టముగా వివరింపఁబడి యున్నది.) సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రిగా నుండె నని తెలిపెడి శాసన మొకటి నెల్లూరు మండలమునఁ గలదు.* సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రియు సేనాపతియు నై యుండ వానితమ్ముఁ డైన కొమ్మనామాత్యుఁ డొక్కడతో గుంటూరున నూరును బేరును లేకుండఁ గరిణీకముఁ జేసికొనుచుఁ గూరుచుండె ననుట విశ్వాసపాత్రము గాదని వేఱుగ నొక్కి వక్కాణింప నక్కఱ లేదు. మంత్రి భాస్కరునివంశము పదుమూఁడవశతాబ్దిలోఁ బ్రఖ్యాత మైనదనుట సత్యమునకు విరుద్ధము గాదు. మంత్రి భాస్కరుని తండ్రి కేతన కమ్మనాటిని బరిపాలించిన త్రిభువనమల్లదేవచోడునకు మంత్రిగ నుండె నని తెలియుచున్నది. మంత్రిభాస్కరుని పుత్త్రులైన కేతన మల్లన మంత్రులు కమ్మనాటిచోడులకొల్వులోఁ బ్రఖ్యాతులై యుండిరి. మంత్రి భాస్కరుని మూఁడవకుమారుఁ డైన సిద్ధన తిక్కరాజున కాప్తమంత్రిగను సేనాపతిగ నుండెను. భాస్కరుని నాలుగవకుమారుఁడు కొమ్మన గుంటూరునకు దండనాథుఁడుగ నుండెను. కొమ్మనామాత్యుని పుత్త్రుఁడు కవితిక్కన మనుమసిద్ధిరాజునకు మంత్రిగ నుండెను. సిద్ధనామాత్యునికుమారుఁడు ఖడ్గతిక్కన సిద్ధిరాజునకు మంత్రిగను సేనాపతిగ నుండెను. ఇట్లు తండ్రులును గొడుకులును మనుమలును మంత్రిత్వాదిపదవులను వహించి యుండఁగా మంత్రి భాస్కరుఁడు సామాన్యగృహస్థుఁడని నమ్మించుట కై ప్రయత్నించుట మిక్కిలి శోచనీయము. ఆకాలమునఁ బ్రఖ్యాత మైన మంత్రి భాస్కరునివంశము తామరతంపరవలె వర్ధిల్లుచుండెను. వాని నల్వురు పుత్త్రులకును సంతానము గలదు. మంత్రి భాస్కరుని మనుమలలోఁ జరిత్రమునఁ బ్రసిద్ధిఁ గాంచినవారు సిద్ధనామాత్యుని పుత్త్రుఁ డగుతిక్కనయును గొమ్మనామాత్యుని పుత్త్రుఁ డగు

* See Nellore Inscriptions published by Messrs Butterworth and Venugopal Chetti.

తిక్కనయును నిరువురు మాత్రమె. కొమ్మనామాత్యుఁడు లౌకికాధికార ధూర్వహుం డగుటయెగాక వైదికాచారనిష్ఠాపరుఁ డై యుండె ననికూడఁ బవిత్రశీలుఁ డనియును, సాంగవేదవేది యనియును దిక్కన వర్ణించిన దానినిబట్టి విస్పష్ట మగుచున్నది. ప్రాచీనకాలమున ద్రోణాచార్యాది ద్విజవర్యులు బ్రాహ్మణధర్మమును క్షత్రియధర్మమును రెంటినిగూడ సమర్థించుకొనినట్లుగా మంత్రి భాస్కరుఁడును వానికుమారులును మను మలునుగూడ సమర్థించుకొనుచు వచ్చిరి.

రెండవ ప్రకరణము

తెలుఁగు చోడరాజులు

కొట్టరువు భాస్కరమంత్రి తనయులలో మూఁడవవాఁ డగు సిద్ధన తిక్కభూపాలునకు మంత్రిగను సేనాపతిగ నుండె ననియును, కొంతకాలము గడచినపిమ్మట మంత్రి భాస్కరుని నాలుగవకుమారుఁ డగు కొమ్మనదండనాథుఁడు గుంటూరుసీమ నుండి నెల్లూరునకు వచ్చి కాఁపుర ముండె ననియును మనము తెలిసికొని యున్నారము. తిక్కరాజు విక్రమసింహపుర మను బిరుదునామముచే బ్రసిద్ధిగాంచిన నెల్లూరు ముఖ్యపట్టణముగాఁ జేసికొని తనరాజ్యమును గాంచీపురమువఱకును వ్యాపింపఁజేసి నెల్లూరు, కడప, చిత్తూరు, చెంగల్పట్టు మండలములలోఁ జేరిన విశేషభూభాగమును బరిపాలించి ప్రఖ్యాతి కెక్కినవాఁడు. ఇతఁడు తెలుఁగుచోడుల తెగలోనివాఁడు. తెలుఁగుదేశమునందలి చోడరాజు లను తెలుఁగుచోడరాజు లనియును, తమిళదేశమునందలి చోడరాజులను తమిళచోడరాజు లనియును, కన్నడదేశమునందలి చోడరాజులను కన్నడ

చోళరాజు లనియును ఇటీవలి చరిత్రకారులు వ్యవహారనామములను గల్పించి మూఁడు తెగలవారినిగా విభజించి యున్నారు. కాని మొదట వీరెల్లరు నొక్కతెగవారుగానే యుండిరని చెప్పవచ్చును. ఈసందర్భమునఁ దెలుఁగుచోడరాజుల చరిత్రమును జదువరు లెఱింగియుండుట యత్యావశ్యకము గావునఁ బాఠకుల యుపయోగార్థము సంగ్రహముగా నిటఁ దెలుపుచున్నాఁడను.

తెలుఁగుచోడరాజులు సూర్యవంశపురాజు లైనట్లుగా నాంధ్రకవుల కావ్యములయం దభివర్ణింపఁబడి యున్నారు. విష్ణునాభికమలమున బ్రహ్మయు, వానికి మరీచియు, వానికిఁ గశ్యపుఁడును, వానికి సూర్యుఁడును బుట్టిరఁట.* అట్టి సూర్యునివంశమునఁ గరికాలచోడుఁడు జనించి చోడరాజకుటుంబముల కెల్లను మూలపురుషుఁడై యొప్పెను. ఇతని తండ్రి జటచోడుఁ డనియును, ఇతఁ డయోధ్యను బాలించె ననియును, ఇతఁడు కావేరినది కానకట్ట కట్టించి గట్లు వోయించె ననియును దెలుఁగు చోడుల శాసనములలో నభివర్ణింపఁబడి యుండెను. ఇతఁడు త్రిలోచన పల్లవుని జయించె ననియును, గావేరినది కానకట్ట కట్టించె ననియుఁ, దిక్కనసోమయాజికూడ వర్ణించి యున్నాఁడు. §

---

* "ఉ. అంబుజనాభునాభి నుదయం బయి వేధ మరీచిఁ గాంచె లో
కంబుల కెల్లఁ బూజ్యుఁ డగు కశ్యపుఁ డాతనికిన్ జనించె ని
శ్వంబు వెలుంగఁ జేయఁగ దివాకరుఁ డమ్ముని కుద్భవించె వా
నిం బొగడం జతుర్ముఖులు నేరక యున్నది నాకు శక్యమే."

(తిక్కన నిర్వచనోత్తరరామాయణము)

§ "శా. చేసెం బృథ్వీశు లందుకొనఁ గాశీసింహుతో యంబులన్
జేసెన్ మజ్జన మంగుటంబున హరించెం బల్లవోర్వీశు న
ల్లానం బొందఁగ, ఫాలలోచనము లీలం గట్టెఁ గావేరి, పే
ర్మాసాధ్యాఖిలదిఙ్ముఖుండు కరికాలక్ష్మావిభుం డల్పుఁడే!"

(నిర్వచనోత్తరరామాయణము)

ఈకరికాలునకు మహిమానుఁడును, వానికిఁ గరికాలుఁడును, తొండమానుఁడును, దాసవర్మయు నను మూవురుకుమారులు గల రని యును శాసనములు దెలుపుచున్నవి. కరికాలునివంశమున బిజ్జన జనించెను. ఇతనివంశమునుండి రెండుశాఖ లుద్భవించినవి. దాసవర్మనుండి యొకశాఖ పుట్టెను. ౧ కరికాలునివంశమునఁ బుట్టిన దాసవర్మ మొదట పాకనాటివిషయమును జయించి పొత్తపిపట్టణమును రాజధానిగఁ జేసికొని పరిపాలించెనఁట. ౨ ఈపొత్తపి రాజధానిగాఁ గల పొత్తపినాడును బరిపాలించిన చోడులనుగూర్చి వివరముగాఁ దెలుపుట కిపుడు సాధ్యము గాదు. పొత్తపిచోడుఁ డనునది పెక్కండ్రు రాజులకు బిరుదువాచకముగా నుండెను. ఈపొత్తపినాటిని బరిపాలించిన దాసవర్మ సంతతివారు కమ్మనాటిలోని కొట్యదోనను 3 రాజధానిగఁ జేసికొని పరిపాలించిరి. వీరి చరిత్ర మిచటఁ దెలుపుట యనవసరవిషయము గావున విరమించుచున్నాఁడను. దాసవర్మకు మధురాపట్టణమును జయించుటచేత మధురాంతకుఁ డనుబిరుదము లభించెనఁట. ఈ మధురాంతకునిపేరును తిక్కన తననిర్వచనోత్తరరామాయణమున నుదాహరించియుండలేదు. విక్రమసింహపురిచోడులలోఁ బెక్కండ్రు మధురాంతకపొత్తపిచోడుఁ డను బిరుదునామమును దమపేరులకుఁ జేర్చుకొని శాసనములలో వ్రాయించుకొనుచు వచ్చిరి. తిక్కనసోమయాజి మధురాంతకపొత్తపిచోడుని ప్రశంసింపకపోయినను బిజ్జనమాత్రము నిర్వచనోత్తరరామాయణ

---

౧. **Annual Report on Epigraphy for 1899, Nos. 183 & 205.** ఆంధ్రులచరిత్రము, రెండవభాగము, రెండవప్రకరణము చూడుఁడు.

౨. పొత్తపి యనునది కడపమండలములో పుల్లంపేటతాలూకాలోని టంగుటూరునకు సమీపమునం దున్న పోతపి యనుగ్రామమే గాని మఱి యన్యము గాదు.

3. ఈ కొట్యదోనపట్టణ మిపుడు గుంటూరుమండలములోని నరసారావుపేటకు సామీప్యమునందు కోణిదెన యనునామముతోఁ బరఁగుచున్నది.

మున నభివర్ణించియున్నాఁడు. *"ఈ బిజ్జలరాజు ౧౧౫౦ మొదలు ౧౧౬౭ సంవత్సరమువఱకు రాజ్యముచేసిన (చాళుక్య) త్రైలోక్యమల్లుని సేనాధిపతిగా నుండి, ౧౧౬౭ వ సంవత్సరమున కళ్యాణపురాధీశ్వరత్వ మును తానే యపహరించి, లింగాయతమతము స్థాపించిన బసవేశ్వ రుని తోఁబుట్టు వగుపద్మావతియొక్క చక్కఁదనమునకు మక్కువగొని యామెను వివాహమాడి తనమంత్రినిగాఁ జేసికొన్న యాబసవేశ్వరుని చేతనే చంపఁబడెను." అని, నెల్లూరి మనుమసిద్ధిరాజుయొక్క పూర్వికుఁ డైనబిజ్జనయే చాళుక్యబిజ్జలుఁడని యభిప్రాయపడి శ్రీ వీరేశలింగము పంతులుగారు తమ యాంధ్రకవులచరిత్రయం దట్లు వ్రాసియున్నారు. *ఈబిజ్జన సూర్యవంశ్యుఁడు. కళ్యాణపురాధీశ్వరుఁ డైనబిజ్జలుఁడు చంద్రవంశ్యుఁడు. కావున వీరిగువురకు నేవిధ మైనసంబంధమును లేదు. తిక్కన యీబిజ్జనను

"చ. పరువపరాక్రముం డగుచుఁ బల్లవువీట నుదగ్రు లైన ప
న్నిరువుర వారివిం గలయ నెన్ని యనర్గళమత్సరంబు పై
మురరిపునన్నిభుండు పమువ్వుర గండపెండెంగఁ బెట్టెఁ దా
బిరుదు వెలుంగ బిజ్జఁ డరిభీకరభూరిభుజాబలంబునన్."

అని యభివర్ణించి యున్నాఁడు.

ఈబిజ్జన ఊజ్యపురియందు, శిఖరమున గరుడవిగ్రహము గలిగి యుండునట్టి విజయస్తంభము నొకదాని నిర్మించె నని యొకశాసనమున

---

* చ. అతనికులంబునందు నవతారి యుగాంతకృతాంతమూర్తి య
ప్రతిమవదాన్యతావిభవభాసి విలాసరతీశుఁ డప్రతి
ర్కితవివిధావధానపరికీర్తితనిర్మలవృత్తనుండు పం
క్తిరథనిధి పుట్టె బిజ్జన యశేషనరిత్రయము నుల్లసిల్లఁగన్.

*కందుకూరి వీరేశలింగ కవికృత గ్రంథములు, సంపుటము ౧౦. భాగము ౧. పేజి ౪౭. (౧౯౧౧-వ సంవత్సర ముద్రితగ్రంథము.)

లిఖియింపఁ బడియెను. §ఈబిజ్జనవంశమునందే మనుమసిద్ధిరాజు జనించి విఖ్యాతిఁ గాంచెను. ఇతఁడు చాళుక్య చోడచక్రవర్తి యైన మూఁడవ కులోత్తుంగ చోడునకుఁ గప్పము చెల్లించెడు సామంతుఁడై పండ్రెండవ శతాబ్ద్యంతమునను, పదుమూఁడవ శతాబ్దప్రారంభమునను గావలి మొదలుకొని కాంచీపురము వఱకుఁ గల దేశమునంతయుఁ బరిపాలించి నట్లు శాసనములం బట్టి తెలియుచున్నది. ఇతఁడు శాసనములలో నల్ల సిద్ధిరాజని వ్యవహరింపఁబడియెను. ఇతనికి మిక్కిలి పరాక్రమవంతుఁడైన తమ్ముసిద్ధిరా జనుతమ్ముఁ డొకఁడు గలఁడు. వీని శాసనములు నెల్లూరు, చిత్తూరు, చెంగల్పట్టు మండలములలోఁ బెక్కులు గానంబడు చున్నవి. మనుమసిద్ధిరాజు మొదట విక్రమసింహపురమునందుఁగాక వల్లూరుపట్టణము రాజధానిగఁ జేసికొని మార్జవాడి (మహారాజవది) రాజ్యమును బరిపాలనము సేయుచుఁ గాంచీపురముపై దండెత్తిపోయి యా రాజువలనఁ గప్పము గైకొనుచుండెనని తెలియుచున్నది. క్రీ. శ. ౧౧౯౬-వ సంవత్సరమునకుఁ దరువాత త్రిభువన వీరదేవుఁడైన మూఁడవకులోత్తుంగుఁ డసమానమైన గజబలంబుతోడఁ గాంచీపురముపై దండెత్తివచ్చి వీరకృత్యము లనేకములను గావించి విరోధు లయినరాజుల నెల్లరను జయించి కాంచీపురమును జొచ్చి క్రోధాగ్ని చల్లాఱినవెనుకఁ గాంచీపురము మొదలుగ నుత్తరభాగము నంతటను గప్పము విధించి సామంతనృపతులనుండి గైకొనుచుండెను. *ఈ మనుమసిద్ధి రాజునకుఁ

---

§ కోయంబుత్తూరు మండలములో కొళ్లేగాలము అను స్థలమునకు ౧౮ మైళ్ల దూరమున నున్న ఉజ్జపురమే ఉజ్జ్యపుర మని డాక్టరు లూడర్సుగారు నిర్ధారణ చేసి యున్నారు. అయినను నెల్లూరిమండలములో సుళ్లూరుపేట డివిజనులో ఉచ్చూరు అనెడిగ్రామ మొకటి కలదు. ఇచ్చటి యితరశాసనములలో ఈగ్రామము ఉచ్చియూ రని వాడఁబడి యున్నట్లుగా శాసనపరిశోధకులు వ్రాయుచున్నారు.

* South Indian Inscriptions vol. iii. p. 218.

తిక్కరాజు జనించెను. శ్రీకాళహస్తిదేవుఁడు తిరుక్కాళత్తిదేవుఁ డని ద్రావిడదేశమున వ్యవహరింపఁ బడుచుండెను. తిరుక్కాళత్తి శబ్దమె తెలుఁగులో తిక్కన యని వ్యవహరింపఁ బడుచున్నది. కావున, తిక్కన యనునది శ్రీకాళహస్తి దేవుని నామమె గాని మఱి యన్యము గాదు. పరాక్రమవంతుఁడైన తిక్కభూపతి తెలుఁగుచోడులలో సుప్రసిద్ధుఁడు. ఇతఁ డసహాయశూరుఁడై బాల్యముననే యుద్ధములను జేసి విజయములను బొందుచు వచ్చెననుటకు దృష్టాంతములు గలవు. ఇతఁడు శైశవమునందే వెలనాటిప్రభువైన పృథ్వీశ్వరమహారాజతో యుద్ధము చేసి రణరంగమున వానిమస్తకమును ద్రుంచి దానితోఁ గందుకక్రీడఁ గావించినాఁ డని తిక్కన తన నిర్వచనోత్తరరామాయణమున,

"ఉ. కేశవసన్నిభుండు పరగీతయశోనిధి చోళతిక్కధా
త్రీశుఁడు కేవలుండె, నృపు లెవ్వరి కాచరితంబు గల్గునే,
శైశవలీల నాఁడు పటుశౌర్యధురంధరబాహుఁడై నపృ
థ్వీశనరేంద్రుమస్తకము నేర్తెఁ గందుకకేళి సల్పఁడే."

అను పద్యములో నభివర్ణించి యున్నాఁడు. ఈ పృథ్వీశనరేంద్రుఁడు మనుమగొంకరాజునకు జయాంబికయం దుద్భవించి రాజరాజ చాళుక్యచోడ చక్రవర్తికిఁ బ్రతినిధియయ్యు సర్వస్వతంత్రుఁడై వేంగీ దేశమును బరిపాలించుచుండెను. కాఁబట్టి పృథ్వీశ్వరరాజు పండ్రెండవ శతాబ్ద్యంతమున నుండెననుటకు సందేహము లేదు. తనతండ్రి మనుమసిద్ధిరాజునకుఁ బిమ్మట తిక్కరాజు విక్రమసింహపురమునఁ బట్టాభిషిక్తుఁడై మూఁడవ కులోత్తుంగచోడునకు లోఁబడి యున్నవాఁడుగ నటించినను స్వతంత్రుఁడై పరిపాలనము చేసెను. తిక్కరాజు మూఁడవ కులోత్తుంగచోడుని గడపటికాలమునమాత్ర ముండి యతని మరణానంతరము స్వతంత్రుఁ డయినట్లు కన్పట్టుచున్నది.

ఇతఁడు స్వతంత్రుఁడై నవెనుక చోడసింహాసనమునకై చాళుక్య చోడులలో మూఁడవ రాజరాజునకును మూఁడవ రాజేంద్రచోడున కును తగవులు గలిగి పరరాజుల సహాయమును గోరి యిరుపక్షముల వారును బోరాడుటచేతఁ గాంచీపురము పల్మాఱు సంక్షోభమున కాకర మగుచు వచ్చెను. కర్ణాటదేశమును బరిపాలించు వీరసోమేశ్వరుఁడు (హొయిసలరాజు) రాజేంద్రచోడుని పక్షమును, మన యీతిక్కభూపా లుఁడు రాజరాజుపక్షమును బూని యుద్ధములు చేయుచువచ్చిరి. కర్ణాట వీరసోమేశ్వరుని తోఁబుట్టువుకుమారుఁడును, (మేనల్లుఁడు) పాండ్య మండలాధిపతియు నగు రెండవ మారవర్మ సుందరపాండ్యుఁడును, మహా బలిపురాధీశ్వరుండును, పల్లవరాజు నగుకొప్పరింజింగదేవుఁడును (మహా రాజసింహుఁడు) (అనఁగా ద్రావిడులుఁ గర్ణాటులు) నొక్కవంకను, తెలుఁగుచోడు లొక్కవంకను జేరి ఘోరయుద్ధములు జేసిరి. ఈ యుద్ధ ములలో మొదట తిక్కరాజనకే విజయము గలిగెను. తిక్కభూపా లుఁడు కదనరంగమున శత్రువుల నోడించి రాజరాజచోడుని సింహా సనమునందు నిలిపి చోడస్థాపనాచార్యబిరుదమును బొంది యువక్ర విక్రమలీలను గాంచీపురమునుగూడఁ బరిపాలించెను. ఈవిషయమునే తిక్కనసోమయాజి తననిర్వచనోత్తరరామాయణమున,

"మ. కమలా ప్తప్రతిమానమూ ర్తి యగు నాకర్ణాటసోమేశు దు
ర్దమదోర్గర్వము రూపుమాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ
లమెయిం జోళుని భూమిపై నిలిపి చోళస్థాపనాచార్యనా
మము దక్కంగొని తిక్కభూవిభుఁడు సామర్థ్యంబు చెల్లింపఁడే !"

అనుపద్యములో స్పష్టముగా వివరించి యున్నాఁడు.

కేతనకవికూడ తన దశకుమారచరిత్రమున నవతారికలో

సీ. బలిమిచేఁ బృథ్వీశవసుధేశు తలఁ ద్రుంచెఁ
గటకసామంతుల గర్వ మడఁచెఁ

గాళవవిభు నహంకారంబు మాన్పించెఁ
బాండ్యునిచేతఁ గప్పంబుఁ గొనియె
ద్రవిడమండలికు లందఱఁ దక్కఁ గెలిచి చో
డుని నిజరాజ్యపీఠమున నిలిపె
తెలుఁగుమన్నీల నిద్దఱఁ బుట్టఁగా సేసె
వైరివీరుల నామములూఁదు నొత్తె
యౌదార్యరాయపెండరుఁ డుభయకటక
వీరుఁ డభినవభోజుఁ డాకారమదనుఁ
డవనిభారధౌరేయమహాత్మ విజిత
దిక్కరీంద్రుఁడు ఘనచోళ తిక్కనృపతి.''

అనుపద్యమునఁ దిక్కరాజు పృథ్వీశ్వరరాజు తలఁ ద్రుంచెనని చెప్పియున్నాఁడు. కాంచీపురములోని అరుళాళప్పెరుమాళ్ల యాలయములో క్రీ. శ. ౧౨౩౩-౩౪-గవ సంవత్సరమున నీతిక్కనృపతి పేరిట నొక దానశాసనము గానంబడుచున్నది. కావున నంతకుఁ బూర్వమే యీ యుద్ధము జరిగియుండునని యూహింపఁ దగును. ఈకారణముననే తిక్కరా జనేకులతో యుద్ధములు చేసి విజయములను బొంది ప్రఖ్యాతికెక్కెను. దీనినిగూడఁ దిక్కనసోమయాజి తననిర్వచనోత్తరరామాయణమున,

''సీ. లకుమయ గురుములూరికి దెత్తివచ్చినఁ
గొనఁడె యాహవమున ఘోటకముల
దర్పదుర్జయు లగు దాయాదనృపతుల
ననిలోనఁ బఱపఁడే యాగ్రహమున,
శంభురాజాది ప్రశస్తాతిమండలి
కముఁ జెర్చి యేలఁడే కంచిపురముఁ,
జేదిమండలముఁ గావిగఁ జేసి కాళవ
పతి నెయ్యుగొలుపఁడే పలచమునకు
గీ. రాయగండగోపాలు వరాతిభయద
రాయపెండారవిభుఁడాభిరాము మనుమ

రాయగండాంక ఖండియరాయఁ డిక్క-
ధరణివిభుఁ బోల రాజుల కరిది గాదె."

అనుపద్యములో శంభురాజాది శత్రువులను జయించి కాంచీపురమును బాలించె నని తెలియఁ జేసి యున్నాఁడు. తిక్కరాజు పూర్వులు శైవమతావలంబకు లయినను తిక్కరాజు మాత్రము వైష్ణవ భక్తుఁడై తనరాజ్యములో ననేక విష్ణ్వాలయములను స్థాపించి వైష్ణవ మతమునకుఁ బోషకుం డైనటులు గనంబడుచున్నది. "ఎవ్వఁడు శ్రీవరదస్వామి చరణసరోరుహములను బూజింపుచున్నాఁడో అతఁడే నాకుఁ దల్లియుఁ దండ్రియు, గురువును, ధనమును, పుత్త్రుఁడును మిత్త్రుఁడు నగుచున్నాఁ" డనిచెప్పి అరుళాళప్పెరుమాళ్ళ దేవాలయములో నొక శాసనమున వ్రాయించుటయే యిందుకు దృష్టాంతము. ఇతఁడు వైష్ణవ మతావలంబకుఁ డయినను పరమతసహనము గలిగి యుండినట్లు కానంబడుచున్నాఁడు. తిక్కనసోమయాజి మూఁడవ పెద్దతండ్రి యగుసిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రిగ నుండి యతనిమరణానంతరముఁ గూడఁ గొంతకాలమువఱకు జీవించి యుండినట్లు గనంబడుచున్నది. తిక్కరాజునకుఁ గరికాలభూవిభుఁ డని నామాంతరము గలదనియు, ఇతఁడు విద్వాంసుఁడై, కవిసార్వభౌమబిరుదమును వహించి యుండెననియుఁ గూడ నిర్వచనోత్తరరామాయణములో

"సీ. భృత్యానురాగంబు పెంపుఁ జెప్పఁగ నేల
    పరివారసన్నాహ బిరుదు గలుగ,
వందిప్రియత్వంబు వర్ణింపఁగా నేల
    పాకశపుత్త్రాఖ్య పరఁగుచుండ.
సకలవిద్యాపరిశ్రమముఁ దెల్పఁగ నేల
    కవిసార్వభౌమాంక మవనిఁ జెల్ల,
శుభగతామహిమఁ బ్రస్తుతి సేయఁగా నేల
    మన్మథనామంబు మహిమ నెగడ,

గీ. నుభయబలభీరుఁ డనుపేరు త్రిభువనములఁ
బ్రచురముగ ఘోరబహుసంగరముల విజయ
లక్ష్మిఁ జేకొను బాహుబలంబుసొంపు
పొగడ నేటికిఁ గరికాలభూవిభునకు "

అనుపద్యములోఁ దెలుపఁ బడియున్నది తిక్కనకవి తిక్కరాజును సకల విద్యాపరిశ్రమముగలవాఁ డనియు, కవిసార్వభౌమబిరుదముచే నొప్పిన వాఁ డనియు, వర్ణించియున్నాఁడు కాని యీతఁడు రచించిన గ్రంథము లెవ్వియో పేర్కొన్న వాఁడు గాఁడు.

సిద్ధనామాత్యుని తమ్ముఁడైన కొమ్మనామాత్యుఁడు తిక్కన సోమయాజి బాలుఁడై యుండఁగనే స్వర్గస్థుఁ డయ్యెనని తలంపవలసి యున్నది. తిక్కన తన మూఁడవ పెద్దతండ్రి యగు సిద్ధనామాత్యుని కడనే యుండి వేదశాస్త్రాదివిద్యల నభ్యసించి పెద్దవాఁడై మహోపదవి నధిష్ఠించినట్లు తోఁచుచున్నది. తిక్కరాజునకు రాయగండగోపాలుఁ డను బిరుదనామము గలదు. ఈతిక్కరాజు క్రీ. శ. ౧౨౪౦ వఱకును బరిపాలనము చేసెను. ఇతనివెనుకఁ గుమారుఁడు మనుమసిద్ధి రాజ్యమును బొందెను.

మూఁడవ ప్రకరణము

తిక్కనజన్మాదికము.

తిక్కన జన్మస్థానముగాని, జన్మసంవత్సరముగాని మనకుఁ దెలియ రాదు. తిక్కన కొమ్మనామాత్యునకు సదాచారసంపన్నయు, సుగుణ శీలయు, మహాపతివ్రతయు నైన అన్నమాంబగర్భమున నొకశుభ ముహూర్తమున జనించెను. ఇట్టి సుపుత్త్రుఁడు తమకు జనించినందులకుఁ

బరమానందమును బొందుచుఁ, దల్లిదండ్రులు జాతకర్మప్రముఖసంస్కారంబులు యథావిధిగా నెఱవేర్చి తిక్కన యని శ్రీకాళహస్తిదేవుని తెనుఁగుపేరు పెట్టిరి. తిక్కనసోమయాజితండ్రియును, దాతయును గుంటూరివిభులుగా నున్నట్లు నిర్వచనోత్తరరామాయణావతారికయును, ఆంధ్రమహాభారతములోని విరాటపర్వావతారికయును దెలుపుచున్నందునఁ దిక్కనజన్మస్థానము గుంటూరే యుండు నని యూహించుట కెక్కువ హక్కు గలదు గాని గుంటూరే జన్మస్థాన మని నిర్ధారించుటకు బలవత్తర మగు నంతకంటె నధికము గానరాదు. ఆకాలమునఁ దల్లిదండ్రులు దమకొమరాళ్ళకుఁ దిక్కన యని నామకరణముఁ జేయుట కాళహస్తిసమీపమండలవాసులలోఁ గానంబడును గాని గుంటూరుమండలవాసులలో నంతగాఁ గానంబడదు. ఆ హేతువుచేతఁ దిక్కనజన్మస్థానము కాళహస్తికి సామీప్యమున నుండు నెల్లూరే యనుట కెక్కువహక్కు గలదు గాని నెల్లూరే జన్మస్థాన మని నిర్ధారించుటకు బలవత్తర మగు నంతకంటె నధికము గానరాదు. అయినను దిక్కనజన్మస్థాన మిది యని సహేతుకముగా నిర్ధారించుటకుఁ జాలినంతలిఖితసాధనము లభ్య మగునంతవఱకును జన్మస్థాన మిదమిత్థ మని నిశ్చయింపఁజాలను. కాని తిక్కనసోమయాజి నివాసస్థానము నెల్లూ రని ఘంటాపథముగఁ జాటవచ్చును. తిక్కనజన్మస్థాన మెద్దియైనను తిక్కనవాసస్థలము నెల్లూరు కాదను వాదముగూడఁ గలదు. ఆవాదమునుగూడ విమర్శింతము. ఇట్టివాదము 'కవిజీవితము' లనుగ్రంథమునందుఁ గానంబడుచున్నది. అం దిట్లున్నది.

"నెల్లూరుప్రభుఁ డగు మనుమసిద్ధి [illegible] తన నిర్వచనోత్తరరామాయణము కృతియిచ్చుటం జేసియు, [illegible] హరిహరనాథున కిచ్చుటచేతను తిక్కన నెల్లూరు [illegible] కర్హ్యనది. ఇందు మొదటిగాథను బట్టి అక్కడ నివాసము [illegible]. పూర్వము కవీశ్వరులు దేశదేశములు తిరిగి, ఎక్కడ రసికులగు ప్రభువు లుందురో అక్కడఁ గొన్ని

దినంబు లుండి యాప్రభుని కొకకృతియిచ్చి బహుమతుల నంది మరల స్వస్థలము నకుఁ బోవుచుండు నాచారము గలదు. అటులనే సోమయాజియుఁ జేసి యున్నాఁ డని ఆతని రెండవగ్రంథమగు భారతములో మనుమసిద్ధి యాస్థానములోనివాఁడ నని యుచ్చరింపఁబడకపోవుటచేత నిస్సంశయముగాఁ జెప్ప నొప్పియున్నది. ఇఁక రెండవశంకకు సమాధాన మెట్లన్న భారతములో స్మరింపఁబడిన హరిహరనా థుఁడు అర్చావతారరూపుఁడై నెల్లూరున వేంచేసియున్న హరిహరనాథుఁడు కాక కేవలమును నద్వైతుల కుపాస్యం బగు హరిహరులకు నధినాథుఁ డగునద్వయ నిర్గుణబ్రహ్మ మని భారతములోని యనేకస్తోత్రపద్యముల నద్వైతశాస్త్రసంప్ర దాయముఁ జూచిన స్పష్టము కాఁగలదు. కావునఁ బైరెండు యుక్తులును సోమ యాజి నెల్లూరుపురవాసి యని స్థాపింపఁ జాలవు. భారతరచనాపూర్వకాల ములో సోమయాజి కాశీయాత్రఁ జేయుచు గాశినుండి యీగ్రంథరచనకు వచ్చి యున్నాఁడని చెప్పెడుసంప్రదాయవాక్య ముభయపక్షములలో నిర్బాధకమే అయి యున్నది.''

కవిజీవితగ్రంథకారుని పై వాక్యములను మనమంతగాఁ బాటింప వలసినపని లేదు. నెల్లూరుమండలచరిత్రమును గూర్చి కాని కేతన కవికృతమై తిక్కన కంకితము గావింపఁబడిన దశకుమారచరిత్రమును గూర్చి కాని తెలియనికాలమున నాగ్రంథకర్త యట్లువ్రాసి యుండెను. ఎక్కడ రసికులగు ప్రభువులుందురో అక్కడఁ గొన్నిదినంబు లుండి యాప్రభుని కొకకృతి యిచ్చి బహుమతుల నంది మరల స్వస్థలము నకుఁ బోవునట్టియాచారముగల కవులసంఘములోనివంటివాఁడు గాక తిక్కనకవి ప్రభుకోటిలోఁ జేరినవాఁడై యున్నవాఁడు. తిక్కన కవి మాత్రుఁడేగాఁడు. మంత్రియు సేనాపతియుఁ గూడ నై యున్నవాఁ డని దశకుమారచరిత్రావతారికవలన స్పష్ట మగుచున్నది. ఇంతియ గాక కర్తయై బహువిధయాగము లనేకము లొనరించుటయు, అగ్రహారములు మొదలగువాని నొసంగి కవిపండితకోటిని సన్మానించు టయు మొదలుగాఁ గలవానిని పరిశీలించినప్పుడు తిక్కన నెల్లూరుపుర వాసి కాఁడని యెవ్వనికి సందేహము జనింపఁగలదు ? మహాభారతాం

ప్రీకరణమునకై తిక్కనసోమయాజి కాశినుండి వచ్చినాఁడని చెప్పెడు కథ పుక్కిటిపురాణము గాని విశ్వాసపాత్రము గాదు. మనుమసిద్ధిరాజు పేరు గాని, నెల్లూరుపుర నామము గాని యాంధ్రీకృతభారతమునఁ గాన రాకపోయినను తిక్కన నెల్లూరుపురవాసి కాఁడని చెప్పుట సాహస మనిపించుకొనును. తిక్కన వానినుదాహరింపకుండుటకు వేలుకారణములు గలవు. అయ్యవి క్రమముగా బోధపడఁగలవు. వేయునేల? అభినవదండినా వినుతి గాంచిన కేతనమహాకవి తన దశకుమారచరిత్రములో "కొట్టరువు తిక్కనామాత్యునకు నిజస్థానంబగు విక్రమసింహపురం బభివర్ణించెద" నని

"సీ. కరిఘటానిలయంబు తురగసంతతులును
సుభటనికాయంబు సుకవిలోకంబు,
కర్మఠద్విజనికరము రాజన్యవం
శావాన సార్వభౌమప్రశంసము
కల్పకాగారంబు కలధౌతసదనంబు
సుందరీశృంగార సంఘంబు
ధనధాన్యసంగ్రహస్థానంబు ధర్మప
థాచారవిద్యావిహారభూమి
చైలఘృతలవణాది సద్ద్రవ్యపాల
మమలబహువిధ రత్నరత్నాకరంబు
మధురజలపూర కాసారమండలంబు
నాఁగ విక్రమసింహాఖ్యనగర మొప్పు."

అను పద్యమును జెప్పి నెల్లూరును వర్ణించినదానిఁ జూపుటకంటెఁ దిక్కన నెల్లూరుపురవాసియనుటకు వేఱొండు రుజువు మఱి యేమి కావలయును?

తిక్కనబాల్యదశ – వేదవిద్యాభ్యసనము.

ఈ మానవప్రపంచమునందు ధర్మోపదేష్టలై విఖ్యాతిఁగాంచిన మహాపురుషులలో స్వప్రజ్ఞలను జూపి యడ్డంకులనెల్లఁ గడచి యున్నత

పీఠముల నధిష్ఠించినవారిలో ననేకులు బీదలయిండ్లనే జనించిరి. మన తిక్కనామాత్యునివలెఁ బుట్టుకతోడనే ప్రాభవము గలిగి పుట్టిన యదృష్టశాలి లోకములో నూటికిఁ గోటికి నెక్కడనేని నొక్కఁడు గలఁడేమో ? ప్రాభవముగలిగిన ప్రభువంశమున జనించి ప్రతిభాశాలి యై యాంధ్రప్రపంచ మజ్ఞానాంధకారమునఁబడి కన్నుఁగానక తడవు కొనుచు తపించుచున్నకాలమున జ్ఞానతేజస్సును బఱపి సముద్ధరించి యానందాబ్ధి నోలలాడింతు నని ప్రతిజ్ఞాదీక్షను వహించి సార్థకజన్ముఁడై నధన్యుని బాల్యదశ యట్టిదని తెలుపు లిఖితమూల మేదియును నేఁడు ప్రత్యక్షముగా నెదుటఁ గానరాకున్నను బరిశ్రమఁ జేసిన ధీవిశారదులకుఁ దెలియకపోదు. అక్షరాభ్యాస సంస్కారానంతరమునఁ దిక్కన వేదాదిసమస్త విద్యాభ్యాసవిభాసి యగుచు ననుదిన ప్రవర్ధనంబుఁ జెందెనని కేతనకవీంద్రుఁడు వాక్రుచ్చియున్నాఁడు. లౌకికాధికారధూర్వహులైన శ్రీమంతులయింటఁ బుట్టియుఁ దిక్కన వైదిక విద్యాభిలాషియై విద్యాభ్యాసమునకు దొరకొనుటకు హేతు వేమి యైయుండునని కొందఱచ్చెరువు నొందవచ్చును. తిక్కనపూర్వులు తరతరముల నుండియు వైదికవిద్యలను వైదికానుష్ఠానములను విడిచిపెట్టక భక్తితో ననుష్ఠించుచు వచ్చిరి. అందువలనఁ దిక్కనతండ్రి యగుకొమ్మనామాత్యుఁడు పవిత్రశీలుఁడై సాంగోపాంగముగ వేదముల నభ్యసించెను. అయిన నతఁడు దండనాథుఁడుగ నుండుటకియ్యవి యడ్డుపడలేదు. ఆకాలమునఁ దిక్కనయు, 'అవశ్యంపితురాచారం'మ్మని తనతండ్రిమార్గమునే యధికశ్రద్ధాభక్తులతో ననుసరించి ధన్యుఁ డయ్యెనుగాని మఱియొండుగాదు. "ఉదాత్తవేదవిద్యాప్రతిపాలకుఁడు, సకలవిద్యాకళాచణుఁడు, వేదత్రితయాత్మకుఁడు, వేదాది ప్రకట వివిధవిద్యాభ్యాసాపాదితమహత్త్వుఁడు, ఉదాత్తశ్రౌతస్మార్త కర్మతత్పరమతి, సకలాగమార్థతత్త్వవిచారోదారుఁడు, యాగవిద్యాభి

రాముఁడు, వేదోదితకర్మనిరతుఁడు, నానావేదవేదాంగతత్త్వజ్ఞుఁడు, తత్తనయసువచస్సమగ్రతాచతురాస్యుఁడు, అనితరగమ్యవాఙ్మయమహార్ణవవర్తనకర్ణధారుఁడు" అను విశేషణములతోఁ గేతనకవి తిక్కన నభివర్ణించి యుండుటచేతను, మఱియు నింక నిట్టివే యనేకకారణముల చేతను, సాంగోపాంగముగ వేదముల నభ్యసించి తిక్కన సమకాలికులు వారిచే వాక్పతినిభుఁ డని కొనియాడఁబడుచుండె నని మనము నిస్సంశయముగా విశ్వసింపవచ్చును. దీనింబట్టి తిక్కన పినాకినీనదీతటమున గురుకులంబున శ్రద్ధాభక్తులతో గురువులకు శుశ్రూషలు గావింపుచుఁ గ్రమశిక్షణము గలిగి వేదాధ్యయనము గావించె నని మనకుఁ దేటపడక మానదు. అగర్భశ్రీమంతుఁడై పుట్టియు నిజకులాచారధర్మరక్షణాభిరతిఁ గలిగి బీదబ్రాహ్మణబాలురతోఁ గలిసి విద్యాభ్యాసముఁ జేయుట గౌరవలోపముగా నెంచుకొనక తా నెంతయైశ్వర్యవంతుఁడైనను విద్యాసముపార్జనము లేకయున్నఁ దనజీవితము లోకములో వన్నె కెక్కి పరమార్థమును బొందఁజాల దనితలంచి తనపూర్వులవలెనే తానును వేదాదిసమస్తవిద్యాభ్యాసనము చేయవలయు నని తిక్కన సంకల్పించుకొని గురుకులంబుఁ జేరి తొలుత వేదాధ్యయనముఁ గావించినట్లు స్పష్టముగాఁ గనంబడుచున్నది. స్వధర్మము నతిక్రమింపక నడచుకొనెడు వర్తనము బాల్యమునందే తల్లిదండ్రులనుండి తిక్కన గ్రహించెను. మహత్తరమైన మనోరథసృష్టి బాల్యమునందే యంకురించినందునఁ దత్ప్రయత్నము తిక్కన దీక్ష వహించి కృషి సలిపెను. పితృమాతృభక్తి విశేషముగాఁ గలవాఁ డౌటచేతఁ బెద్దలయెడ వినయవిధేయతలను జూపుట సంభవ మయ్యెను. నిరంతరమును గురుసాన్నిధ్యమున నుండి వేదాధ్యయనము సలుపుటచేత వినయవిధేయతలు మాత్రమెగాక యోపికయు, శాంతమును, బ్రస్ఫుటమైన

వాక్కును సంపాదించుకొనఁగలిగెను. వైదికవిద్యాభిలాషి యై పినాకినీనదీతటమున గురుకులంబున గురుసాన్నిధ్యమున వేదాధ్యయనము సేయువాఁడు శుచిప్రవృత్తుఁడై యుండక మానఁడు. ఎప్పుడు విద్యార్థి శుచిప్రవృత్తుఁడై విద్యాభ్యాసము చేయునో అప్పుడే వాని తేజస్సు బహిర్వ్యాప్తిని జెందుచున్నది. ఉపనయనానంతర మీతఁడు కనీసము పదునాలుసంవత్సరము లైనను బ్రహ్మచర్యవ్రతముఁ బూనియుండినఁగాని సాంగోపాంగముగ వేదముల నభ్యసించుట సాధ్యము గాదు. తిక్కన నేర్చిన విద్యలనుబట్టికూడ నిర్మలమైనమనోవృత్తి గలిగి గురుకులంబున శౌచప్రవృత్తుఁడై నిర్మలవాయువులను బీల్చుచు, నిర్మలోదకంబుల స్నానమును జేయుచు, నిర్మలజలంబులం ద్రావుచు, పరిపక్వపదార్థములనే భుజింపుచు బ్రహ్మచర్యనిష్ఠాగరిష్ఠుఁడై, పవిత్రశీలుఁడై బహుసంవత్సరములు పరిశ్రమ చేసియు నతఁ డారోగ్యవంతుఁడును దృఢగాత్రుఁడును నై యున్నట్లు తోఁచును. ఆరోగ్యవంతుఁ డై తిక్కన వైదికవిద్యలనే గాక లౌకికవిద్యలనుగూడ నభ్యసించెను. నీతిచాణక్యుఁ డనియును, సామాద్యుపాయవిదుఁ డనియును, నీతినిపుణమతి జితపురుహూతామాత్యుఁ డనియును, అమరసచివదూరమోపహారుఁ డనియును, గలెన ప్రశంసించియుండుటచేతఁ దిక్కన దండనీతి మొదలగువాని నభ్యసించి నీతిశాస్త్రపారగుం డయ్యె నని తెలియుచున్నది. "తిక్కచమూపా, తిక్కదండాధీశా" అని పేర్కొనియుండుటచేతఁ గూడ నీతఁడు మనుమసిద్ధిరాజునకు మంత్రిమాత్రుఁడుమాత్రమె గాక సైన్యాధిపతిగఁ గూడ నుండినటులు వేద్య మగుచున్నది. ఇతఁ డిట్లు ముప్పదేండ్లు వచ్చునఱకు వేదంబులు, వాదంబులు, వీణాదివాద్యంబులు, ఆగమములు, ఆలేఖ్యకర్మంబులు, మంత్రతంత్రంబులు, మందులు, మాయలు, సింధురగంధర్వశిక్షణములు, ధర్మార్థకామశాస్త్రములు, జ్యోతిషము, కవితయు, కావ్యనాటకములు, కథలు, పురాణములు,

ఆయుధనైపుణ్యము, అంజనము మొదలుగాఁగల సమస్తవిద్యల సమస్త కళల నభ్యసించి మహామహోపాధ్యాయుఁడై ప్రవర్తింపుచుండెను.

తిక్కన రూపము

తిక్కనచరిత్రమును జదివెడువారును, వినెడువారును దిక్కన రూప మెట్లుండునా యని తలపోయనివా రుండరు. తిక్కనరూపమును జిత్రించుటకుఁ దగినసాధనము లంతగాఁ గానరావు. తిక్కన కంకితము గావింపఁబడిన దశకుమారచరిత్రములోఁ గేతనకవి కొన్నివర్ణనములను జేసియున్నాఁడు. కాని వానిని గొంద ఱవిశ్వాసకు లతిశయోక్తులక్రిందను ద్రోసిపుచ్చినను గొంతవఱకుఁ దిక్కనచిత్రపటమును లిఖయించుటకుఁ దోడుసూపక మానవు. తిక్కనమహనీయుని చిత్రపటమును జిత్రించుటకుఁ గొలుతఁ బ్రయత్నించిన యొకవిద్యాధికుఁడైన బుద్ధిశాలివాక్యములనే యిదిగువ నుదాహరించుచున్నాఁడను. *

* ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక. (విరోధికృన్నామ సంవత్సరము 1911) ౧౪౮ పేజి, మ-రా-రా-శ్రీ కె. కృష్ణరావు, బి. ఏ., బి ఎల్. గారిచే వ్రాయఁబడిన 'తిక్కన సోమయాజి చరిత్రము' అను శీర్షికగల వ్యాసమునుండి గ్రహింపఁబడినది.)

“తిక్కన కృతినందిన దశకుమారచరిత్రమునందుఁ గూడ నీయంశమును గూర్చి విపులముగ నేమియు వ్రాయఁబడ లేదు. సాక్ష్యమునంతదనుక దానినే సహాయముగాఁ గొని కొంచెము చెప్ప నుద్యమించుచున్నాఁడను. అయిన దశకుమారచరిత్రము కృతి యిచ్చినవాఁడుగాన యందుఁ గృతిపతిని వాడుకరీతిఁ బ్రౌఢోక్తుల వర్ణించి యుండునని కొంద ఱాక్షేపింతురు గాఁబోలు. అందులకు సమాధానము చెప్పెద వినుఁడు. కేతన [illegible] కేవలధనాశచే నంకిత మొసర్చినవాఁడు గాఁడు.

అట్టియాశ యుండినపక్షమున మనుమసిద్ధికే యొప్పు [illegible] ధన మార్జించి యుండును. తిక్కన యనన్యవిద్యాపాండిత్యగుణములయందుఁ దనకున్న యభిమానాతిశయంబుఁ బట్టియు నట్టిమహనీయుండు ప్రశంసించినం గాని తనచెప్పుకవిత్వము

సార్థకత నొందదనుతలంపునను నతఁడు కృతి యిచ్చెంగాని వేఱుగాదు. "కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప, నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చఁ బరఁగ దశకుమారచరితంబు చెప్పిన ప్రోఢ నన్ను నేఁడు పొగడ నేల" అనుపద్యం బీయర్థము సూచించుచున్నయది. అదియునుంగాక తిక్కనయట్టి జ్ఞానసంపన్నునకు లేనిపోని స్తోత్రపాఠంబు లుపాలంభరూపంబులై జుగుప్సాజనకంబు లగుంగాని సంతోషదాయకంబులు గానేరవు. ఒక మాట యుపక్రమితవిషయమునకుం బోదము. దశకుమారచరిత్రమునందుఁ గేతన "కనకగిరిశృంగకాంచనవక్షసఖీభాగు వకు" అని నుడివియున్నాఁడు. పద్యప్రారంభమే యిట్లుండుటచే మనము యతిప్రాసములకై తెచ్చిపెట్టికొన్నది యనఁగూడదు. "శ్రీరమణీ రమణీయమహోరస్థలి విజితకాంచనశోభిధరణీతలుండు" అని యీయర్థము నే కేతన మఱియొకచోట వ్రాసియున్నాఁడు. ఏతద్వాక్యద్వయంబు పరస్పరబలీయములై నెగడుచున్నవి. వీనిచేఁ దిక్కన పీనంబగు విస్తారంబగు నురవక్షంబు గలవాఁ డనుట వ్యక్తము. కృతిపతి యందలి యీవిశేషంబు సూచించు నిమిత్తంబుననే కేతన తనప్రథమనాందీపద్యమునందు:-

"ఉ. శ్రీరమణీకృపాంగణము చెన్ను వహింప నలంకరింపఁగాఁ
తోరణముం బ్రదీపమును దోహలి మ్ము యొకఁడూర్చినా దగం
జేరి యురంబునందుఁ దులసీవనమాలయుఁ గౌస్తుభంబు నొ
ప్పారఁగ నుల్లసిల్లుహరి యన్నను దిక్కని ధన్యుఁ జేయుతన్."

అని హరియురంబు వర్ణించియున్నాఁడు. మఱియొకచో "కల్పకపరాభవకరణధురీణదీర్ఘబాహులం డలమిసి" అని చెప్పఁబడియుండుటచేఁ దిక్కన యాజానుబాహుం డని స్ఫురించుచున్నది. వెండియు నొకచోట "జలజసుభగనేత్రుం" అని పద్యప్రారంభమున నుండుటచే మనోజ్ఞము లైన విశాలనయనంబులు గలవాఁ డనుట ద్యోతక మగుచున్నది. తిక్కన ప్రశంసలఁ గూర్చి యింతకన్న మఱేమియుఁ గేతన చెప్పఁడయ్యె. "సౌమన్స్యయుతేజుఁడు, అతివికసకరతేజుండు, మార్తాండసమానతేజుఁడు, విప్రసన్నిధానవిద్వాంసకేశకుఁడు, పవిత్రమూర్తి" అనువట్టి విశేషణంబు లచ్చటచ్చటఁ బ్రయోగింపఁబడియున్నవి. వీనిచేఁ బ్రకాశించు నరుణరుచి గలవాఁ డని తెలియుచున్నది. దీర్ఘబాహుఁ డని తొల్లి వ్రాసియుండుటచే దానికనురూపంబుగ నున్నతకాయుం డనుట తెల్లము. మఱియుఁ దిక్కన యతని పితృపితామహులవలె సైన్యాధిపతి. ఈవిషయము 'తిక్కదండాధీశా, తిక్కచమూపా' అని కేతన వాడియుండుసంబుద్ధలచేఁ దేటపడును. వాహినీపతిత్వమున కున్నత

కాయుఁడే యన్నా లనుట ప్రసిద్ధము. కాఁబట్టి తిక్కన కేవలహ్రస్వుండుగాక మనుజసామాన్యమైన శరీరపరిమాణంబు గలిగి యుండె ననుట స్పష్టమగుచున్నది. ఇప్పుడు మనకుఁ దిక్కన విశాలవక్షుఁ డనియు, దీర్ఘబాహుఁ డనియు, విశాలనేత్రుఁ డనియు, నతితేజస్వి యనియు నేర్పడెను. అతఁ డతిసుందరమూర్తి యని కేతన ప్రత్యాశ్వాసాద్యంతపద్యములందును నుడివియున్నాఁడు.

> "తనదుర్వారతరప్రతాపమునఁ జిత్రస్థాయిమున్ గాఁచె నే
> యు నితం డెట్టివిపక్షులన్ దలఁపఁ డీయర్థంబు లాఁ గాంచెనో
> యనఘుం డిం దరమొప్ప దక్షుఁ డని రాజన్యుండు తా నెన్ని నా
> ఘనసంపన్నుఁ గృతీశ్వరుం బ్రకటసౌందర్యమూర్తిం జేయుఁగన్."

అని కవులలో నంతగా వాసికెక్కని మూలఘటిక కేతనము నొక యాశీర్గర్భక పద్యమునే వ్రాసియున్నాఁడు.

ఇట్లు బుద్ధినైశారద్యు లైనకృష్ణరావుగారు తిక్కన సుందరాకృతిని చిత్రించి యాంధ్రప్రపంచమునకు వంద్యు లగుచున్నారు.

నాలుగవ ప్రకరణము

మనుమసిద్ధిరాజు - తిక్కనమంత్రి

వీరసోమేశ్వరుఁడు మొదలుగాఁ గర్ణాటులను, మారవర్మసుందరపాండ్యుఁడు మొదలుగాఁ బాండ్యులను, మహారాజసింహుఁడు మొదలుగా ద్రావిడులను రణములో జయించి కాంచీపురమున రాజరాజచోళుని సింహాసనమునఁ గూరుచుండఁబెట్టి పట్టాభిషిక్తుని గావించి చోళస్థాపనాచార్యబిరుదము గాంచినతిక్కరాజు క్రీ. శ. ౧౨౪౦ వఱకుఁ బరిపాలనముఁ జేసె నని యిదివఱకె తెలిసికొనియున్నారము. అతని వెనుక నతనికుమారుఁడు మనుమసిద్ధిభూపాలుఁడు విక్రమసింహపురంబునఁ బట్టాభిషిక్తుఁడై పరిపాలనము చేసెను. ఏసంవత్సరమున

సీతఁడు సింహాసన మధిష్ఠించి పరిపాలనము చేయఁ బ్రారంభించెనో మనకు నిశ్చయముగాఁ దెలియరాదు గాని యీతఁడు ౧౨౪౦ వ సంవత్సరము తరువాతనుండి పరిపాలనము చేసినట్లు మన మూహింపవచ్చును. ఇతఁడును దండ్రివలెఁ బరాక్రమవంతుఁడె కాని యంత యదృష్టశాలి కాఁడు. ఇతనిపూర్వపుణ్యవశమున మహనీయుఁ డగు కవితిక్కన మంత్రిగ నుండుటచేఁ బ్రఖ్యాతికి వచ్చెను. ఇట్టిరాజు లెందఱో యూరును బేరును లేక నశించిపోయిరి. కవితిక్కనమూలమున మనుమసిద్ధి యెట్టివాఁడో మనకుఁ దెలిసికొనుట సంభవించినది. తిక్కరాజుకాలమునందే మనుమసిద్ధిభూపాలునకును కవితిక్కనకును మైత్రి సంభవించినది. తనపెదతండ్రి సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రిగ సేనాపతిగ నుండుటంజేసి కవితిక్కన మనుమసిద్ధిరాజుతో మైత్రి నెఱపుటలో వింత యేమియును లేదు.

సిద్ధనామాత్యునికిఁ గలసోదర్యపుత్రులలోను జ్యేష్ఠుఁ డగు తిక్కనామాత్యుఁడు మనుమసిద్ధిభూపాలునకు మంత్రిగను సేనాపతిగ నుండెను. ఈతిక్కనామాత్యునితమ్ములు మూవురును గొమ్మఱ్ఱిపురును మనుమసిద్ధిభూపాలునికొల్వుననే యుండిరి. కొట్టరువువారికుటుంబము చాల గొప్పది. ఈతిక్కనామాత్యునే యిటీవలివారు ఖడ్గతిక్కన యని వ్యవహరించుచున్నారు. వీనితోఁబాటు కవితిక్కన గూడ మనుమసిద్ధిభూపాలునికడ మంత్రిగను సేనాపతిగఁ గూడ నుండెను. మనుమక్ష్మాపాలమంత్రి మాణిక్యఁ డనియు, మనుమసిద్ధిమహీశసమస్తరాజ్యభారధౌరేయుఁ డనియుఁ, గవితిక్కనను వర్ణించి ఖడ్గతిక్కనను గేతన యట్లు చెప్పకుండుటచేత ఖడ్గతిక్కనకంటెను గవితిక్కన మనుమసిద్ధికి నధికకరుణాపాత్రుఁ డయ్యె నని చెప్పవలసి యుండును. మనుమసిద్ధి విద్యాగంధము లేనిమూర్ఖుఁడు గాఁడు. ఇతరు లాడించినట్లాడుటకు వారిచేతిలోని జంత్రపుబొమ్మ కాఁడు. కేతనకవి

సుకృతాత్ముఁ డైనమనుమసిద్ధిని కీర్తిపాత్రుం డని తెలుపుచు నీక్రింది పద్యముచే నిట్లభివర్ణించెను.

"సీ. వీరారివర్గవిదారణక్రీడ న
ద్యతనజగత్త్రా[illegible] డనఁగఁ
బరధనదారాపహరణానపేక్ష[illegible]త్తి
[illegible]
స[illegible]జనవాంఛితా[illegible]సం[illegible]
[illegible] మొనభినవకర్ణుఁ డనఁగఁ
గా[illegible] కొ[illegible]
కొ[illegible]
గీ. [illegible]
[illegible]
[illegible]
[illegible]."

ఇట్టిమనుమసిద్ధిభూపాలునికడఁ గవితిక్కనయు, ఖడ్గతిక్కనయు మంత్రులుగా నుండి విఖ్యాతిఁ గాంచిరి. కొట్టరువుతిక్కనామాత్యకవి మనుమసిద్ధియొద్ద వహించినమంత్రిపదవి నిజకులక్రమాగతం బైనదని కేతన నుడివి

"గీ. అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలిశంఖములును
గంబకట్లు భూమి కానిక గాఁగఁ బెం
పెసఁగు రాచపదవు లెల్లఁ బడసె."

అని చెప్పుటవలన నతఁడు సమస్తసంపత్సమేతుఁ డై రాజ్యసుఖంబు లనుభవించుచుండె ననుట యతిశయోక్తి కాదు. ఇతని పెదతండ్రి కుమారుఁ డగుఖడ్గతిక్కనయు నితనివలెనే, సమస్తసంపత్సమేతుఁ డై తమ్ములతోడను, గొమాళ్ళతోడను రాజ్యసుఖంబు లనుభవించుచుండె ననుట సత్యవిరుద్ధము కాదు. కేతనకవి తిక్కనకవివంశవర్ణనముఁ

జేయునపుడు సిద్ధనామాత్యనందనుఁ డగుఖడ్గతిక్కన నిట్లభివర్ణించి యున్నాఁడు.

"సీ. వేఁడిన నర్థార్థి వృథపుచ్చ నేరని
దానంబు తనకు బాంధవుఁడు గాఁగ
సేరిన జముఁడైన బ్రదికిపోవఁగనేని
శౌర్యంబు తన కిష్టసఖుఁడు గాఁగ
శరణంబు చొచ్చిన శత్రువరుఁడైన రక్షించు
కరుణయు తనకు సంగడము గాఁగఁ
బలికినఁ బాండవప్రభుఁడైన మెచ్చని
సత్యంబు తనకు రక్షకుఁడు గాఁగ
జగతి నుతికెక్కె రాజవేశ్యాభుజంగ
రాజ్యసాహాయ్యకరణైక రాజమూర్తి
గంధవారణబిరుదవిఖ్యాతకీర్తి
దినపతేజుండు సిద్ధయతిక్కశౌరి."

మఱియును సిద్ధయతిక్కనామాత్యునిగృహము ప్రతిదిన మెట్లుండునో యావివరమును మఱియొకకవి

"సీ. తర్కవివాదంబు వేదనినాదంబు
పాయక యేప్రొద్దు మ్రోయుచుండు
భూసురప్రకరంబు సేసలు చల్లఁగ
బాయ కెన్నియొ కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలు పోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కొసఁగిన పత్రికలపుత్త్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుంద్రు
గీ. మానఘనుఁడైనతిక్కనమంత్రియింట
మదనసముఁడైనతిక్కనమంత్రియింట
మహితయశుఁడైనతిక్కనమంత్రియింట
మంత్రిమణియైనతిక్కనమంత్రియింట."

అని మనోహరముగా నభివర్ణించియున్నాఁడు. ఇట్టిమహానీయు లగుమంత్రివర్యులసాహాయ్యముతో మనుమసిద్ధిభూపాలుఁడు కొంత కాలము విక్రమసింహపురము రాజధానిగాఁ జేసికొని రాజ్యపరిపాలనము చేసి విశుద్ధయశమును గాంచెను. ఇతఁడు మొట్టమొదట పేరునకుమాత్రము రాజరాజచోడునకు సామంతుఁడుగా నుండినను మూఁడవరాజేంద్రచోడుని కాలమున స్వతంత్రుఁడై కడపట కాకతీయాంధ్రచక్రవర్తి యగుగణపతిదేవునకు లోఁబడినసామంతుఁడై రాజ్యపరిపాలనము చేసెను. చాళుక్యచోడచక్రవర్తు లయిన రాజరాజచోడుఁడును, రాజేంద్రచోడుఁడును బిరుదమాత్రచక్రవర్తులే కాని నిజముగాఁ జక్రవర్తిపదము నధిష్ఠించి పరరాజులనుండి కప్పములు గైకొనుచుఁ దమయధికారమును వారలపైఁ జూపు శక్తిగల వారై యున్నట్లు గానుపింపరు.

మనుమసిద్ధినాఁటికాలస్థితి

పదుమూఁడవశతాబ్ది ప్రారంభమునుండి యాంధ్రదేశమునఁ జాళుక్యచోడచక్రవర్తులయధికారము నశించిపోయి కాకతీయాంధ్ర చక్రవర్తులయధికారము నానాముఖముల వ్యాప్తి జెందుచుండె నని చెప్పవచ్చును. చాళుక్యచోడచక్రవర్తి యగు మూఁడవరాజరాజ చోడునకును, మూఁడవరాజేంద్రచోడునకును సింహాసనమునుగూర్చి పోరాటములు జరుగుచుండెను. ఈ పోరాటములలో ద్రావిడాంధ్ర కర్ణాటకు లేదేనియొకపక్షమునఁ జేరి రెండవపక్షముతోఁ బోరాడు చుండిరి. మనుమసిద్ధితండ్రి యగుతిక్కరాజు కర్ణాటకులను ద్రావిడులను జయించి రాజరాజచోడుని రాజ్యమున నిలిపి కొంతకాలము పరిపాలనము చేసెను గాని వానిమరణానంతరము రాజేంద్రచోడుఁడు విజృంభించి పాండ్యులను గర్ణాటులను జయించి రాజరాజును జరపి

కాంచీపురసింహాసన మాక్రమించుకొని పరిపాలనము సేయుచుండెను. క్రీ. శ. ౧౧౯౯ వ సంవత్సరమున నేకశిలానగరమునఁ బట్టాభిషిక్తుఁడై గణపతిదేవచక్రవర్తి ౧౨౫౦-వ సంవత్సరమునాఁటికే వెలనాడు, పొత్తపినాడు, రేనాడు, ములికినాడు, గండికోట, మార్జవాడిసీమలను జయించి ద్రావిడకర్ణాటరాజులతోఁ బోరాడుచుండెను. ఆకాలమున దక్షిణహిందూస్థానమునఁ దమసామ్రాజ్యములను స్థాపింపఁబూని దేవగిరి యాదవులును, ఓరుగంటి కాకతీయులును, హాలెవీటి హొయిసనులును, మధురాపుర పాండ్యులును, కాంచీపుర చాళుక్యచోడులును హోరాహోరిగఁ బోరాడుచుండిరి. చాళుక్యచోడసామ్రాజ్యము నశింపఁగాఁ దత్సింహాసనమునకై చోడులలోఁ జోడులకు నంతఃకలహములు పుట్టి తమలోఁదాము పోరాడుచు నన్యులసహాయమును వేఁడుచు నేతన్మూలమునఁ గ్రమక్రమముగా స్వాతంత్ర్యములను గోలుపోవుచు ననేకకష్టములం బడుచుండిరి. పూర్వము పశ్చిమచాళుక్యులు పరిపాలించినకుంతలదేశముయొక్క ప్రాగ్భాగమును గాకతీయాంధ్రులును, ఉత్తరభాగమును దేవగిరియాదవులును, దక్షిణపశ్చిమభాగములను హొయిసలకర్ణాటులు నాక్రమించుకొనిరి. కావున మనుమసిద్ధిభూపాలునికాలమున రాజకీయవాతావరణములోఁ దెలుఁగుచోడు లసుఖస్థితియం దున్నవా రని చెప్పవలసియుండును. మనుమసిద్ధిభూపాలుఁడు కొంతకాలము చాళుక్యచోడచక్రవర్తి యగు మూఁడవరాజేంద్రచోడునకు సామంతుఁడుగ నున్నట్లు కానంబడుచున్నాఁడు. అయినను యుద్ధములు వచ్చినప్పుడు తోడ్పడుటతక్క తదితరవిషయములలో స్వతంత్రపరిపాలనమునే చేయుచుండెను. ఎట్టులయినను మనుమసిద్ధిరా జిరువదిసంవత్సరములు రాజ్యపరిపాలనము చేసినట్లు గనంబడుచున్నది.

మనుమసిద్ధి శత్రురాజులను జయించుట

తిక్కన తననిర్వచనోత్తర రామాయణమున మనుమసిద్ధిభూపాలుని విజయములను బేర్కొనియుండెను. అందు మొదటిపద్యమిట్లున్నది.

"మ. ద్రవిడోర్వీపతిగర్వముం గదిమి శౌర్యం బొప్పఁ గర్ణాటవ
ర్గవిఘాతంబు నొనర్చి కరుణసింహప్రశ్రేణిం గొనగా
నవనిం బేర్కొని యున్నయట్టి విజయాఖ్యక్ష్మాధిపుం గాసిగా
నెవిచెం జోళనమనుమసిద్ధి యని ప్రాయేటం బ్రగల్భోన్నతిన్."

ఈపైపద్యమున విజయక్ష్మాధీశ్వరుని జయించె నని చెప్పఁబడియున్నది. ఇందలి విజయక్ష్మాధీశ్వరుఁ డెవ్వఁడో తెలిసికొన సాధ్యము గాకయున్నది. విజయక్ష్మాధీశ్వరుఁడు మనుమసిద్ధి దాయాదుఁడేమో యని సంశయము గలుగుచున్నది. విజయగండగోపాలుఁడు ౧౨౬౦-వ సంవత్సరము మొదలుకొని ౧౨౯౧ వఱకుఁ గాంచీపుర మండలమును బరిపాలించినట్లు గనంబడుచున్నది. ఇతనిశాసనములు కాంచీపురమండలముననేగాక నెల్లూరు, గూడూరు, సుళ్లూరుపేట తాలూకాలలోఁ గానుపించుచున్నవి. ఇతనికిఁ ద్రిభువనచక్రవర్తి యనుబిరుదము కలదు. ఇతఁడు చాలకాలము బ్రదికియున్నవాఁడు గావున వయస్సున మనుమసిద్ధికంటెఁ జిన్నవాఁడై యుండును. ఇతఁడు మూఁడవరాజేంద్రచోడునకుఁ బిమ్మట స్వతంత్రుఁడై కాంచీపురమండల మేలె నని తోఁచుచున్నది. ఇతఁడు మొదట రాజేంద్రచోడుని పక్షమునఁ గాని లేక జటవర్మసుందరపాండ్యునిపక్షమునఁ గాని చేరి మనుమసిద్ధిరాజుతో యుద్ధము చేసి యోడిపోయియుండవచ్చును. ఇందునుగూర్చి యాంధ్రులచరిత్రమం దిట్లు వ్రాయఁబడియెను.

"తిక్కరాజుమరణానంతరము పాండ్యరాజులు తమతోంటిపూనికను విడనాడక కాంచీపురము మొదలుకొని యుత్తరభూమిని జయింపఁ గోరి పలుమాఱు

దాడి వెడలివచ్చి నెల్లూరునకు దిగువ నున్న దేశమును కొల్లలపెట్టుచుండిరి. వారిలో జటవర్మసుందరపాండ్యమహారాజు ప్రముఖుఁడుగా నుండెను. క్రీ. శ. ౧౨౪౯-వ సంవత్సరమునఁ గాకతీయగణపతిదేవచక్రవర్తి యాంధ్రదేశమునుండి పాండ్యరాజులను 'పాఱఁద్రోలి కాంచీపురమున నొకదేవాలయములో నొకదానశాసనమును 1 వ్రాయించెను. అయినను జటవర్మసుందరపాండ్యమహారాజు మఱుసటిసంవత్సరమునం దనఁగా ౧౨౫౦-వ సంవత్సరమునఁ గాంచీపురమార్గమున నాంధ్రదేశముపై దండెత్తివచ్చి తెలుఁగు చోడరాజులను జయించి మనుమసిద్ధిరాజును నెల్లూరు నుండి పాఱఁద్రోలి సిద్ధిరాజునకు శత్రువు లైనవీరులను పట్టాభిషిక్తులను గావించి నెల్లూరిలోని పల్లికొండపెరుమాళ్ళదేవునకు మండవాటిలోని మావడిగుండగ్రామమును దానము చేసె నని తెలిపెడిశాసన మొకటి రంగనాయకస్వామిదేవాలయములో నొకస్తంభముపై వ్రాయించెను. 2 ఆసంవత్సరముననే విజయగండగోపాలదేవుఁడు కాకతీయులసాహాయ్యమును బడసి కాని పడయక కాని జటవర్మసుందరపాండ్యదేవుని వానిసైన్యములను నెల్లూరిమండలమునుండి పాఱఁద్రోలియుండవలయును ఈవిజయగండగోపాలుని నే తరువాత మనుమసిద్ధి యెదిరించి పోరాడి విజయమును గాంచియుండవచ్చును. విజయగండగోపాలుఁడు జయించిన ద్రవిడోర్వీపతి !జటవర్మసుందరపాండ్యుఁడు గాక కాంచీపురాధిపతి యైన మూఁడవవీరరాజేంద్రచోడచక్రవర్తియో యగునెడల ౧౨౬౭-వ సంవత్సరమునకుఁ బూర్వముననే మనుమసిద్ధి వానిని జయించియుండవలయును. పైనఁజెప్పినదే వాస్తవ మైనయెడల ౧౨౫౦-వ సంవత్సరము తరువాత నే నిర్వచనోత్తరరామాయణము రచింపఁబడియుండవలయును. ఈ త్రిభువనచక్రవర్తి విజయగండగోపాలుఁడు మనుమసిద్ధికి సమకాలికుఁడు."

మఱియు మన్మజనపాలుఁడు గంగయసాహిణి నోడించి తనయాశ్రితవత్సలవృత్తి తేటపడునట్లుగా బల్విడి నాఁచికొన్న రాజ్యాంగములన్నియు నిచ్చి పదముఁ గైకొనఁ బంచెనని నిర్వచనోత్తరరామాయణమున నీక్రిందిపద్యములో నక్కాణింపఁబడి యున్నది.

"ఉ. రంగదుదారకీర్తి యగు నా గంగని బంజలంబుపై
భంగ మొనర్చి మన్మజనపాలుఁడు బల్విడి నాఁచికొన్న రా

1 Indi Ant. Vol. XXI. p. 202; Ep—Ind. Vol. VII. No. 588. Kielhorn's list of Inscriptions of Southern India.

2 Nellore Inscriptions. Vol. II No. 61

జ్యాంగము లెల్ల నిచ్చి తనయాశ్రితవత్సలవృత్తి యేర్పడన్
గంగయసాహిణిం బదముగాఁ గొనఁ బంచెఁ బరాక్రమోన్నతిన్."

ఈగంగయసాహిణి కాకతీయాంధ్రచక్రవర్తి యగుగణపతి దేవునిసైన్యమున కధ్యక్షుఁడును, రాజప్రతినిధి యై నిజాము రాష్ట్రములో నిప్పుడు చేరియున్న నల్లగొండసీమలోని పానగల్లు మొదలుకొని మార్జవాడి (కడపమండలములోని వల్లూరు రాజధాని) వఱకుఁ గలదేశము నంతయుఁ బరిపాలించుచుండిన యొకయున్నతరాజకీయాధికారి గాని సామాన్యుఁడు కాఁడు. ఇతనికి గ్రహరాక్షసుఁ డనుబిరుదు గలదు గనుకనే రక్కసగంగ యని పేర్కొనఁబడియున్నాఁడు. ఈగంగయసాహిణి కాయస్థకులస్థుఁ డని పుష్పగిరిలోని యొకశాసనమువలనఁ దెలియుచున్నది.* ఈగంగయసాహిణింగూర్చి యాంధ్రులచరిత్రమునం దిట్లు వ్రాయఁబడియున్నది.

"ఇట్టి మహాపరాక్రమవంతుఁడైన గంగయసాహిణి నాకమండలాధిపతిగ నున్న మనుమసిద్ధి యెట్లు జయించి యతనిరాజ్యాంగములెల్ల నాఁచికొనియెనో, ఎట్లాతఁ డాశ్రితుఁడై యితనిం బ్రార్థించెనో, ఎట్లితఁ డాశ్రితవత్సలవృత్తి యేర్పడునట్లుగా నాఁచికొన్న రాజ్యాంగములెల్ల నిచ్చి పదముఁ గైకొనఁ బంచెనో, ఎంతమాత్రమును బోధపడకున్నది." అని యీచరిత్రకారుఁడు రెండవప్రకరణములో మనుమసిద్ధిరాజులఁ గూర్చినఘట్టమున వ్రాసియున్నాఁడను. ఇటీవల స్థానిక చరిత్రములం బరిశీలింపఁగా గంగయసాహిణియొక్క పూర్వవృత్తాంతము కొంతవఱకుఁ దెలియవచ్చినది. గంగయసాహిణి మొట్టమొదట గణపతిదేవచక్రవర్తి కొలువులో లేఁడనియు, మనుమసిద్ధిరాజుతండ్రియైన తిరుకాళచోడమహారాజునకు (తిక్కరాజు) అగ్రసేనాధిపతిగ నుండె ననియు సిద్ధవటముసీమలోని యోగూరు స్థానికచరిత్రమునఁ జెప్పఁబడినది. ఇతఁడు మొదట తిక్కభూపాలునకు సేనాధి

---

* "యోగండపెంజెరక నాథదేయః
కాయస్థ వంశోద్భవ కర్ణధారః
శ్రీగంగ సేనాపతిరస్యకాన్తా
కాన్తిర్హి మాం శోభవశా బలాయః"

పతిగ నుండి యతనియనంతరమునఁ గలుకడపురవరాధీశ్వరుం డైన శ్రీమన్మహామండలేశ్వర త్రైలోక్యమల్ల భుజబల వీరనారాయణ రాయదేవ మహారాయల సైన్యాధీశుఁడై పోతుకూరునం గుండి ములికినాటిని బరిపాలనము సేయునపుడు తిక్కరాజు కొడుకు గనమనుమసిద్ధిరాజుతో యుద్ధము చేసియుండవచ్చును. ఆయుద్ధమునం దోడిపోయి మనుమసిద్ధిని నాశ్రయించినందువలన నతఁడు తనయాశ్రితవత్సలవృత్తి యేర్పడునట్లుగా యథాస్థానమునకుం బంపె నని స్పష్ట మగుచున్నది. కాకతిగణపతిదేవచక్రవర్తి గండికోట, ములికినాడు, రేనాడు, పెనదాడి, సకిలినాడు, ఏరువనాడు, పొత్తపినాడు మొదలగుసీమల నెల్ల జయించి గంగయసాహిణిఁ దనకు సైన్యాధ్యక్షునిగ నియమించి యాసీమల కతనిఁ బ్రతినిధిగ నుండి యాసీమలఁ బరిపాలించునటు లనుజ్ఞ నొసంగెను. కావున నప్పటినుండియు గంగయసాహిణి సర్వాధికారి యగుచు సైన్యాధ్యక్షుఁడు ... మహామండలనియోగాధిపతి యగు ప్రతినిధిపరిపాలకుఁడై మిగుల వాసి గాంచెను. ఈ మండలికరాజుల నెల్లరను గణపతిదేవచక్రవర్తికి లోఁబడఁజేసి యెల్లరను శాసించి యగుపులో నుంచి కప్పములు గైకొనుచుఁ బ్రఖ్యాతుఁ డైనందున గంగయసాహిణికి మాండలికబ్రహ్మరాక్షసుఁ డనియు, రక్కసగంగ యనియుఁ బేరులు కలిగెను ... .గంగయసాహిణి చేసిన దానధర్మములనుగూర్చి శాసనము లనేకములు కడప, కందనోలు మండలములలోఁ గానవచ్చుచున్నవి. ఇతఁడు శివబ్రాహ్మణభక్తి గలవాఁ డగుటచేత ననేక శివాలయములకును, బ్రాహ్మణులకు ననేక భూదానములను గావించి ప్రఖ్యాతుఁ డయ్యెను.''

మఱియు మనుమసిద్ధిరాజు మహారాష్ట్రసామంతుఁ డైనసారంగుని జయించె నని నిర్వచనోత్తర రామాయణమున నీక్రిందిపద్యములోఁ జెప్పఁబడియున్నది.

> ''శా. శృంగారంబు నలంగ దేమియును బ్రస్వేదాంకురశ్రేణి లే
> దంగంబుల్ మెలుఁ గేద వింమఱియు మాహారాష్ట్రసామంతు సా
> రంగుం దోలి తురంగముం గొనిన సంగ్రామంబునం దృప్తస
> ప్తాంగస్ఫారయశుండు మన్మవిభు పంపె చన్న సైన్యంబునన్.''

ఇందునుగూర్చి యాంధ్రులచరిత్రమునందు వ్రాయఁబడియున్న వాక్యములనే యిం దుదాహరించుచున్నాఁడను.

"ఇంకను చేర్కొనఁబడిన సారంగుఁడు, అతివిషమహయారూఢప్రౌఢరేఖావంతుఁడును, పరబలకృతాంతుఁడును, రాయరాయ వజ్రపంజరుఁడును, మండలీకరవండోలియు, జీవరక్షచక్రనారాయణుఁడను బిరుదు శ్రీమన్మహామండలేశ్వర శ్రీసారంగపాణి దేవరాజే కాని యన్యుఁడు కాఁడని తోఁచుచున్నది. ఇతఁడు కాకతీయ గణపతిదేవునకు సామంతుఁడుగ నుండి యద్దంకిసీమకుఁ బరిపాలకుఁడుగ నుండెను. ఇతనితండ్రి మాధవదేవరాజు. ఇతఁడు మనుమసిద్ధి సమకాలికుఁడై యుండెను. గోవిందనాయకుఁ డీతనికి మంత్రిగ నుండెను. ఇతనిపూర్వులు మహారాష్ట్రములోని శౌణదేశమునుండి వచ్చినటులు తెలియుచున్నది. కొండపల్లి నిర్వచనోత్తరరామాయణమునఁ జేర్కొనఁబడిన సారంగుఁ డితఁడే యనుటకు సందియము లేదు."

అని వ్రాసియున్నాఁడను గాని మహారాష్ట్రదేశమునుండి మఱియొక సారంగుఁడు పశ్చిమపాకనాడుపై దండెత్తివచ్చి దోఁచుకొనఁ బ్రయత్నించినపుడు మనుమసిద్ధి వానిని పాఱఁద్రోలెననియుఁ దెలియుచున్నది. భావిపరిశోధనమునఁగాని యిది యథార్థమని నిర్ణయింపఁ జాలము.

బ్రాహ్మణులకు వెలమలకును వివాదము

పూర్వకాలమున ముక్కంటికాడువెట్టి యను పల్లవరాజొకఁడు శ్రీశైలమునకుఁ దూర్పుననుండు దేశమున డెబ్బదియగ్రహారములను గల్పించి బ్రాహ్మణులకు దానము చేసియుండెనఁట. అధిరాజేంద్ర చోళమండల మనియెడు పశ్చిమప్రాజ్ఞాటిలోని పేరంగండూరను గ్రామము వానిలో నొకటిగా నుండెను. ఈగ్రామము నేఁబదిరెండుభాగములుగా విభాగించి ముక్కంటికాడువెట్టి బ్రాహ్మణులకు ధారపోసి యుండెను. అప్పటినుండియు నాబ్రాహ్మణులు పుత్త్రపౌత్త్రపారంపర్యముగా నిరాతంకముగా ననుభవించుచుండిరి. ఇట్లుండ సకలికోడూరులో నుండు వ్యవసాయదారులు తమదేశమునందు గొప్పకలహము జనించుటచేత తమదేశమును విడిచి వలసవచ్చి యీగ్రామములోని చెఱువున కుత్తరభాగమున వసతులేర్పఱుచుకొని నివసించుచుండిరి.

మఱియును ఇనుప బ్రోలుగ్రామవాసు లైన వెలమలు కొందఱు తమ గ్రామమున మహామారిజ్వర మంకురించి ప్రజానాశముఁ గలిగించు చుండుటచేత నా గ్రామమును విడిచిపెట్టి యీ బ్రాహ్మణాగ్రహారమునకుఁ జనుదెంచి తా మాశ్రయించుకొనెడు పొలములలో నెంతపంట పండునో యంతయు మొత్తమును బన్నుగాఁ జెల్లించుపద్ధతిపై నొడంబడికఁ జేసికొని గుడిసెలు కట్టుకొని కాఁపురముండుచువచ్చిరి. తరువాత నొక ప్పుడు మీనరాశియందు శని ప్రవేశించుటచేత దేశమునఁ గాటకము సంభవించెను. ఆ కారణముచేత బ్రాహ్మణు లా గ్రామమును విడిచి పెట్టి పోయిరి. కాటకము గడచిపోయినకొంత కాలమునకు బ్రాహ్మ ణులు మరల స్వగ్రామములోఁ బ్రవేశించిరి. తమ యొడంబడిక ప్రకారము వెలమలు తమకట్టుబడులను బ్రాహ్మణులకుఁ జెల్లింపరైరి. ఇంతియగాక యీ యగ్రహారము పరిపాలనము చేయునట్టి ప్రభు వైన మనుమసిద్ధిరాజు వారలయ్యెను. అందుపై నా బ్రాహ్మణులు పరి పాలనము చేయునట్టి మనుమసిద్ధిరాజుకడకుఁ బోయి తమకష్టములను గూర్చి మొఱ పెట్టుకొనిరి. అతఁడు సదయహృదయుఁడై యినం బ్రోలువాసు లైన వెలమలకు వర్తమాన మంపి పాకనాటిలోని ప్రజల సాహాయ్యమును బడసి వారివివాదమునుగూర్చి విమర్శ జరిపెను. ఆవిమర్శలో నాభూములు బ్రాహ్మణుల వైనటులు తేలినందున వీర రాజేంద్రచోడచక్రవర్తియొక్క పదుమూఁడవసంవత్సరపరిపాలన కాలమున అనఁగా శా. శ. ౧౧౭౫ (క్రీ. శ. ౧౨౫౩-౫౪) దవ సంవత్సరమునఁ దనతండ్రి తిరుకాళదేవమహారాజు పుణ్యముకొఱకు మనుమసిద్ధిరాజు కొండూరు గ్రామమును బ్రాహ్మణులకు దానము చేసెను. ఈవిషయములు కడపమండలములోని నందలూరి యందలి శాసనములలో నొకదానివలనఁ దేటపడుచున్నవి.* దీనింబట్టి పదు

* Annual Report on Epigraphy of 1907 No. 500

మూఁడవశతాబ్దికిఁ బూర్వము పాకనాటిలో మహామారిజ్వరము (ప్లేగు) గాని, అటువంటిదే మఱియొక యంటువ్యాధి గాని వ్యాపించి యుండె ననియు, అట్టిస్వగృహములను విడిచి పట్టి పొలములలో గుడిసెలు వేసికొని కాఁపురముండుట క్షేమకరమని ప్రజలు తెలిసికొని యున్నా రనియుఁ బై శాసనములందలి విషయములు స్పష్టముగఁ దెలుపుచున్నవి. ఈశాసనములో నుదాహరింపఁబడిన కోడూరు గ్రామము కడపమండలములోని పుల్లంపేటతాలూకాలో నున్నది. పేరంగండూరుగ్రామ మిప్పుడు కానరాదు. పై శాసనములో మనుమసిద్ధిరాజు వీరరాజేంద్రచోడచక్రవర్తికి సామంతుఁడుగ నున్నటులు గనంబడుచున్నను స్వతంత్రుఁడై పరిపాలనము చేయుచుండె నని మన మూహింపవచ్చును.

అయిదవ ప్రకరణము

అక్కన బయ్యనల దండయాత్ర

అక్కనబయ్యన లను మనుమసిద్ధిరాజుదాయాదులు బలియులై విక్రమసింహపురముపై దాడి వెడలివచ్చి యుద్ధము చేసి యాయుద్ధములో మనుమసిద్ధిరాజు నోడించి యాతనిఁ బాఱఁద్రోలి రాజ్యము నాక్రమించుకొని యుద్దండలీలఁ బరిపాలనము చేయసాగిరి. దీనికై యెంతయును జింతించుచు మనుమసిద్ధిరాజు మంత్రియు నాస్థానకవియు నగుతిక్కనసోమయాజి మనుమసిద్ధిరాజుపక్షమును బూని కాకతీయులరాజధాని యైనయేకశిలానగర మనునామాంతరము గలయోరుగంటికిఁ బోయి గణపతిదేవచక్రవర్తికి భారతాఖ్యాన

మును వినిపించి యతనివలన బహుమానములను బడసి యతనితో మనుమసిద్ధిదురవస్థను దెలుపఁగా నాతఁడు సదయహృదయుఁడై సోమయాజులరాయబారమును శిరసావహించి బహుసైన్యములతో దండెత్తి వచ్చి అక్కన బయ్యనలను నెల్లూరునుండి పాఱఁద్రోలి మనుమసిద్ధిని బునరభిషిక్తుని గావించి వెడలిపోయెనని సిద్ధేశ్వరచరిత్రము లోని యీక్రిందిచరణములవలన బోధపడఁగలదు.

“ సారెసారెకుఁ గేరి సన్నుతుల్ చేయ
సారసారావార సరసగంభీర
సారుఁడై కీర్తివిస్తారుఁడై యలరు
నారీతి గణపతి నటుచూచు వేడ్కఁ
దిక్కనసోమయాజక్కడ కొకట

* * *

దిక్కుదిక్కులనుండి తెరలి విద్వాంసు
లక్కడక్కడను గావ్యముల శ్లోకాల
మొక్కొక్కవిధమున నరిగి వినిపింపఁ
జక్కనవినుచును నొక్కయందలము
నెక్కి తిక్కనసోముఁ డక్క డేతెంచె
నారీతిగా సోమయాజులరాక
వారక చని ఫణిహారులు చెప్ప

* * *

అట్టిమహాత్ముని నాసోమయాజి
నెట్టన యెదురేగి నేర్పుతో రాజు
తెచ్చి యర్ధాసనస్థునిగాఁ జేసి
మెచ్చి తాంబూలాదు లెచ్చుగా నిచ్చి

* * *

అగు భారతాఖ్యాన మావీరవరులు
తగఁ జేసిరట్టి యుద్ధప్రకారముల
వినియు సంతోషించెఁ గనినట్లు చెప్ప

* * *

అంతఁ దిక్కనసోమయాజికి మెచ్చి
వింతవస్త్రంబులు వివిధభూషణము
లత్యంతభక్తితో నప్పు డిచ్చుచును

4

సత్యసంధుండును సత్యవ్రతుండు
నగుసోమయాజి తా నారాజు కనియెఁ
దగుమాట విను మొక్క ధర్మకార్యంబు
సూర్యవంశంబున సొబ గొందునట్టి
యార్యపూజితచర్యుఁ డామన్మసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల

* * *

అక్కనబయ్యన లధికగర్విష్ఠు
లక్కట సిద్ధిరాజుని బాఱఁద్రోలి
దక్కనరాజ్యంబు దామె యేలుచును
నొక్క కార్యంబును జక్కఁగ నెఱు
వారల దండించి వారి నెల్లూరు
వార కిప్పింపు మవారణ[illegible]
ననిన గణపతిరా జట్లకా దనుచు

* * *

వెడలి గణపతియును విజయంబునకును
గుడిసెడముల సేన గొలిచి యేతేఁ
వెలనాడు చేరియు వీడ్లుఁ గాల్చి
వెలనాటిరాజును వెసఁ బార్చి వాని
యుప్పనంబులు గొని యట చని రాజు
గుప్పున నెల్లూరుకూడ నేతెంచి
యక్కన బయ్యన నచట సాధించి

* * *

నెల్లూరిప్రజలకు నేర్పు వాటిల్లఁ
జెల్లించె మన్మసిద్ధిరాజునకు
నెల్లూరిపట్టంబు నేర్పుతోఁ గట్టి

సల్లలితాద్భుతి సమగ్రములను
నలువదానిమీదియు నగుపట్టణముల
నడుగొంచ సాధించి యామన్మసిద్ధి
రాజు కిచ్చియుఁ దనదేశంబు నేలఁ
బూజ కెక్కఁగ ఘనరాజితయశుఁడు
ఘనగుణాకరుండుఁ దాఁ గీర్తించె నచటఁ
కానఁగాని చెల్లఁ గొన్నినెల లుండి
[illegible] ంబు నల్ప.

(సిద్ధేశ్వర చరిత్రము)

గీ. చేరఁ దక్కన ప్రసన్నతా సాధనము
లప్పుడు [illegible] గాంచి [illegible] లగుచున్న
చోట నోరుగంటను తిక్కనసోమయాజి
వచ్చె నెల్లూరినుండి భూపాలునికడ.

సీ. వచ్చినయయ్యార్యవర్యు నెంతో గాని
వినయసంభ్రమభక్తి వినయమొంప
నతిథిపూజ లొనర్చి యాతనిచే భారతా
ర్థమును ద్వైతాద్వైతతత్త్వములను
విస్తృతచిదచిద్వివేకలక్షణములుఁ
బ్రకటధర్మాధర్మపక్షములును
రాజనీతిప్రకారంబును భారత
వీరులచరితంబు వినుచునుండి
యనుమకొండనివాసు లైనవిద్వ
జ్జనుల రావించి వారిఁ దిక్కనమనీషి
తోడ వాదింపఁ జేసినఁ దొడరి వారిఁ
జులకఁగా సోమయాజులు గెలుచుటయును.

వ. అప్పుడు బౌద్ధదేవాలయంబులు గూలం ద్రోయించి గణపతిదేవరాజు సోమయాజుల పటువాక్యశక్తికి మెచ్చి యతనికి బహుప్రకారంబులఁ బూజించి యొనిమిది గ్రామంబు లొసంగి యతఁడు వచ్చినకార్యం బడిగిన నాభూవరునకుఁ గవివరుం డిట్లనియె.

గీ. ఇనకులోద్భవుఁ డైనట్టి మనుమసిద్ధి
రాజు నెల్లూరు పాలించుచోఁ గొలంగి
యాతనిదాయాదు లతని నుక్కఱఁగఁ బట్టి
యునిచి రాజ్యంబుఁ దమ యేలుచున్నవారు.

క. కావున మీ రిపు డచటికి
వేవేగం దరలివచ్చి విడకుండఁగ నా
భూవరుఁ బునరభిషిక్తునిఁ
గావింపఁగవలయు ననిన గణపతివిభుఁడున్.

గీ. అట్లకాక యనుచు నాపని కొడఁబడి
యత్యుదారగుణసమగ్రుఁ డగుచుఁ
దవిలి యప్పు డొక్కనవలక్షధనమును
యజ్ఞకుండలములు నతని కిచ్చి.

క. పనుచు నెడఁ దిక్కనమఖి యా
జనవరుసింహాసనమున సచివాగ్రణి యై
తనరెడు శివదేవయ్యన్
గనుఁగొని యారాజుతోడఁ గడఁకం బలికెన్.

గీ. వసుమతీనాథ యీతఁ డీశ్వరుఁడు గాని
మనుజమాత్రుండు గాఁడు పల్కులు నితని
యనుమతంబున నీవు రాజ్యంబు నెమ్మి
నేలు మని చెప్పి యాఘనుఁ డేగుటయును.

సీ. గణపతిదేవుఁ డాఘనుననుమతి గాంచి
యతిసత్వరమునఁ బ్రయాణభేరి
వేయించి చతురంగపృతనాసమేతుఁ డై
తరలి ము న్వెలనాటిధరణిపతుల
గెలిచి వారలచేత లలి నప్పనముఁ గొని
వారి నందఱ దనవశము జేసి
కోని చని నెల్లూరు గొబ్బునఁ జొచ్చి య
క్కనయు బయ్యనయు నను ఖలులఁ దఱిమి

మనుమసిద్ధిరాజుఁ బునరభిషిక్తుఁ గా
వించి మించి రెండువేలునైదు
నూఱుగ్రామములు మనోవృత్తి కతనికి
నిచ్చి కడమఁ దాన యిచ్చెఁగానియా.

(సో మ దే వ రా జీ య ము)

విమర్శనము

సిద్ధేశ్వరచరిత్ర మనునది యొకశైవగ్రంథము. దీనికిఁ బ్రతాపచరిత్ర మనునామాంతరము గలదు. కాసె సర్వప్పనునాతఁడు దీనిని ద్విపదకావ్యమునుగా రచియించెను. ఈగ్రంథము పురాతనమైనదయినను లక్షణదోషములు పెక్కులు గానవచ్చుచున్నవి. ఈకవి కాల మెప్పుడో మనకు నిశ్చయముగాఁ దెలియరాదు గాని గణపతిదేవునకు నూఱుసంవత్సరములతరువాత నున్నవాఁడని తోఁచుచున్నది. ఈసిద్ధేశ్వరచరిత్రమునుబట్టియే సోమదేవరాజీయము కూఁచిమంచి జగ్గకవిచే రచియింపఁబడి మందపాటివారి కంకితము గావింపఁబడినది. జగ్గకవి పదునెనిమిదవశతాబ్దిలో నుండినవాఁడు. ఈరెండు గ్రంథములే పై నుదాహరించినకథకు మూలాధారము లై యున్నవి. ఈచరిత్రములందుఁ జరిత్రమునకు విరుద్ధము లైన యనేకవిషయములు చెప్పఁబడియున్నవి గాన కేవలము వానినే నమ్మి పరమసిద్ధాంతములనుగాఁ గైకొనరాదు. ప్రస్తుతము పై నుదాహరించిన చరిత్రాంశములను విమర్శింతము.

ఈచరిత్రములో నుదాహరింపఁబడిన మనుమసిద్ధిదాయాదులగు అక్కనబయ్యన లనువా రెవ్వరో వారిచరిత్ర మెట్టిదో తెలియరాదు. వీరిశాసనము లెవ్వియును గానరావు. మనుమసిద్ధికిఁ బూర్వముననుదరువాతనుమాత్రమే గాక మనుమసిద్ధికాలముననువిక్రమ

సింహాపురమునను, దత్తాన్విహాపృ... సముల౦దును మహారాజుల పేరిటఁ బెక్కు శాసనములు లిఖింపఁబడియుండఁగా వీరిపేరిట శాసనములు గానరాకుండుటచేత వీరినామము లెవ్వరికిమాటుపేరులో తెలియరాకున్నది. ఇంతప్రాముఖ్యమును గాంచినచరిత్రాంశమును గేతనకవి తాను తిక్కనసోమయాజి కంకితము చేసిన దశకుమారచరిత్రమునందైన నుదాహరించినవాఁడు గాఁడు. దశకుమారచరిత్రము రచింపఁబడునప్పటి కిది జరిగియుండలేదని తలంచుకొందుమన్న మఱియెప్పుడు జరిగియుండు ననుప్రశ్నము రాఁగలదు. తిక్కన యజ్ఞములు చేసి సోమయాజి యై భారత మాంధ్రీకరించిన వెనుక నిట్టిది సంభవించిన దని యూహింతమా? అట్లయినపక్షమున భారత మెప్పుడురచించిన వాఁడనుప్రశ్నము జనించును. దశకుమారచరిత్రమును గేతన రచించి తిక్కన కంకితము చేసినకాలమునకుఁ బూర్వమె తిక్కన యనేక యాగములను జేసియున్నట్లు 'మహితదక్షిణ లైన బహువిధయాగంబు లొనరించు ననుట వర్ణనము దారి' అనియు 'అధ్వరాబ్జదిననాథునకున్' అనియు, 'యాగవిద్యాభిరామా' అనియు మొదలుగాఁగల వాక్యములను దశకుమారచరిత్రమునందుఁ గేతనకవి తిక్కనఁగూర్చి ప్రయోగించి వాడియుండుటచేతనే విస్పష్ట మగుచున్నది. గణపతిదేవ చక్రవర్తి క్రీ. శ. ౧౨౬౦-వ సంవత్సరమున స్వర్గస్థుఁ డైనట్లు కన్పట్టుచున్నది. ఆసంవత్సరమునకుఁ బూర్వమె యీకథ నడచియుండవలయును. కడపమండలములోని నందలూరుశాసనములలో నొకదానియందు మనుమసిద్ధిరాజు కోడూరుగ్రామమును ౧౨౫౭-వ సంవత్సరమున బ్రాహ్మణులకు దానము చేసినట్లుగఁ జెప్పఁబడియున్నది. ఆశాసనములోనే మనుమసిద్ధిరాజు కాకతీయగణపతిదేవునితో స్నేహము సంపాదింపవలయు నని కోరికకలిగియున్నట్టుగఁ దెలుపఁబడినది. కనుక సిద్ధేశ్వరచరిత్రమునందుఁ జెప్పఁబడినట్లు గణపతిదేవచక్రవర్తి అక్కన

బయ్యనలను జయించి మనుమసిద్ధికి రాజ్య మిప్పించి రాజ్యమహిమలు దెలిపినది ౧౧౪౭-వ సంవత్సరమునకుఁ బూర్వము కాదని పై నందలూరు శాసనమువలన నూహింపవచ్చును గదా! అనఁగా ౧౧౪౭-వ సంవత్సరమునకును, ౧౧౬౦-వ సంవత్సరమునకును నడుమ నీచరిత్రము నడచియుండవలయును. గణపతిదేవచక్రవర్తి మనుమసిద్ధిరాజునకు సాహాయ్యముఁ జేయఁబూని మార్గమధ్యమున వెలనాటిరాజును జయించి యుప్పనము గైకొనియె నని సిద్ధేశ్వరచరిత్రమునందుఁ జెప్పఁబడియున్నది. కాని గణపతిదేవచక్రవర్తి ౧౧౩౬-వ సంవత్సరమునాఁటికె వెలనాటిని సంపూర్ణముగా జయించెను. అప్పుడు నెల్లూరును బరిపాలించుచున్నవాఁడు మనుమసిద్ధితండ్రి యగుతిక్కరాజు గాని మనుమసిద్ధిరాజు గాఁడని స్పష్టముగాఁ జెప్పవచ్చును. పైనిజెప్పినట్లుగా ౧౧౪౭-౧౧౬౦ సంవత్సరములనడుమ మనుమసిద్ధిరాజు రాజ్యమును గోలుపోయియుండరాదా యని తలంతుమేని ౧౧౫౮-౧౧౫౯ సంవత్సరములలో రాజ్యాభివృద్ధికై మనుమసిద్ధిరాజుచేతను నాతనిక్రిందియధికారప్రభువు లైనపల్లవరాజులచేతను జేయఁబడినదానములను గూర్చినశాసనములు పెంట్రాలలోఁ గానంబడుచున్నవి. కావున నాకాలమున మనుమసిద్ధిరాజు పదభ్రష్టుఁడయ్యె నని తలంపరాదు. అట్లయినపక్షమున మనుమసిద్ధి యెప్పుడును పదభ్రష్టత్వమును బొందనేలేదా యనుశంక పుట్టవచ్చును. మనుమసిద్ధిరాజు పదభ్రష్టుఁ డైనకాలముగూడఁ గలదు. మనుమసిద్ధితండ్రి యగు తిక్కరాజుకాలమునఁ బాండ్యులు కాంచీపురముపై దండెత్తి వచ్చి యారాజ్య మాక్రమింపఁగాఁ దిక్కరాజు పాండ్యులతో యుద్ధము చేసి వారలను దఱిమి మరల చోడుని సింహాసనమునఁ గూరుచుండఁబెట్టి చోళస్థాపనాచార్యబిరుదము నందె నని యిదివఱకె తెలిపియున్నాఁడను. తిక్కరాజుమరణానంతరము పాండ్యులు తమ

తొంటిపూనికను విడనాడక కాంచీపురము మొదలుకొని యుత్తర భూమిని జయింపఁగోరి పలుమాఱు దాడి వెడలివచ్చి నెల్లూరునకు దక్షిణభాగమునను, బశ్చిమపాకనాడును, మార్జవాడిదేశమును గల్లోల పెట్టుచుండిరి. తనసామంతుల ప్రార్థనము మీఁద గణపతిదేవచక్రవర్తి క్రీ. శ. ౧౨౪౯-వ సంవత్సరమున నసంఖ్యాకములైనసైన్యములతోఁ గాంచీపురముపై దండెత్తిపోయి [మారవర్మసుందరపాండ్యుని వానికుమారుఁడైన జటవర్మసుందరపాండ్యుని నోడించి యచటినుండి పాఱఁద్రోలి తనసచివాగ్రణియు, సైన్యపాలుఁడును, జక్రధారియుఁ, గాశ్యపసగోత్రుఁడు నైన సామంతభోజమంత్రిని గాంచీపురపాలకునిగా నియమించినటు లేకాంబరేశ్వరుని దేవాలయములోని యొక శాసనమువలనఁ దెలియుచున్నది.* కాకతీయగణపతిదేవచక్రవర్తి దక్షిణదిగ్విజయయాత్రను ముగించి రాజధాని యగునోరుగల్లు చేరిన వెనుక మఱుసటిసంవత్సరమున జటవర్మసుందరపాండ్యమహారాజు మరల దండయాత్ర వెడలి కాంచీపురమును, విక్రమసింహపురమును ముట్టడించి స్వాధీనపఱుచుకొని మనుమసిద్ధిరాజును బాఱఁద్రోలి సిద్ధిరాజునకు శత్రువు లయినవీరులను బట్టాభిషిక్తులను గావించె నని నాలుగవప్రకరణమునం దెలిపియున్నాఁడను. వీనిని త్రిభువనచక్రవర్తిబిరుదాంకితుఁ డగువిజయగండగోపాలదేవుఁడు తఱిమి కాంచీపురమాక్రమించుకొనియె నని వెనుకటిప్రకరణమునఁ దెలిపియున్నాఁడను. అట్టివిజయగండగోపాలునే విజయక్ష్మాధీశ్వరుం డని తిక్కన నిర్వచనోత్తరరామాయణమునఁ బేర్కొనియె నని వక్కాణించి యున్నాఁడను. ఈనాయూహ సరియైన దైనయెడల నిర్వచనోత్తర రామాయణము ౧౨౬౦-వ సంవత్సరముతరువాత రచియింపఁబడి

* The Indian Antiquary, Ekamranatha Inscription of Ganapathi. Vol. XXI. p. 197, No. 16. Ganapeswaram Inscription of the time of Ganapati.

యుండును. అప్పటికి మహాభారతము రచియింపఁబడియుండలే దనుట స్పష్టము. మనుమసిద్ధిరాజు పరిపాలనము చేసిన దెప్పటివఱకో తెలిసికొనుటకూడఁ గష్టసాధ్యముగ నున్నది. మనుమసిద్ధిరాజు కాటమరాజుతో యుద్ధము చేసి మరణించె నను మఱియొకకథ గలదు. మనుమసిద్ధికుమారుఁడు తిక్కరాజు ౧౨౭౦-వ సంవత్సరమునఁ బట్టాభిషిక్తుఁడయ్యెను. ౧౧౬౨-వ సంవత్సరమునకుఁ దరువాత మనుమసిద్ధిశాసనములు కానరావు. మనుమసిద్ధికుమారుఁడు ఇమ్మడితిక్కరాజు రాజ్యమునకు వచ్చుటకుఁబూర్వము కొంతకాలము నెల్లూరిపట్టణము కాకతీయసైన్యాధిపతులపాలనమున నున్నట్లు కొన్ని శాసనములవలనఁ గానంబడుచున్నది. దాదినాగయసాహిణి యనునాగదేవమహారాజు గణపతిదేవచక్రవర్తికిఁ బ్రతినిధిగా ౧౨౭౨-౭౩-వ సంవత్సరములో విక్రమసింహపురమును బరిపాలించుచుండెను. ఇంకొకచిత్రము కలదు. గణపతిదేవునిసైన్యాధీశ్వరులలో నొకఁడును, రాయసహస్రమల్లుఁ డనుబిరుదము గలవాఁడును నగు అంబదేవమహారాజు రాజ్యపదభ్రష్టుఁడైనమనుమగండగోపాలుని విక్రమసింహపురంబున సింహాసన మెక్కించితి నని యొకశాసనమునఁ జెప్పుకొనియున్నాఁడు. ఈమనుమసిద్ధిరాజునే మనుమగొండగోపాలుఁ డని వక్కాణించియుండవచ్చును. ఏలయన నీ తెలుఁగుచోడరాజులకు గండగోపాలుఁ డనుబిరుదము కలదు. తిక్కరాజునకు రాయగండగోపాలుఁ డనుబిరుదము కలదు. మనుమసిద్ధికిని ఈబిరుదము కలదు. ఇతనికి దాయాది యొకఁడు విజయగండగోపాలుఁ డని వ్యవహరింపఁబడుచున్న కారణమున మనుమసిద్ధిని మనుమగండగోపాలుఁ డని జనులు వ్యవహరించియుందురు. మఱియొక కాకతీయసైన్యాధిపతి మనుమగండగోపాలుని సంహరించితి నని చెప్పుకొనియెను. వీనినన్నిటిని బరిశీలించి చూచినపక్షమున నీక్రిందివిధమున సిద్ధేశ్వరచరిత్రములోని విషయములను సమన్వయింపవచ్చును.

౧౨౫౭-వ సంవత్సరమునఁగాని మఱుసంవత్సరమునఁగాని మనుమసిద్ధి దాయాదులు సిద్ధిరాజును నెల్లూరునుండి పాఱఁద్రోలఁగా నతఁడు కందుకూరుసీమలోని పెంట్రాలకోటలోఁ గొంతకాలము దాగియుండును. ఆకాలమున మహాప్రసిద్ధి గాంచిన యతనిమంత్రి తిక్కనసోమయాజి గణపతిదేవునికడకుఁ బోయి యాతనివలన మన్ననలను గాంచి తన వచ్చినపని తెలుపఁగా నాతఁడు తనసైన్యమును బంపి మనుమసిద్ధి దాయాదులను నెల్లూరునుండి పాఱఁద్రోలి మనుమభూపతిని బునరభిషిక్తుని గావించియుండును. తిక్కనసోమయాజి భారతాఖ్యానమును విన్పించినాఁ డనియును, తిక్కన వాదమున గెలిచి బౌద్ధులను హింసింపఁజేసినాఁ డనియుఁ జెప్పెడికథలుమాత్రము కవిసృష్టి యని స్పష్టముగఁ జెప్పఁదగును. తిక్కన గణపతిదేవునిసమ్ముఖమున నద్వైతవాదమును సలిపి బౌద్ధుల నోడించినను నోడింపవచ్చును గాని వారిహింసలకుమాత్ర మాతఁ డుత్తరవాది యైయుండఁడు. గణపతిదేవచక్రవర్తి యద్వైతవాది యని యతనికూఁతురు గణపాంబశాసనమునఁగూడ వక్కాణింపఁబడియుండుట గణపతికిని దిక్కనసోమయాజికిని సమావేశము గలిగియుండుటను సూచింపుచున్నది.

ఆఱవ ప్రకరణము

కాటమరాజు మనుమసిద్ధిరాజుల యుద్ధము

ఖడ్గతిక్కన విక్రమపౌరుషాదులు

మనుమసిద్ధిరాజు మరణకాలమునాఁటికిఁ బాకనాడును మాత్రము పరిపాలించుచుండెను. మనుమసిద్ధివలనఁ బొందిన యైశ్వర్యమును మాత్రమేగాక కవితిక్కన గణపతిదేవచక్రవర్తివలన నెనిమిది యూళ్లను విశేషమైన యైశ్వర్యమును బడసియుండెను. అయినను గడపటకుఁ గవితిక్కనయు, ఖడ్గతిక్కనయు మనుమసిద్ధిరాజువిశ్వాసమునకుఁ బాత్రులై యొప్పియుండిరి. ఖడ్గతిక్కన తనకృతజ్ఞతను మఱవక కడపట మనుమసిద్ధిరాజునకును గాటమరాజునకును జరిగినయుద్ధములో వీరశయనము గాంచెను. ఈవిషయము కాటమరాజుకథవలన మనకు వ్యక్తమగుచున్నది. విద్యావితరణపౌరుషాదులయందుఁ గవితిక్కన యెంతప్రఖ్యాతుఁడో వీర్యవితరణపౌరుషాదులయందు ఖడ్గతిక్కన యంతప్రఖ్యాతుఁడుగ నుండెను. ఇతనిమరణకాలమునఁ దల్లిదండ్రులు వృద్ధులై సజీవులుగ నున్నట్లే కనంబడుచున్నది. ఆఁడువారిలోఁ గాని మగవారిలోఁ గాని కొట్టరువువారికుటుంబమునఁ బిఱికితన మనుమాట వినరాదనుటకు ఖడ్గతిక్కననుగూర్చినకథయె సాదృశ్యముగా నున్నది. ఆకథనే నేనిచట సంగ్రహముగాఁ దెలుపుచున్నాఁడను.

పసులమేపుబీళ్లనిమిత్తమై కాటమరాజునకును మనుమసిద్ధిరాజునకును వివాదము పొసఁగి మహాయుద్ధము జరిగినటులు కాటమరాజు కథవలనఁ దెలియుచున్నది. పుల్లరి యిచ్చుపద్ధతిపైఁ గాటమరాజు తన

పసులను మనుమసిద్ధిరాజుమేతబీళ్లలో మేపుకొని యక్కడఁ దనకోడె దూడలలో నేదో నష్టము సంభవించినదన్నకారణమునఁ బుల్లరి నీయక యెగఁగొట్టెను. దానిపై మనుమసిద్ధిరాజు పసులఁ బోనీయక యాటంకపఱిచెను. ఉభయులయుద్ధమున కిది ముఖ్యకారణము. ఈయుద్ధకథనము ద్విపదలో రామరావణయుద్ధముగ వర్ణింపఁబడినది. మనుమసిద్ధి రావణుఁడుగఁ బోల్పఁబడియెను. కాటమరాజుతండ్రి పెద్దరాజు. వానితండ్రి వల్లురాజు. ఇతఁ డాత్రేయగోత్రోద్భవు లైనయాదవుల సంతతిలోనివాఁడుగఁ జెప్పఁబడియెను. వల్లురాజు కనిగిరిసీమలోని యాలవలపాడున కధిపతిగ నుండెను. కాటమరాజు కనిగిరిలోని యెఱ్ఱగడ్డపాడున కధిపతిగ నుండెను. ఒకసంవత్సరమున దేశమున ననావృష్టి సంభవించెను. యాదవు లనంబడుగొల్లవాం డ్రెల్లను దమతమపసుల మందలను దోలుకొని దక్షిణమునకు వచ్చి మనుమసిద్ధిరాజుయొక్క పసులబీళ్లను గొన్నిటిని పుల్లరికిఁ గైకొని పసులను మేపుకొని పుల్లరి చెల్లింపకయె వెడలిపోయిరి. అందుపై మనుమసిద్ధిరాజునకుఁ గోపము వచ్చి తిక్కనాదిమంత్రివర్గముతో నాలోచించి అన్నంభట్టను బ్రాహ్మణుని కాటమరాజుకడకు రాయబారినిఁగాఁ బంపిరి. కాటమరాజు పైనిజెప్పినకారణమును బురస్కరించుకొని పుల్లరి నీయక తగవులు పెట్టెను. అన్నంభట్టుప్రయత్నము నిష్ప్రయోజన మయ్యెను. అతఁడు తిరిగివచ్చి యాసమాచారమంతయు మనుమసిద్ధిరాజునకు నివేదించెను. మనుమసిద్ధిరాజున కాగ్రహము వచ్చి కాటమరాజును దండించి పుల్లరి గైకొని కార్యమును సాధించుకొనిర మ్మని ఖడ్గతిక్కనను నియమించెను. అప్పుడు రాజునాజ్ఞ శిరసావహించి సైన్యములను సమకూర్చెను. తిరునామాలతిప్పరాజు, శ్రీకంఠరాజు, పెదవేగిచొక్కరాజు, పెదవరదరాజు, అర్ధకొండ అచ్చిరాజు, ఆదివన్నెమన్నెరాజు, గయికొండగంగరాజు, ఉర్లకొండసోమన్న, ఉదయాద్రి ఉమ్మయ్య,

చెన్నపట్టణము చంద్రశేఖరుఁడు, దేవముని వెంగళయ్య, పట్టకోట బసవరాజు, కాళహస్తి పాపతిమ్మరాజు, వెలకంచి వెంగళపతిరాజు, ప్రభగిరి పద్మశేఖరుఁడు మొదలుగాఁగలయోధవరు లనేకులు మనుమసిద్ధిపక్షమునఁ దోడ్పడ నేతెంచిరి. ఈ యోధులకందఱకు నాయకుఁడై ఖడ్గతిక్కన సిద్ధిరాజుసేనలను నడిపించుకొని కాటమరాజుపై దండెత్తి పోయెను. మనుమసిద్ధి తనపై దండెత్తి రానున్నాఁడని ముందుగాఁ దెలిసికొని కాటమరాజుసయితము సైన్యములను సమకూర్చుకొని సిద్ధముగా నుండెను. పల్నాటిప్రభు వయిన పద్మనాయఁడును, పల్లికొండ ప్రభు వయిన చల్లాపిన్నమనాయఁడును, దొనకొండ అయితమరాజు ఎఱ్ఱయ్య, భట్టావులరాజు, కరియావులరాజు, వల్లభన్న, నాచకూళ్ల నాయఁడు, నేతిముద్దయ్యనాయఁడు, పాచయ్యనాయఁడు, ముమ్మయ్య నాయఁడు, పుత్తమరాజు మొదలుగాఁ గొందఱుయోధులును గాటమ రాజునకుఁ దోడ్పడ వచ్చిరి. ఈసేనకంతకును, బిన్నమనాయునిమంత్రియు నారాధ్యబ్రాహ్మణుఁడు నగు బ్రహ్మరుద్రయ్య నాయకుఁడై యెదురుగాఁ బోయి పాలేటిగొట్టున నున్న పంచలింగాలకొండకడ నెదుర్కొనియెను. అప్పు డుభయపక్షములవారికిని ఘోరమైన యుద్ధము జరిగినది. తుదకుఁ దిక్కన సైన్యమంతయు హతముకాఁగా నతఁడొక్కఁడును వీరాధివీరుఁడై రణరంగమున నిలువఁబడియుండు టను జూచి ప్రతిపక్షయోధుఁడైన పిన్నమనాయఁడు చూచి,

"గీ. పోరు నిలుపు మీఱు భూసురోత్తముఁడ
సరిగాదు మాతోడ సమరంబుఁ జేయ
విప్రజుల్ మీరు యాదవులము మేము
విప్రము మామీఁద నంపంగ రాదు."

అని పలికెనఁట! అందుపైని తిక్కన తనతోనున్నసైన్యమంతయు నాశమయినందులకుఁ జింతించి మరల సైన్యమును గొనివచ్చి యుద్ధము

చేసెదంగాక యని గుఱ్ఱమును ద్రిప్పుకొని పురంబునకు వచ్చెనఁట. పౌరజనంబులు పరాజితుఁడై పాఱివచ్చిన తిక్కయోధుని గాంచి పక పక నవ్వువారును, కేరడము లాడువారును నై భయభక్తులు విడిచి వర్తించి మనస్సునకుఁ జింతఁ గలిగించిరి. పౌరజనంబులుమాత్రమె కాదు; ఇంటికిఁ బోయినతోడనే వృద్ధుఁడై మంచమునఁ బడియున్న తండ్రి సిద్ధనామాత్యుఁడుసయితము కోపము దెచ్చుకొని,

"సీ. రణరంగమున మోహరంబులు తెగఁగని
ప్రాణంబు దాఁచిన పందవగుదు
విజయోద్ధవుని దాడి వెనుకొని తిరుగక
వెస దప్పివచ్చిన గ్రొజ్జంబు
పౌరజాలకు యోడి పూరుషాంగనల బోని
మంచాన కోఁగిన మగతనము
పెనుపట్టె చెలువులో పేరును లబ్బియు సొంపిఁ
గ్రొంగొంగ వచ్చిన కొంగరంబు
ఆ. నేఁడు మొదలుచేసి నెల్లిదినాలుఁ
బ్రగడతనము మాని మగడి పోలఁ
బారి గెలిచి తిక్క! భూమిలోఁ జేరఁ వఁ
బాలువానికీతిఁ బంద వైతి."

అని యుపాలంభ మొనర్చెనఁట. అంతఁ దిక్కయోధుఁడు తండ్రి పోటుమాటలకు సైరించి స్నానమునకుఁ బోఁగా వీరపత్నియు, వీర మాతయు నగుభార్య చానమ్మ స్త్రీల కుంచినట్లుగా రహస్యస్థలమున నీళ్లబిందె నుంచి దానికి నులకమంచమును జాటుపెట్టి దానిమీఁదఁ బసపుముద్ద యుంచెనఁట. తనభార్యచేష్టమును జూచి సిగ్గుపడి తిక్కన ఖేదపడుచుండఁగాఁ జానమ్మ భర్తను జూచి,

"క. పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపునాయకులందున్

మునిఁగె[illegible] గోదారిఁ [illegible] ప్రాతెను
నగి [illegible] [illegible] పుంఢకవ్విననోటలా."

అని యొకసక్కెము లాడెనఁట. తరువాత స్నానము చేసి భోజనమునకుఁ బోయి భుజించునప్పుడు వీరమాత యగుప్రోలమ్మ కుమారునకు అన్నములోఁ బాలుపోయునప్పుడు పాలు విఱిగిపోవఁగా నామెనయితము పరిహాసముగా,

"క. పాలు ద్వ్యాయముగ నడఁకెలఁ
బాలుండఁగ పులుదలకె పంచక్రియా నీ
వసి స్వేచ్ఛ విఱుఁగఁ బోవఁ
బసులకు నిర్గసినవి తిక్క! పాలు నవ్వితిక్కన్."

అని పలికెనఁట. ఇఁకఁ జెప్పఁదగిన దేమున్నది. ఏఁబదేండ్లునిండిన యీయోధవరునకు నాపలుకులెల్లను ములుకులై నాట మానాభిమానములు ముప్పిరిగొనఁ దాను చేసినపనికిఁ బశ్చాత్తప్తుఁడై 'నన్నుఁ బిఱికిపందనుగా వీరు తలంపుచుండిరి. ఈసారి మరలఁ బోయి శాత్రవులను మార్కొని జయము గొందును. అయ్యది సంప్రాప్తము గాదేని ప్రాణం బుంచుదనుకిఁ బోరాడి వీరస్వర్గంబునైనఁ జూఱఁగొందు. మానాభిమానములు గలవాఁడు డిట్టిరోఁత బ్రదుకుఁ బ్రదుకంజాలఁడు' అని తలపోసికొని యెవరెన్నివిధముల వారించినను వినక సిద్ధిరాజు నొడంబఱిచి కావలసినసైన్యములం గొని సంగరోత్సాహియై పోయి శాత్రవులను మార్కొని ప్రచండమైనయుద్ధము చేసెను. అతనియుద్ధక్రమము ని శ్లోకకవి యభివర్ణించియున్నాఁడు.

"చ. ఎపటున వాజి రాహుతులపై దుమికింపుచుఁ దిక్కఁ డార్చినన్
జెదర పరిభ్రమించి కడుఁ బిమ్మట వీరులు భీతచిత్తులై
యెవయఁదొ డాలు వాల్మెఱుఁగు లల్లవె యల్లవె యాలిఁ డంచనన్
గొదుకక యాజి చేసి రిపుకోటుల కండలఁ జెన్నుమాప్పులై."

ఇట్లే పూర్వము బ్రాహ్మణుఁడగు నందూరి కొమ్మనామాత్యుఁడు క్రొత్తపల్లి (కొచ్చెర్లకోట) పరిసరభూములందుఁ గటక రాజుతోఁ బోరాడి చూపినయుద్ధకౌశలమును మంచనకవి తన కేయూరబాహుచరిత్రమునందు,

సీ. నెలకట్టెవాటునఁ జెలఁగి రెంటను వాఁడిఁ
గూడ గుఱ్ఱంబులు గుదులు గ్రుచ్చుఁ
గ్రాతిమొగం బగునరిపతుల కత్తళ్ళనఁ
గడిమ మ్రగ్గ వీపులవెంటఁ బాఱఁజేయుఁ,
బందంపుగోతియలపగిది నేనుంగుల
ధారశుద్ధిగ నసిధార దునుముఁ,
జిదియించుఁ బగిలించుఁ జేతులకోట వ్రే
వడి గాండ నేసి మావతులతలలు,
గీ. తలపుడికి వ్రేసి మావంతుతలలు శత్రు
రాజశిరములు ద్రొక్కుచు రాఁగఁ దిరుగ
వాగ నుబ్బడు తనవారువంబుచేత
మహితశౌర్యుండు కొమ్మనామాత్యవరుఁడు."

అని మిక్కిలిమనోహరముగా వర్ణించియున్నాఁడు. ఆకాలమునం దిట్లే బ్రాహ్మణమంత్రివర్యులు రాజ్యతంత్రమునందే గాక యుద్ధతంత్రమునందును బ్రవీణు లైయుండి రనుట కిట్టిదృష్టాంతముల నెన్నియైన నాంధ్రచరిత్రము నుండియు, సారస్వతము నుండియుఁ జూపఁగలము.

ఇట్లు ప్రచండవిక్రమారుఁడై ఘోరసంగ్రామంబున శత్రుసేనను మార్కొని పీనుంగుపెంటలు గావించుచు రణకేళిసల్పుచుండ యాదవవీరులును వెనుదీయక మహోదగ్రులై తిక్కనసైన్యముపైఁబడి కత్తులఁ గఠారుల నీటెలం బొడిచి చక్కాడుచుఁ బెద్దకాలంబు పోరాడ నుభయసైన్యంబులం బెక్కండ్రువీరభటులు నేలం గూలిరి. అంతటఁ బిన్నమనాయఁడు ఖడ్గతిక్కనను సమీపించి "ఓవిప్రోత్తమా!

యుద్ధముచేయుట బ్రాహ్మణునకుఁ బాడి కాదు. మిమ్ముం జంపిన మాకు బ్రహ్మహత్యాదోషంబు వాటిల్లు నని నామనంబు తల్లడిల్లు చున్నది. తొలంగుట మీకును మాకునుగూడ శ్రేయస్కరం బని యూహింతు'' నని గొంతెత్తి గంభీరవాక్యములు వలుకఁ దిక్కనయు, ''ఓ నాయఁడా! రణశూరుఁడనై బ్రాహ్మణక్షత్రియుండ నగు నాతోడ యుద్ధము సేయఁజాలక పందక్రియ ధర్మపన్నంబు లేలచదివెదవు? వానిం గొన్ని నే నెఱుంగుదుంగాని, వీరుండ వౌదువేని కదలక నిలుచుండి యుద్ధము చేసి చేతనయ్యేనేని నాప్రాణంబులు గొని విజయపతాక మెత్తుము. కాదేని శరణుచొచ్చి మావుల్లరి మాకుం బెట్టుము.'' అని హెచ్చరింపఁ బిన్నమనాయఁడు బ్రహ్మహత్యాదోషమునకు వెఱచి యేమిచేయుటకును జేతులును గాళ్ళు నాడక నిశ్చేష్టితుఁడై చూచుచుండ, వానిమంత్రి బ్రహ్మరుద్రయ్య యచటి కేతెంచి ''తిక్కన నేఁ దలంపడి పోకార్చెద నీ వటుండు'' మని తనప్రతివీరునిపై హయమును బఱపి యుద్ధము చేయఁగా నిరువురగుఱ్ఱంబులు నీలుపోటుల నేలం గూల నిరువురును గత్తులు దూసి ''హరహరా'' యని యభిమన్యు లక్ష్మణకుమారులవలె ద్వంద్వయుద్ధమునకుఁ గలియంబడి యుభయ సైన్యంబులవారును నివ్వెఱపడి చూచుచుండఁ బెద్దయుంబ్రొద్దు పోరాడి తుదకు నేల కొఱిగిరి. ఆపాటుం గని తిక్కనసైనికులు హాతశేషు లైన వారీక్రిందివిధముగాఁ జెప్పుకొని యేడ్వసాగిరి.

''సీ. ధైర్యంబు నీమేనఁ దగిలియుండుటఁ జేసి
చలియించి మందరాచలము తిరిగె
గాంభీర్య మెల్ల నీకడనయుంటుటఁ జేసి
కౌస్తుభ్సచే వార్ధి కట్టువడియె
జయలక్ష్మి నీయురస్థలిని యుండుటఁ జేసి
హరి పోయి బలి దాన మడుగుకొనియె

నాకొరక యెల్ల నియమించె యుండఁగఁ జేసి
మరుఁడు చిచ్చునఁబడి మడిసి చనియెఁ

గీ. దిక్కదండనాథ దేవేంద్రపురికి నీ
వరుగు టెఱిఁగి నగము తిరుగు టుడుగు
నబ్ధి కట్టు విడుచు నచ్యుతు కొద మాను
మరుఁడు మరలఁ గలుగు మనుజరాజ."

అని తనసైనికులెల్ల హాహాకారములు సేయుచుండఁ బ్రాణములు దేహమును విడిచిపోయినవిధము నాకవివర్యుఁడే యిట్లు చెప్పియున్నాఁడు.

"సీ. నందిని బుత్తెంచె నిందుశేఖరుఁడు నీ
వన్న యేతెమ్ము తారాద్రికడకు
గరుడుని బుత్తెంచె నరహరి రావయ్య
వడి సిద్ధతిక్క! కైవల్యమునకు
హంసను బుత్తెంచె నజుఁడు నీకడకు ను
భయకులమిత్ర రా బ్రహ్మసభకు
నైరావతముఁ బంపె నమరేంద్రుఁ డిప్పుడు
దివమున కేతెమ్ము తిక్కయోధ

గీ. యనుచు వేలువేల నర్థితోఁ బిలువంగ
వారు వీరుఁ గూడ వచ్చి వచ్చి
దివ్యయోగి యైనతిక్కనామాత్యుండు
సూర్యమండలంబుఁ జొచ్చి పోయె."

మఱియును విక్రమసింహపురనివాసు లైనపౌరులెల్లరును ఖడ్గతిక్కన మరణవార్తను విని తాము వానిని బరిహసించి యపచారము చేసితి మనుచుఁ బశ్చాత్తప్తు లగుచు నాతనిగుణగణంబులు దలపోసికొని దుఃఖాక్రాంతచిత్తులై,

"ఉ. వెన్నెల లేనిరాత్రియు రవిప్రభ లేనిదినంబు నీరు లే
కున్నసరోవరంబు కడు నొప్పగుదీపము లేనియిల్లు నై
విన్నదనంబు నొందె మనవిక్రమసింహపురంబు చూడఁగాఁ
బున్నమచంద్రుఁ బోలు మనపోలమతిక్కఁడు లేమి నక్కటా!

అని పరిపరివిధముల విలపించిరఁట. ఆహా! వీరవర్యులయుఁ గవివర్యులయుఁ జావు లెవ్వరికి నేప్పుఁ బుట్టింపవు?

తరువాత మనుమసిద్ధియు సైన్యసమేతముగాఁ గాటమరాజుపై దండెత్తి పోయి యుద్ధము చేసి వీరస్వర్గమును జూఱఁగొనియెను. అటుపిమ్మటఁ దాను బొందినగాయములవలనఁ గాటమరాజుగూడ స్వర్గస్థుఁడయ్యెనఁట. పుల్లరినిగూర్చినయుద్ధ మీవిధముగాఁ బర్యవసితమయ్యెను. మనుమసిద్ధి స్వర్గస్థుఁడైనపిమ్మట నీదేశమును గాకతీయాంధ్రచక్రవర్తిసైన్యాధిపతి యగుదాదినాగన్న నాగదేవమహారాజనునామముతోఁ గొంతకాలము పరిపాలించెను.

ఏడవ ప్రకరణము

"నిర్వచనోత్తరరామాయణము"

మేరు వెత్తినను నరేశ్వరువర్తనము రత్నాకరవేష్టితావని వినంబడ దని యెఱింగినవాఁడు గాన తిక్కనకవిచేఁ గృతినొందవలయు నను కోరిక గలవాఁడై మనుమసిద్ధి యొకనాఁడు తిక్కనమనీషిం బిలువనంపించి 'నిన్ను మామా యని నేను బిలుచుచున్నందుకు నీవు నాకు భారతీకన్య నొసంగ నర్హుఁడ వైయున్నాఁడ' వని పలికెను. ఆపలుకు తనమనస్సున కింపుపుట్టించె నని,

"క. ఏ నిన్ను మామ యనియెడు
దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
కీ నర్హుఁడ వగు దనినను
భూనాయకుపలుకు చిత్తమున కింపగుటున్".

అనుపద్యముమూలమునఁ దిక్కన తేటపఱిచియున్నాఁడు. దీనిని బట్టి తిక్కనకవికి మనుమసిద్ధిరాజునకుఁ గృతినొసంగుకోరిక యదివఱకు లేదనియు నతఁడు పలికినచమత్కారపుంబలుకు మనస్సున కానందము గలిగించుటచేతఁ గృతి నిచ్చినట్లును స్ఫురించుచున్నది. ఇట్లు మొదట సమ్మతి లేకయున్నను మనుమసిద్ధికులశీలస్వరూపాదులం దలంచుకొని నప్పు డయ్యది సయుక్తికముగా నాతం డప్పాం డని బోధించిన మనస్సు సమాధానపఱుచుకొని కృతి యిచ్చినట్లు నిర్వచనోత్తరరామాయణములోని,

"సీ. సకలలోకప్రదీపకుఁ డగుపద్మినీ
మిత్రవంశమున జన్మించె ననియుఁ
జూచిన మగలైనఁ జొక్కుదు రట్టి సౌం
దర్యసంపద సొంపు దాల్చె ననియు
జనహృదయానందజననమై నెగడిన
చతురతకల్మి నప్రతిముఁ డనియు
మెఱసి యొండొంటికి మిగుల శౌర్యత్యాగ
విఖ్యాతకీర్తిచే వెలసె ననియు

వివిధవిద్యాపరిశ్రమవేది యనియు
సరసబహుమానవిరచితశాలి యనియు
మత్కృతీశ్వరుఁ డగుచున్న మనుమనృపతి
సుభగుఁ గావించుటకు సముత్సుకుఁడ నైతి."

అనుపద్యమువలనఁ దెల్ల మగుచున్నది. కావున ధనాపేక్షచేతఁ దిక్కన మనుమసిద్ధిరాజునకుఁ గృతి నొసంగియుండ లేదనుట స్పష్టము. ఏసంవత్సరమునఁ దిక్కన నిర్వచనోత్తరరామాయణమును రచించి మనుమసిద్ధిరాజున కంకితము చేసెనో నిశ్చయముగాఁ దెలుపుట కాధారము లేదు గాని భారతరచనకుఁ బూర్వము బహుసంవత్సరములకు, అనఁగా ముప్పదిసంవత్సరముల వయస్సులోపలనే రచించియుండు

నని స్పష్టముగాఁ జెప్పవచ్చును. అప్పటి కీకవిసత్తమునికీర్తి విద్వల్లోకమంతటను వ్యాపించియుండలే దని చెప్పవచ్చును. మఱియును నతఁడు శ్రౌతస్మార్తక్రియాతత్పరుఁ డైయున్నను గ్రతుదీక్షను బూని యాచరించునంతటి కర్మఠుఁడుగా నున్నటులు కనుపట్టఁడు. భారతగద్యములోవలె 'బుధారాధనవిరాజి తిక్కనసోమయాజిప్రణీతం' బని వ్రాసికొన్నట్లుగా వ్రాసికొనక నిర్వచనోత్తరరామాయణముగద్యలో 'బుధారాధనవిధేయ తిక్కననామధేయప్రణీతం' బనిమాత్రము వ్రాసికొని యుండుటచేత నప్పటికిఁ గ్రతువు నాచరించియుండలే దని యూహింపవలసివచ్చుచున్నది. ఇది ప్రథమకావ్య మగుటచేత నేకాఁబోలు 'నూత్నసత్కవీశ్వరులను భక్తిఁ గొల్చి మఱి వారికృపన్ గవితావిలాసవిస్తరమహనీయుఁడ నైతి' నని తనవినమ్రభావముఁ దేటపఱిచి యున్నను,

"చ. పలుకులపొందు లేక రసభంగము సేయుచుఁ బ్రాతవడ్డమా
టలఁ దమ నేర్పు చూపి యొకటన్ హృదయం బలరింపలేక, యే
పొలమును గాని యొట్టిక్రమమున్ దమ మెచ్చుగ లోక మెల్ల న
వ్వులఁ బొరయన్ జరించుకుకవుల్ ధర దుర్విటులట్ల చూడఁగన్."

అని కుకవినిరాసనమున కెడ మిచ్చెను. అయిన నిం దాతఁడు స్వాతిశయభావమును జూపక కుకవులమార్గమునుమాత్రము నిరసించెను. ఇట్లు కుకవులమార్గమును నిరసించుటతోమాత్రము తృప్తి నొందియుండక తరువాతి తెలుఁగుకవులకు నుపయుక్తములై సూత్రప్రాయములుగా నుండునట్లు,

"కం. తెలుఁగుకవిత్వముఁ జెప్పన్
దలఁచినకవి యర్థమునకుఁ దగియుండెడుమా
టలు గొని వళులుం బ్రాసం
బులు నిలుపక యొగిని బలిమిఁ బుచ్చుట చదురే."

* * * *

"క. అలవడ సంస్కృతశబ్దము
తెలుఁగుపడి విశేషణంబు తేటపడంగాఁ
బలుకునెడ లింగవచనం
బులు భేదింపమికి మెచ్చు బుధజనము కృతిన్."

* * * *

"గీ. ఎట్టికవి యైనఁ దనకృతి యింపు పెంపఁ
జాలఁ గావునఁ గావ్యంబు సరసుఁడైన
కవుల చెవులకు నెక్కినఁ గాని నమ్మఁ
డెంచఁ బరిణతి గలుగుకవివర్యుండు."

అనుపద్యములను జెప్పి సత్కవీంద్రమార్గమునుగూడఁ దెలిపియున్నాఁడు. మఱియు నుత్తరరామాయణము రచించుటకుం గలకారణ మీవిధముగాఁ జెప్పియున్నాఁడు.

"క. ఎత్తఱి నైనను ధర్మో
దాత్తగుణోత్తరుఁడు రామధరణీపతిస
ద్వృత్తము సంభావ్య మగుట
నుత్తరరామాయణోక్తి నియుక్తుఁడ నైతిన్."

తిక్కన తననిర్వచనకావ్యములోని కవిత్వరీతి పండితుల కానందకరమైయుండు ననిసూచించుటకో యనఁ గవిత్వపద్ధతి యిట్లుండవలయు నని యీక్రిందిపద్యములలోఁ దనప్రతిజ్ఞావాక్యములనుగూడ నుడివి యున్నాఁడు.

"ఉ. జాత్యనుగామి నొప్పయినసంస్కృత మెయ్యెడఁ జొన్ప వాక్యసాం
గత్యము సేయుచో నయితగర్వముతోడుగఁ జెప్పిపెట్ట దౌ
ర్గత్యముఁ బోఁపఁ బ్రాసముప్రకారము వేఱగునక్షరంబులన్
బ్రకృత్యనురూప మంచు నిడ నూరుల కివ్విధ మింపుఁ బెంపదే."

"క. లలితపదహృద్యపద్యం
బుల నపదార్థంబు ఘటితపూర్వాపరమై
యలఁతియులంతియు నియులుగ
కాలసంధించినవిధంబు నమరఁగవలయున్."

ఇట్లు తిక్కన కుకవినిందను జేసియు, సత్కవీంద్రమార్గమును దెలిపియుఁ, గవిత్వపద్ధతినిగూర్చి ప్రతిజ్ఞావచనములను బలికియును సంతృప్తిని బడయఁజాలక తనకావ్యము స్వగుణముచేతఁ గాకపోయినను దనతాత యైనమంత్రిభాస్కరుని సారకవిత్వముచేతనైనను లోక మాదరించు నని యీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

> "గీ. సారకవితాభిరాము గుంటూరివిభుని
> మంత్రి భాస్కరు మత్పితామహునిఁ దలఁచి
> యైన మన్ననవడయు లోక మాదరించు
> వేఱ నాకృతిగుణములు వేయు నేల?"

మొదట మనుమసిద్ధి తన్ను మామా యని పిలుచుచున్నందులకుఁ గృతి నిమ్మని యడుగుటయు, నతనిపలుకు తనకు నింపుపుట్టించుటయుఁ, దరువాత మనుమసిద్ధి కులశీలరూపస్వభావాదులు తలపోసికొని కృతి నొందుట కర్హుం డని మనస్సు సమాధానపఱుచుకొనుటయుఁ, గుకవినిందఁ జేసియుఁ, గావ్యరచనావిధానమును దెలిపియు, సత్కవీంద్రమార్గమును సూచించియు, నుత్తరరామాయణమును రచించుటకుఁ గల కారణమును వ్యక్తీకరించియుఁ, గవిత్వపద్ధతిని గూర్చి ప్రతిజ్ఞావాక్యములను నుడివియుఁ దృప్తిం గనఁజాలక లోక మెట్లాదరించునో యన్న సంకోచము పీడింపఁ దనతాత యైన మంత్రిభాస్కరుని సారకవిత్వమహిమము నైనఁ దలంచి మన్ననమెయి లోక మాదరించునని సమాధానము చెప్పుకొని తృప్తి గాంచుటయు మొదలగువానిని బరిశీలించిన పక్షమునఁ దిక్కన రచించినకావ్యములలో నిది ప్రథమకావ్య మని తప్పక స్ఫురింపఁగలదు.

తిక్కన తనతాత యైనమంత్రిభాస్కరుని గ్రంథములం బేర్కొనకుండుట మిక్కిలిశోచనీయ మైనవిషయముగా నున్నది. ఇట్లే మనుమసిద్ధిరాజు తండ్రి యైన తిక్కరాజునకుఁ గవిసార్వభౌమబిరుదాంకము

గల దని చెప్పినాఁడు గాని యాతఁడు రచించినగ్రంథము లెవ్వియో తెలిపినవాఁడు గాఁడు. నిర్వచనోత్తరరామాయణమునుగూర్చి యాంధ్రకవులచరిత్రమునం దిట్లున్నది.

“తిక్కన తెనుఁగుపుస్తకములవలెఁ గాక రఘువంశాదికావ్యములవలె దీని నీకవి నడుమనడుమ వచనము లుంచక సర్వమును పద్యములుగానే రచియించెను. ఈతఁడు రచించినభారతమువలె నీయుత్తరరామాయణ మంత రసవంతముగాను ప్రౌఢముగాను లేకపోయినను, పదవాక్యసౌష్ఠవము గలిగి మొత్తముమీఁద సరసముగానే యున్నది. ఇది బాల్యమునందు రచియింపఁబడిన దగుటచే నిట్లుండియుండును. ఈగ్రంథమునందుఁ బదకాఠిన్యమంతగా లేకపోయినను బహుస్థలములయం దన్వయకాఠిన్యము గలదు. ఇందలికథ సంస్కృతములో నున్నంత లేక మిక్కిలి సంగ్రహపఱుపఁబడినది. శైలి పలుచోట్ల నారికేళపాక మనియె చెప్పవచ్చును. అందుచేతనే యీగ్రంథము భారతమువలె సర్వత్ర వ్యాపింపకున్నది. ఇతఁడు పదియాశ్వాసముల గ్రంథము వ్రాసినను పుస్తకమున మాత్రము ముద్రింపలేదు. రామనిర్యాణకథను జెప్పుట కిష్టము లేక గ్రంథపూర్తి చేయ లేదని పెద్దలు చెప్పుదురు. తరువాతఁ గొంతకాలమునకు మిగిలినభాగము నేకాశ్వాసముగా రచియించిన జయంతిరామభట్టు తిక్కనసోమయాజి మనుమరాజున కిచ్చినట్లుగా నరాంకితము చేయక తాను జేసిన కడపటియాశ్వాసమును భద్రాద్రిరామునికంకితము చేసెను.”

నిర్వానోత్తరరామాయణము పదవాక్యసౌష్ఠవము గలిగి మొత్తముమీఁద సరసముగానే యున్న దని యొప్పుకొనుచు నాంధ్రకవిచరిత్రకారుఁడు తిక్కనకృతభారతమంత రసవంతముగాను ప్రౌఢముగాను లేదనుట వింతగా నున్నది. దీనికిఁ గారణము బాల్యమునందు రచించుటయఁట. పదకాఠిన్యము లేదఁట గాని యన్వయకాఠిన్యము గలదఁట. ఇందలికథ సంస్కృతములో నున్నంత లేక మిక్కిలి సంగ్రహపఱుపఁబడుటయు, శైలి పలుచోట్ల నారికేళపాకముగా నుండుటయు నీగ్రంథము భారతమువలె సర్వత్ర వ్యాపింపకుండుటకుఁ గారణములఁట. ఇది యంతయు భ్రాంతిమూలము. ఈగ్రంథమును భారతముతోఁ బోల్ప సరికాదు. తిక్కన వ్రాసినయవతారిక వీరిభ్రాంతికిఁ గారణ మైనట్లు

కనుపట్టుచున్నది. ఇది ప్రథమకావ్య మగుటచేతఁ దిక్కన పీఠికలోఁ బలుపోకలఁ బోయెను గాని మఱియొండు గాదు. ఇది బాల్యము వీడి యౌవనము ప్రవేశించినతరువాత వ్రాసిన ప్రౌఢకావ్యమె కాని యప్రౌఢకావ్యము గాదని పీఠికలోనివిషయములే వేనోళ్లఁ జాటుచున్నవి. వివిధవిద్యాపరిశ్రమవేది యైనప్రభువు (కృతిపతి) అప్రౌఢుఁడైన యొక బాలకవిని 'మామా' యని పిలుచుటయుఁ బిలుచుచుండెఁ బో 'మామా' యనుచున్నందుకుఁ గృతి నిమ్మని యడుగుటయు సంభవము కాదు. వేయునేల? నిర్వచనోత్తరరామాయణములోని యవతారికయే మిక్కిలి ప్రౌఢముగానున్నది. అవతారికలోనే యింతప్రౌఢిమను జూపఁగలిగినవాఁడు బాలకవి యెట్లగును? ఇతఁడు,

"క. వచనము లేకయ వర్ణన
రచియింపఁగఁ గొంత వచ్చుఁ బ్రౌఢులకుఁ గథా
ప్రచయమును పద్యములన సం
ధుచితముగనఁ జెప్ప నాఖ్య లొప్పద ననఁగే."

అనుపద్యమును వ్రాయుటయే వచనము లేకుండ వర్ణన సేయుట ప్రౌఢకవిలక్షణముగా భావించె ననుటకు నిదర్శనముగా నున్నది.

మఱియును 'అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిశిల్పక్రమునం బారగుడం గళావిదుఁడ' నన్నపలుకు ప్రౌఢకవినోటనుండి వినంబడును గాని యప్రౌఢుఁ డగు బాలకవినోటనుండి వినంబడునా! ఉత్తరరామాయణము రచించుటయందుఁ దిక్కనయుద్దేశము సరసమైన కావ్యమును వ్రాసి మనుమసిద్ధికిఁ గృతి నొసంగవలయు ననియె కాని మక్కికిమక్కిగా సంస్కృతమునకు సరియైన తెలుఁగు చేయవలయు ననికాదు. అందుకొఱకే తిక్కన కథను సంస్కృతములోనుండి కొన్ని మార్పులతోఁ దీసికొని యనుచితములుగాఁ దోఁచినవానిని ద్రో

పృచ్ఛి యుచితము లనితోఁచినవానిలోఁ గొన్నిటిని పెంచికూడ వ్రాసెను. నిర్వచనోత్తరరామాయణములోని కొన్ని ప్రౌఢభాగము లన్వయకాఠిన్యములుగఁ గన్పట్టవచ్చును. అక్కడక్కడఁ గొన్నిపద్యములు చూచిన శైలి నారికేళపాకముగాఁ గన్పట్టవచ్చును. కాని గ్రంథమును సాంతముగాఁ జదివినవారికి శైలి ద్రాక్షాపాకమును గదళీపాకము నై ప్రౌఢముగానే కన్పట్టుచుండును. ఈకావ్యమునందు రామనిర్యాణకథను జెప్పుటకు భీతిల్లి తుదియాశ్వాసమును విడిచిపెట్టె నని కొందఱుపెద్దలు చెప్పుదు రని యట్లుభావించుట తగునా? అట్లయ్యెనేని తిక్కనసోమయాజి భారతములో స్వర్గారోహణపర్వములోఁ గృష్ణనిర్యాణమును, అటుపిమ్మటఁ బాండవులలోకాంతరగమనమును జెప్పుటకేల భీతిల్లి విడిచిపెట్టలేదు? తుదియాశ్వాసము విడిచిపెట్టుటకు మఱియొకకారణ మేదియైన నుండవలెను గాని యిది కారణము కాదు. ఆతుదియాశ్వాసమును దెనిఁగించిన జయంతిరామభట్టయనను తాను దానిని దెలిఁగించుటకుఁ గారణమును జెప్పినవాఁడు కాఁడు. కొన్నివిషయములలోఁ బాపరాజకవికృత మైనయుత్తరరామాయణమునకన్న రసపుష్టి కలదిగానున్నది. ఇది భారతమువలెఁ బ్రౌఢముగా లేకపోవుటచేతనే సర్వత్ర వ్యాపింపకున్నదఁట. అట్లయినయెడల నత్యుత్తమకావ్యము లని యాంధ్రకవిచరిత్రకారునిచేఁ బొగడ్తలు గాంచిన యుత్తరహరివంశాదికావ్యములు సర్వత్ర వ్యాపింపకుండుటకుఁ గారణమేమి? పంచమవేద మని పూజింపఁబడెడు భారతమునకుఁ గలవ్యాప్తి యీనిర్వచనకావ్యమునకే కాదు మఱి యేకావ్యమునకును రాదు. మనయాంధ్రదేశములో భారత భాగవత రామాయణములకుఁ గల వ్యాప్తి యేయుత్తమకావ్యములకుఁ గలదు? కవితారచనమున కేనియమములను విధించెనో యానియమములను బాటించియే తిక్కన తన నిర్వచనోత్తరరామాయణమును బ్రౌఢముగా రచించి వాసికెక్కె

నాఁడు. అందువలననే దీనిని రచించిన స్వల్పకాలములోపలనే యాంధ్రప్రపంచమునఁ గవితాసామ్రాజ్యపీఠము నధిష్ఠించి జగత్ప్రాజ్యుఁడయ్యెను. ఈనిర్వచనోత్తరరామాయణము రచించునాఁటికి తిక్కన శివభక్తిపరాయణుఁడై యుండెను గాని తరువాత నద్వైతవాదియై యభేదవాదమును బోషించెను.

ఎ ని మి ద వ ప్ర క ర ణ ము

కవిపండితగోష్ఠి

మనుమసిద్ధిభూపాలుని పరిపాలనకాలమున నప్పటప్పటఁ బాంధ్యులవలనను, దాయాదులవలనను, శత్రురాజులవలనను, దొందఱలును, బాధలును గలుగుచున్నను, తిక్కన విద్యావిషయమునఁ జేసినపరిశ్రమను జూచినప్పుడుమాత్ర మతనిమహిమ యిట్టిదని గోచరము గాక మానదు. ఆంధ్రదేశమున నొకభాగ మగుపాకనాటివిషయమును మనుమసిద్ధిరాజు పరిపాలనము సేయుచుండ నాంధ్రప్రపంచమున జగత్ప్రాజ్యం బగుపాండిత్యకవిత్వసామ్రాజ్యంబు ననుభవించుచున్నవాఁడాతనిమంత్రి యగుతిక్కనామాత్యుఁడే. ఇట్టిసామ్రాజ్య మీతఁ డనుభవించుట యెట్లుసాధ్యపడియెనా యని కొంద ఱాశ్చర్యపడవచ్చును. ఆశ్చర్య మేల?

“మ. అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించుశి
ల్పమునం బారగుడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడఁ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్.”

అనుపద్యములోఁ దిక్కన తా నుభయభాషాకవిత్వకళాపారగుఁ డై నట్లు వ్రాసికొన్నది తా నట్టివాఁ డగుట యథార్థ మైయుండుట చేతనే కాని తనడంబమును లోకమునకుఁ బ్రకటించుకొనుటకై కాదు. తిక్కన డంబము చూపువాఁడు గాఁడు. ఈసత్యము నెఱింగినవాఁడు గనుకనే సమకాలికుఁ డైన కేతనకవి,

"క. అభినుతుఁడు మనుమభూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుం డై తా
నుభయకవిమిత్రనామము
త్రిభువనముల నెగడ మంత్రితిక్కఁడు దాల్చెన్"

అని యాతని కుభయకవిమిత్రుఁ డనుబిరుదము గల దని తెలిపియున్నాఁడు. ఇది యొకసామాన్యపుబిరుదము కాదు. ఇం దెంతో మహిమ కలదు. 'కవిపంచాననుఁడు, కవిరాజు, కవిసార్వభౌముఁడు, కవిలోకచక్రవర్తి' మొదలుగాఁగల కొన్నిబిరుదములవలె దుర్గర్వమును, దుస్స్వభావమును, అసహిష్ణుత్వమును బ్రేరేపించి తగవులను బుట్టించి సౌజన్యమును రూపుమాపునట్టి మిథ్యాబిరుదములవంటిది కాదు. మిత్రశబ్ద మెప్పుడును బ్రేమను దెలుపుచుండును. ఉభయకవిమిత్రుఁ డనఁగా సంస్కృతాంధ్రకవులను బ్రేమతోఁ జూచువాఁ డని యర్థము. ఇతనికవితాసామ్రాజ్యము ప్రేమపూర్ణ మగుటంజేసి కవిలోకమున కాశ్రయమై జగత్పూజ్యం బయ్యెను. ఇతఁ డాంధ్రకవితాసామ్రాజ్యపట్టాభిషిక్తుఁడై కవిప్రపంచమును బ్రసన్నదృష్టితో వీక్షించెను. అప్పుడు కవిప్రపంచ మానందాబ్ధి నోలలాడుచు నిట్లు వినుతించెను.

"సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన నీఁ
డనునాలుకకుఁ దొడ వైనవాఁడు
చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన నీఁ
డనుశబ్దమున కర్థ మైనవాఁడు

దశదిశావిక్రాంతయశుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చెప్పుటకుఁ బాత్రమైనవాఁడు
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చూపుటకు గుఱి యైనవాఁడు
మనుమసిద్ధిమహీశసమస్తరాజ్య
భారధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్య కూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి"

ఈవినుతి కవిప్రపంచమున కేతనరూపమున మూర్తీభవించి చేసినదిగాఁ దలంపవలయును గాని కేవలము తనంతటఁ దానుగాఁ గేతన చేసిన దని మనము గ్రహింపరాదు. ఇతరులు చేయుస్తోత్రపాఠముల కుబ్బిపోయి యహంకరించి తమనిరంకుశాధికారమును జాటి తమయాధిక్యమును గన్పఱుచుకొనవలయు నని వ్యర్థాభిలాషతో దంభాచార్యవృత్తిని వహించి కవిప్రపంచముపై భుజాస్ఫాలనము సేయుచు దండయాత్రలు సలుప నుత్సహించెడు దుష్కవులమార్గమును గొనక యీతఁడు సత్కవులమార్గమును గొని 'బుధారాధనవిధేయుఁడ, బుధారాధనవిరాజి' నని నమ్రభావమును దేటపఱుచుచుఁ దన కవితాసామ్రాజ్యాభిషిక్తపదవిని సంరక్షించుకొనియెను. వివిధ విద్యాపరిశ్రమవేదియుఁ గవిసార్వభౌమునిపుత్త్రుఁడును గావున మనుమసిద్ధి తిక్కన యధిష్ఠించిన విద్యాగురుపీఠముయొక్క మాహాత్మ్యము ననుభవపూర్వకముగా నెఱింగినవాఁడే కావున వినయవిధేయతలను జూపుచుఁ బూజింపుచుండెను. ఇట్లు పాండిత్యకవిత్వసామ్రాజ్యపట్టాభిషిక్తుఁడై వైదికమార్గనిష్ఠ మగువర్తనము గలవాఁడై క్రతుదీక్షఁ బూని భూసురబృందమున కానందము సంఘటించి బహువిధాధ్వరములను గావించి త్యాగశీలుఁడై బహువిధదానములను జేసి బుధోత్తములను దృప్తులను గావింపుచుఁ దనయశము నాంధ్రప్రపంచమున దశదిశ

లకుఁ బఱపుచుండెను. (వైదికమతోద్ధరణమునకై చతుర్ముఖుఁడు తిక్కనరూపమున నవతరించినవాఁ డని యాంధ్రలోకము విశ్వసించి బ్రహ్మపీఠము నొసంగెను.) నిర్వచనోత్తరరామాయణము రచించి మనుమసిద్ధి కంకితము చేసినపదిసంవత్సరములలోఁ దిక్కనసోమయాజి యాంధ్రదేశమున నిట్టిమహోన్నతపదవిని బొందెను. ఏవేళను నీతని పవిత్రగృహమున వేదఘోషము వినంబడుచునే యుండును. ఆకాలమున నాంధ్రదేశములోని వేదవేత్తలు మంత్రవేత్తలు నీమహానుభావుని సందర్శింపకుండ నుండలేదు. అట్లే కవిపండితకోటియు విక్రమసింహపురమునకు నేగుదెంచి యీకవిబ్రహ్మను సందర్శింపకుండ నుండలేదు. ఈకాలముననే యీతఁడు విజయసేనము మొదలగుకావ్యములను రచించెను గాని యవియన్నియు భారతముప్రక్కను దివిటీముందఱదీపములై ప్రకాశింపక కాలక్రమమున నశించిపోయి నామమాత్రావశిష్టములై యున్నవి. తిక్కనసోమయాజి యిట్టివాఁడగుటచేతనే కేతనకవి దశకుమారచరిత్రమునం దిట్లభివర్ణించియున్నాఁడు.

"సీ. సరసకవీంద్రుల సత్ప్రబంధము లొప్పఁ
  గొను నను టధికకీర్తనకుఁ బెరువు
లలితనానాకావ్యములు చెప్ప నుభయభా
  షలయందు ననుట ప్రశంసత్రోవ
యర్థిమైఁ బెక్కూళ్ల నగ్రహారంబులఁ
  గా నిచ్చు ననుట పొగడ్తపొలము
మహితదక్షిణలైనబహువిధయాగంబు
  లొనరించు ననుట వర్ణనముదారి
పరుని నొక్కని కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపు సొంపారి నెగడునట్టి
కొమ్మనామాత్యుతిక్కని కొలఁదిసచివు
లింక నొక్కరుఁ డెన్నంగ నెందుఁ గలఁడు."

తిక్కనసోమయాజి శ్రీమంతుఁడు; నిరర్గళధీమంతుఁడు; అధ్వరాబ్జదిననాథుఁడు; నీతిచాణక్యుఁడు; కృతిపతి; కృతికర్త; శౌర్యత్యాగవిఖ్యాతశాలి; మనుమసిద్ధిమహీపాలమంత్రిమాణిక్యుఁడు; దండాధీశుఁడు; బ్రహ్మవేత్త— ఇన్నిలక్షణము లొక్కనియందే పట్టియుండుటవలనఁ గేతనయొక్కఁడే కాఁడు కేతనను బుట్టించినదైవమునయితము మెచ్చుకొనకమానఁడు. ఆకాలమునందుఁ గవిత చెప్పి తిక్కనసోమయాజిని మెప్పించుట కష్టసాధ్యమై యుండెను. అందులకై యనేకులు ప్రయత్నించిరి. భోజరాజీయమును విరచించిన యనంతామాత్యకవిముత్తాత యగుబయ్యనమంత్రి కవిత్వము చెప్పి తిక్కనసోమయాజిని మెప్పించి 'భవ్యభారతి' యనుబిరుదమును బొందె నని భోజరాజీయమునందలి యీక్రిందిపద్యమువలన విదిత మగుచున్నది.

"చ. క్షితిఁ గ్రతుకర్త నా వినుతి చేకొని పంచమవేద మైన భా
రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్కకవినాయకుఁ డాదట మెచ్చి భవ్యభా
రతి యనఁ బేరుఁ గన్నకవిరత్నము బయ్యనమంత్రి యల్పుఁడే."

కేతనకవి కూడ,

"గీ. కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చఁ
బరఁగుదశకుమారచరితంబుఁ జెప్పిన
ప్రోడ నన్ను వేఱె పొగడ నేల?"

అని యాంధ్రభాషాభూషణ మనుగ్రంథమునందుఁ జెప్పియున్నాఁడు. ఆకాలమునందుఁ గవులు తిక్కనసోమయాజివలన మెప్పు నొందినఁ దమజన్మ సార్థక మైనట్లుగాఁ దలంచుచుండిరి అట్టివారిలోఁ గేతనకవి యొక్కఁడు. ఇతఁడు కేవలము ధనాపేక్షచేఁ దిక్కనసోమయాజిని స్తోత్రపాఠములు చేసి కృతి నిచ్చినవాఁడు గాఁడు. వేఁగీదేశమున వెల్టిరాల యనునగ్రహారమునకు నగ్రణియును, కౌండిన్యగోత్రుఁడును,

మారయకును సంకమాంబకును దనూజుఁడును, బండారు కేతదండాధీశుని మఱఁదియు, నధ్యయనపరుఁడును, మూలఘటికాన్వయుఁడును, ప్రోలనార్యుని యనుఁగుఁదమ్ముఁడును, సంస్కృతాదిభాషాకావ్యకర్తృత్వమున నుతిఁ గన్నవాఁడును, అభినవదండినా వినుతిఁ గన్నవాఁడును, విఖ్యాతయశుఁడు నైన కేతనార్యుని రప్పించి యాసనార్ఘ్యపాద్యతాంబూలాంబరాభరణదానాద్యుపచారంబులఁ బరితుష్టహృదయుం జేసి, 'ఆర్యా! నీవు సంస్కృతాద్యనేకభాషాకావ్యరచనావిశారదుండవగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్క కావ్యంబు రచియించి నన్నుఁ గృతిపతిం జేయవలయు' నని సగౌరవంబుగాఁ బ్రార్థించినందునఁ గేతన తనకావ్యకన్యకుఁ దిక్కన తగినవరుం డని భావించి సంస్కృతమున దండి రచియించిన దశకుమారచరిత్రము నంచితభావరసోదయాభిరామమ్ముగా రచియించి యంకితము చేసె నని దశకుమారచరిత్ర పీఠిక వలన వేద్య మగుచున్నది. ఈదశకుమారచరిత్రము నితఁడు తిక్కన మెచ్చుకొనునంతరసవంతముగానే రచియించెను. ఇయ్యది తిక్కన భారతమునకుఁ బూర్వముననే రచియింపఁబడిన దనుటకు సందియము లేదు. మనుమసిద్ధి పదభ్రష్టుఁడై కాకతీయుని ప్రాపువలనఁ బునరభిషిక్తుఁ డగుటకుఁబూర్వమే యీకావ్యము రచియింపఁబడిన దనుట కావిషయ మెద్దియు నిందుఁ దెలుపఁబడకుండుటయె ముఖ్యకారణము. తిక్కననుగూర్చి సమకాలికుఁ డైన కేతన పలికినపలుకులు విశ్వసనీయము లని శ్రీయుతులు జె. కృష్ణరావుగారు వ్రాసినవాక్యములనే నే నీదిగువ నుదాహరించుచున్నాను.

"బోద్ధారో మత్సరగ్రస్తాః" అనువచనంబురీతి సాధారణంబుగఁ బండిత ప్రకాండులు పరస్పరకావ్యరత్నంబుల నసూయాక్షిరోగనిష్పీడితదృక్కుల నరసి నెరసులఁ గొన్నిట నారోపించుటచేఁ దృప్తి వహించి తద్రత్నంబుల నాత్మకేముషీశాణోపలంబుల నొరసిన నానెరసులు మగుడ గుణంబులుగా నెక్కుడుఁ బరిణమిం

చునో యని యట్లు సేయ నొల్లకుందురు. ఈపరస్పరవైముఖ్యంబు కృతిరత్నంబుల యెడఁగాక తఱచుగాఁ గృతిరత్ననిర్మాతలయెడంగూడ వ్యాప్తం బగు. "సమకాలమువారలు మెచ్చ రెకదా" యన్న కవిస్వభావము సమకాలికులయందును మఱి కొంత మెండు. ఇందునకుఁ దార్కాణము లెన్నియేనిఁ జెప్పం జొప్పడు. తొల్లి భవభూతి బాణుని 'హాటాదాకృష్టానాం కతిపయపదానాం రచయితా జనః' అని యాక్షేపించినట్లును, 'నీయీకాపుకవిత్వపుమాటలు బాపనకవివరుని చెవికిఁ బ్రమదం బిడునే' అని రామకృష్ణుఁడు రామరాజభూషణుఁ దిరస్కరించినట్లును ఆంగ్లేయకవీంద్రులలో నగ్రగణ్యుం డైనషేక్స్పియరును బెంజాన్సనులోనగువారు వెదు రని భావించినట్లును గ్రంథములచేఁ దెలియవచ్చుచున్నది. కాఁబట్టి కవీంద్రులొండొరులదోషంబులఁ బ్రకాశింపఁజేసి గుణంబుల నాచ్ఛాదింతు రనియు నొకవేళ గుణంబులఁ బ్రకాశింపఁజేసియున్న వానిని సత్య మనినమ్మవచ్చు ననియు నీవిచారమునకు ఫలము. ఏల యీవిషయ మింత పెంచి వ్రాసితి నన్నఁ దిక్కనచరిత్రమునకు ముఖ్యసాధనము లైన యతనిసమకాలికులయభిప్రాయంబులు విశ్వసనీయంబులే యని చూపుటకై వ్రాసితిని."

తిక్కనసోమయాజిసామర్థ్యము తత్కృతాంధ్రభారతమువలననే మనకుఁ దేటపడుచున్నందునఁ గేతనవర్ణనలు నూటికిఁ దొంబదితొమ్మిదిపాళ్లు సత్యము లని మనము విశ్వసింపవచ్చు నని తెలుపుచుఁ బై వారియభిప్రాయముతో నేకీభవించుచున్నాఁడను.

తిక్కనసోమయాజి

రెండవభాగము.

మొదటిప్రకరణము

తిక్కని యాంధ్రమహాభారతరచనము

తిక్కనసోమయాజి దశకుమారచరిత్రము సంకితము నొందిన పిమ్మటఁ గొంతకాలమునకు మనుమసిద్ధిరాజునకు శత్రువులనుండి కలుగుచుండుకష్టములు కన్నులారఁ గాంచుట తటస్థ మగుచువచ్చెను. రాజ్యసంరక్షణము దుర్భరమై కన్పట్టెను. మనుమసిద్ధిరాజు దాయాది వర్గమునుండి కలిగెడుబాధలను దప్పించుకొనుటకై కాకతీయసైన్యాధి పతులకు వశ్యుఁడై మెలఁగవలసివచ్చెను. తిక్కన సామాద్యుపాయ ములచే నెన్నితడవలు మనుమసిద్ధిరాజును గాపాడి రాజ్యము నిలువఁ బెట్టఁగలిగినను దుదకు దైవసంఘటనము వేఱుగ నుండెను. కడపట గొల్లరాజులతోఁ బసులమేపుబీళ్లకై తగవులు పడి యుద్ధములో మను మసిద్ధియును, దనపెదతండ్రికుమారుఁడు ఖడ్గతిక్కనయు మరణము నొందుటను గాంచెను. వృద్ధుఁడైనపెదతండ్రి సిద్ధనామాత్యుఁడుఁ గూడ స్వర్గస్థుఁ డయ్యెను. మనుమసిద్ధిరాజ్యమును గాకతీయసైన్యాధి పతు లాక్రమించుకొని పరిపాలింపసాగిరి. దేశస్థితియంతయును మాఱి పోయెను. జనులలో శైవ వైష్ణవ మతభేదములు ముదిరి పక్షము లేర్పడి తగవులు ప్రారంభ మయ్యెను. ప్రజలు ధర్మస్వరూపమును

గుర్తెఱుంగఁజాలక యధర్మమార్గప్రవర్తకులై వ్యవహరించుటను జూచి చింతిల్లుచుండెను. తిక్కనసోమయాజికి వయస్సు ముదిరినకొలఁదియు వైరాగ్యబుద్ధియు నెచ్చుచుండెను. మనుమసిద్ధియు, గణపతి దేవచక్రవర్తియు నొసంగినయగ్రహారములు భుక్తికిఁ జాలియుండుట చేతఁ దిక్కనసోమయాజి లౌక్యాధికారపదవులమీఁదియాసక్తిని విడిచి ధర్మానురక్తి గలిగి తనజీవితమును లోకహితార్థము వినియోగింపఁ బ్రతిజ్ఞ చేసి సంకల్పసిద్ధుఁ డయ్యెను. ప్రజలకు సమస్తధర్మములను బోధించునది యగుపంచమవేద మనం బరఁగుమహాభారతము సంస్కృతభాషయం దుండుటచేత జనసామాన్యమునకు దుర్గ్రాహ్య మైయుండెను. ఆంధ్రు లజ్ఞానాంధకారములో మునిఁగియుండి 'భాసురభారతార్థములభంగులనిక్క మెఱుంగనేరమిఁ గాసట బీసటే చదివి గాథలు త్రవ్వు'చుండెడివా రని యెఱ్ఱాప్రెగ్గడ వక్కాణించెను.* ఆంధ్రులకు భారతధర్మముల నాంధ్రభాషమూలముగా బోధించుటయె పరమార్థముగా గ్రహించెను. ధర్మాద్వైతమతసాంప్రదాయము లాంధ్రులకు సులభసాధ్యము లగుటకు మార్గము భారత మాంధ్రభాషలో రచింపఁబడుట యని దృఢముగా నాతనిమనస్సునకుఁ దట్టెను. దీనినే తిక్కనసోమయాజి విరాటపర్వములో మొదట కృతినిర్మాణప్రస్తావనలో వివరించినాఁడు. విద్వత్సంస్తవనీయభవ్యకవితావేశుఁడును, విజ్ఞానసంపద్విఖ్యాతుఁడును, సంయమిప్రకరసంభావ్యానుభావుఁడును నగుకృష్ణద్వైపాయనుఁడు (వ్యాసుఁడు) అభిలాషతో లోకహితవిష్ణుడు

---

* "ఉ. భాసురభారతార్థములభంగులనిక్క మెఱుంగనేరమిన్
గాసట బీసటే చదివి గాథలఁ ద్రవ్వుచునుండువారికిన్
వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లగఁ జేసినట్టి యా
జ్ఞాసనకల్పులం దలఁతు నాగ్యుల నన్నయ తిక్కనార్యులన్."

(నృసింహపురాణము.)

బూని భారత మనువేదమును ధర్మాద్వైతస్థితి ననుసరించి రచించె నని చెప్పినాఁడు.* ఇదియె ధర్మార్థకామమోక్షస్థితికి మూఁదల (మూఁల తల) యని నుడివెను. ఇట్టిభారతము నాంధ్రకవిత్వవిశారదుఁ డైన నన్నయభట్టారకుఁడు ప్రారంభించి మూఁడుకృతులు (మూఁడుపర్వములు) దక్షతతోఁ రచించె నని,

"ఉ. ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి యా
ష్టాదశపర్వనిర్వహణసంభృతమై పెనుపొంది యుండ నం
దాది దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్."

అనుపద్యములోఁ జెప్పి జనసంప్రార్థ్యము లాటంజేసి నాలుగవపర్వ మగువిరాటపర్వము మొదలుకొని తక్కినపదునేనుపర్వములును దుది ముట్ట రచించుట యొప్పు నని యీదిగువపద్యములోఁ జెప్పియున్నాఁడు.

"మ. హృదయాహ్లాదిచతుర్థ మూర్జితకథాశీలంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట యుద్యోగాఖ్యముం గూడఁగాఁ
బదు నేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబుగాఁ జెప్పినం
దుదిముట్టన్ రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్."

ఈ పై రెండుపద్యములం జదివినవారికిఁ దిక్కనసుహృదయము బోధపడక మానదు. ఇదివఱకొకపండితునిచేఁ దెలిఁగింపఁబడినభాగమును మరలఁ దాను దెలిఁగించుట ధర్మము గాదని విడిచి విరాటపర్వము మొదలుకొని రచించుట తగ వని చెప్పెను. కవిధర్మము నాలోచించి కొఱగానిపనులు కూడ వని తలంచి యామూఁడుపర్వములను దెలిఁగింపక విడిచిపెట్టినాఁడు గాని తెలిఁగింపఁ జేతఁగాక కాదు. అట్లుఁ

---

* "శా. విద్వత్సంస్తవనీయభవ్యకవితావేషుండు విజ్ఞానసం
పద్విఖ్యాతుఁడు సంయమిప్రకరసంభావ్యానుభావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహితనిష్ఠం బూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్య మగు లేఖ్యం బైనయామ్నాయమున్."

గాక తిక్కన మొదటినుండియుఁ దెలిఁగించెనేని నన్నయభట్టుమూఁడు పర్వములు నథర్వణాచార్యుఁడు రచించినపర్వములవలెనే సర్వత్ర వ్యాపింపక నశించెడివేమో. అట్లొనరించుటకుఁ దిక్కన సమ్మతింపలేదు. దీనిఁబట్టి తిక్కన యెట్టిసుహృదయము గలవాఁడో తేఁటపడఁ గలదు. తాను దెనిఁగింపకుండుటయేగాక నన్నయ దక్షతతో మూఁడు కృతులు రచించె నని యోగ్యతాపత్రముగూడ నొసంగి గౌరవించినాఁడు.

"ఆరణ్యపర్వము నాంధ్రీకరించుటచేతనే నన్నయభట్టు మతిభ్రమణము గలిగి మృతినొందె నని తలఁచుకొని తాను దానిని దెలిఁగించినచోఁ దనగతియు నట్లే యగు నన్నభీతిచేత నితఁడు దానిని దెనిఁగింపఁడయ్యెను. అందుచేతఁ దెనుఁగు భారతము కొంతకాలము పూర్ణముగా లేక కొఱఁతపడి యుండెను. ఆకాలము నందు వ్రాయఁబడిన తాళపత్రగ్రంథములు కొన్ని యిప్పటికిని వనపర్వశేషము లేకయే కానఁబడుచున్నవి. కవిని బట్టినభీతియే తరువాత నారణ్యపర్వశేషమును జేసినయెఱ్ఱాప్రెగ్గడకును బట్టి తన పేరిట గ్రంథరచన చేయక రాజనరేంద్రున కంకితముగా నన్నయభట్టుపేరు పెట్టియే దానిని రచించెను. అంతేకాక భారతమును జదువువారుసయితము నేఁటివఱకును నారణ్యపర్వములోని కొంతభాగము వదలియే మఱి గ్రంథపఠనము చేయుచున్నారు."

అని యాంధ్రకవులచరిత్రమునం దతిశయోక్తిగా వ్రాయఁబడిన వాక్యములు యథార్థములుగాఁ గన్పట్టవు. ఆరణ్యపర్వమును సంపూర్తిగానే నన్నయభట్టు రచించె నని తిక్కనపద్యమువలనఁ దెల్ల మగుచున్నది. నన్నయభట్టుకృతారణ్యపర్వము తిక్కనకాలమునాఁటికి బాగుగానే యుండి యెఱ్ఱాప్రెగ్గడకాలమునాఁటి కాపర్వములోని కడపటిభాగము నశించియుండవచ్చును. దానిని శంభుదాసు తెనిఁగించి యుండును. అంతియకాని యారణ్యపర్వము తెనిఁగించుటచేత నన్నయకుఁ బిచ్చియెత్తినదని భయపడి తిక్కన దానిని విడిచిపెట్టి విరాటపర్వమునుండియుఁ దెనిఁగించినాఁడని చెప్పెడికథ లేవియును విశ్వా

సార్థ్యములు కావు. నన్నయభట్టునకు రెండుశతాబ్దులకుఁబిమ్మట నున్నతిక్కనసోమయాజివఱకు భారత మాంధ్రీకరింపఁబడకయుండుటకుఁ గారణము నడుమకాలమునఁ గవులు లేకయుండుటఁ గాదు. కవు లనేకులు కలరు. కాని వారి కాత్మశక్తియందు విశ్వాసము లేదు. ఈమహోత్కృష్టగ్రంథము నాంధ్రీకరించుటకు గొప్పప్రతిభాశాలి పుట్టవలయు నని తలంచియుందురు. వారు తలంచినవిధముగానే ప్రజ్ఞానిధి పుట్టెను. నిర్వచనోత్తరరామాయణము రచించునాఁటికిఁ దిక్కన తా నెంతవైదికమార్గప్రవర్తకుఁడై యున్నను శివభక్తిపరాయణుఁడై యుండెను. తరువాత శ్రౌతస్మార్తక్రియాతత్పరుఁడై పూర్వమీమాంసామతావలంబకుఁడై కర్మాచరణమె ప్రాధాన్యముగాఁ దలంచెను. భారతమును రచించునాఁటికి హరిహరుల కభేదమును బాటించి యద్వైతమునం దాసక్తి జనించియే తన్మతసాంప్రదాయములను ధర్మములను లోకమున వ్యాపింపఁజేయ సంకల్ప ముదయించి యందుకొఱకే తక్కిన జీవితకాలమునంతయు వినియోగించి కృతకృత్యుఁడై ధన్యుఁ డయ్యెను. కావున సోమయాజిమతము ప్రథమమునుండియు నొక్కతీరున నుండె నని చెప్ప వీలు లేదు. అద్వైతమతధర్మములను సిద్ధాంతములను భారతముమూలముగా నాంధ్రభాషలో మొదట రచించినవాఁడు తిక్కనయనియే భావించెదను. తిక్కనసోమయాజి హరిహరనాథరూపుఁ డగుపరవస్తువును సగుణబ్రహ్మముఁగా భావించి,

"ఉ. శ్రీ యన గౌరి నాఁ బరఁగుచెల్వకుఁ జిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తియై హరిహరం బగురూపముఁ దాల్చి విష్ణురూ
పాయ నమశ్శివాయ యని పల్కెడుభక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చుపరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్."

అని సకలబ్రహ్మప్రార్థనము చేసి తత్ప్రసాదలబ్ధకవిత్వతత్త్వనిరతిశయానుభవానందభరితాంతఃకరణుం డగుచుఁ బైననుడివినవిధముగాఁ

బదేనుపర్వములు రచించుటకుఁ బూనుకొని యీప్రబంధమండలి కెవ్వని నధినాథునిఁగాఁ జేర్కొందునా యని యొకనాఁడు వితర్కింపుచు నిద్రించెనఁట. ఇక్కడ తిక్కనసోమయాజి తనకుఁ గలపితృభక్తిని దేటపఱచుటకై చమత్కారముగా స్వప్నవృత్తాంతమును గల్పించి చెప్పించినాఁడు. తనతండ్రి యైనకొమ్మనామాత్యుఁడు స్వప్నములోఁ గన్పడఁ దిక్కన నమస్కారము చేసెనఁట. అందుల కాతఁడు వాత్సల్య మతిశయించునట్లుగా వాని నాదరించి దీవించి కరుణార్ద్రదృష్టితోఁ జూచి యిట్లు పలికెనఁట. "కుమారా!

"కి మస్థిమాలాం కిము కౌస్తుభం వా
పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్
కిం కాలకూటః కిము వాయశోదా
స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే."

అని నీవు తొల్లి రచించినశ్లోకమును గాఢాదరంబున నవధరించి భక్తవత్సలుఁ డైనహరిహరనాథుఁడు నీదెస దయాళుఁ డై యునికిం జేసి నిన్నుఁ గృతార్థునిఁ జేయఁ గార్యార్థి యై నాకలోకనివాసి నయిన నాకుఁ దనదివ్యచిత్తమునం గలకారుణ్యము తెఱం గెఱుంగుశక్తిం బ్రసాదించి నన్ను నాకర్షించి కొలిపించుకొని వీఁడె విజయం చేయుచున్నవాఁ" డని చూపెనఁట. అంతఁ దిక్కన సవిశేషసంభ్రమసంభరితహృదయుం డై యవ్వలను గనుంగొనునప్పుడు సర్వేశ్వరుఁ డీక్రిందిస్వరూపముతో సాక్షాత్కరించె నని యిట్లు వర్ణించియున్నాఁడు.

"సీ. కరుణారసము వొంగి తొరఁగెడుచాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువాఱ
హరినీలపాత్రిక సురభిచందనమున
గతి నాభిధవళపంకజము మెఱయ
గుఱి యైనచెలువున నెఱసినలోకర
క్షణ మనంగ గళంబుచాయ దోఁపఁ

ప్రథమాద్రిఁ దోఁచెంచుభానుబింబము నాను
రమ్యుఁడఁ గౌస్తుభరత్న మొప్ప
తే. సురనదియును గాళిందియును గలసినట్టి
కాంతిపూరంబు శోభిల్లఁ గాంచనాంబ్రి
వాహనంబు నానందమగ్నమగఁ నేను
నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు."

అట్లు సర్వేశ్వరుఁడు ప్రత్యక్షము కాఁగా నతఁడు భక్తియుక్తముగా సాష్టాంగదండప్రణామం బాచరించి కొంచెము తొలఁగి వినయావనతుఁడై లలాటపరిభాగమున నంజలిపుటంబు ఘటించి నయనంబులు ప్రమదబాష్పసలిలవిలులితంబులుగను నవయవంబులు పులకపటలపరికలితంబులుగను నుండ నిలుచుండెనఁట. అంత నద్దేవుం డనుకంపాతిశయముచేతఁ జిఱునగవు నగుచు ని ట్లనియెనఁట.

"ఉ. వైదికమార్గనిష్ఠ వగువర్తనముం దగ నిర్వహించుచుం
ఖేదము లేనిభక్తి నతినిర్మలవృత్తిగఁ జేయుచుండి మ
త్పాదనిరంతరస్మరణతత్పరభావముకల్మి నాత్మ స
మ్మోదముఁ బొంది కావ్యరచనముం గొనసాగుచు నుండు మెప్పుడున్."

అందును,

క. పారాశర్యునికృతి యయి
భారత మనుపేరఁ బరఁగుపంచమవేదం
బారాధ్యము జనులకుఁ ద
ద్గౌరవ మూహించి నీ వఖండితభక్తిన్.
తే. తెనుఁగుబాస వినిర్మింపఁ దివురుటరయ
భవ్యపురుషార్థతరుపక్వఫలము గాదె
దీని కడ నియ్యకొని వేడ్క నాని కృతిప
తిత్వ మర్థించి వచ్చితి తిక్కశర్మ."

ఇట్టిదివ్యవచనామృతంబుచే నాతనియుల్లంబును వెల్లిగొలుపఁ బునః పునఃప్రణామంబు లాచరించి యప్రమేయప్రభావభావనాతీతుం డయ్యు

నాపరమేశ్వరుఁ డాశ్రితులకు నత్యంతసులభుఁ డని యదివఱకు బుధుల వలన వినియుండుటం జేసి తనుబోఁటి బాలస్వభావునకు నిట్టిమహనీయ మహిమ దొరకొనుటయుఁ గలుగునుగాక యని తలంచుచు నా దేవునకు విన్నపము సేయువాఁడై కొమ్మనామాత్యునానన మాలోకించెనఁట. అంత నతం డనుమతి యొసఁగెనఁట. అందుపైఁ దిక్కన యా దేవున కిట్లు విన్నవించుకొనియెనఁట.

“క. భూధవ తొల్లి కన్యా
శ్రీరాంబుధి నాకుఁ జిత్తంబున వి
స్తారమహితముగ నునిచితి
వారయ నశ్వరుఁడవు గావ యఖిలాండపతీ.

ఉ. ఇంతకు నేర్పునకు నాకయింతటిలోన మదీయవాణి న
త్యంతవిభూతిఁ బెంపెసఁగు నట్టినినుం గొనియాడఁ జేతఁ దా
నెంతటి పెద్ద నికరము నిట్లు పదస్థుఁ జేసితి నింక జ
న్మాంతరదుఃఖముల్ సొలఁగునట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే.”

అని యుపలాలితుఁ డగుబిడ్డఁడు తనకొలఁది యెఱుంగక మహాపదార్థమును వేఁడువిధముగా బ్రహ్మానందస్థితిం గోరి యాజగన్నాథునకు మరల సాష్టాంగనమస్కారం బాచరించెనఁట. అప్పుడు భగవంతుఁడుం బ్రసన్నముఖుఁడై యిట్లు పలికెనఁట.

“తే. జననమరణాదు లైనసంసారదురిత
ములకు నగపడకుండంగఁ దొలఁగు తెరువు
గను వెలుంగు నీ కిచ్చితి ననిన లేచి
నిలిచి సంతోష మెదనిండ నెలవుకొనఁగ.”

అంతఁ దిక్కన మేల్కాంచెనఁట. అంత భక్తితాత్పర్యములు మానసమున ముప్పిరిగొన నతం డిట్లు ప్రతిజ్ఞాదికమును జేసెను.

“ఉ. ఇట్టిపదంబు గాంచి పరమేశ్వరునిం గృతినాథుఁ జేసి యే
పట్టునఁ బాల్యమూర్తి యగుభారతసంహితఁ జెప్పఁ గంటి నా

పుట్టుఁ గృతార్థతం బొరసెఁ బుణ్యచరిత్రుఁడ వైతి నవ్విభుం
గట్టిదఁ బట్ట మప్రతిమకారుణికత్వమహావిభూతికిన్.

ఉ. కూర్చుట నాత్మరత్నమునకుం గనకంబునకుం దగున్ జనా
భ్యర్చిత మైనభారత మపారకృపాపరతం ద్రిశుద్ధినైఁ
జేర్చినదేవదేవునకుఁ బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి నా
నేర్చినభంగిఁ జెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్.

ఇది యనన్యసామాన్యం బగుపరమధర్మప్రకారంబు.

ఉ. కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావలి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయసంస్కృతి
శ్రీవిభవాస్పదం బయినచిత్తముతోడ మహాకవిత్వదీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్."

ఈ పైయవతారికలోని స్వప్నవృత్తాంతమును మనము చక్కఁగాఁ బరిశీలించువార మగుదుమేని తిక్కనసోమయాజి స్వాభిప్రాయప్రకటనము నెంతప్రౌఢముగాఁ జేసియున్నాఁడో స్పష్టము గాక మానదు. ఈస్వప్నవృత్తాంత మీతనికిఁ బితృభక్తి విశేషముగాఁ గలదని తేటపఱుచుచున్నది. తనపితృభక్తిని లోకమునకు వెల్లడించుకొఱకే స్వప్నవృత్తాంతమును జొప్పించినాఁడు. తిక్కనతండ్రి కొమ్మనామాత్యుఁడు తిక్కనబాల్యముననే మృతినొందియుండును. తిక్కన యిట్టిపవిత్ర మైనభక్తిని జూపుట కదియే కారణ మైయుండు నని నాయభిప్రాయము. ఇందు హరిహరనాథునిస్వరూపము నెంతో చక్కఁగా వర్ణించియున్నాఁడు. దేవునకును దనకును నడుమను దన తండ్రిని బ్రవేశపెట్టి వానిమూలమున దేవునిఁ బ్రత్యక్షము గావించుకొని "కృతిపతిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ" అని యతఁడే కావ్య మంకితము చేయు మని యడిగినట్లుగాఁ జెప్పినది ప్రౌఢముగా నున్న దనుటకు సంశయము లేదు. తిక్కనసోమయాజి తనకుఁ గలవైదిక మార్గనిష్ఠ మగువర్తనమును, హరిహరులయెడ భేదము లేక సమభక్తిఁ

కలిగియుండుటయును, స్మరియించి తదుభయసగుణమూర్త్యధిదేవతయగుహరిహరనాథునియెడఁ దన కుండు నిరంతరభక్తితోఁ గూడుకొన్నయాత్మానందానుభవమును లోకమునకుఁ దెలిపినవిధము మిక్కిలి ప్రౌఢముగా నున్నది. భారతము పంచమవేద మని ప్రసిద్ధిఁ జెందినగ్రంథ మగుటచేతఁ దానిం దెనిఁగించునప్పుడు దనకును దనవంశమునకును గలశ్రేష్ఠత్వమును, దేవతాభక్తి మొదలగువానినిఁ బ్రకటింపకయున్న చోఁ దనగ్రంథము సర్వజనాదరణపాత్రము గా దనుతలంపుతో సోమయాజి స్వకీయశిష్టత్వమును బ్రకటించుకొనె నని కవిజీవితగ్రంథకారుఁడు సూచించెను. ఇదియే నిజ మైనయెడలఁ దిక్కనవైదికమార్గనిష్ఠ మగుప్రవర్తనము కల్ల యని తేటపడఁగలదు. అభినవదండి దశకుమారచరిత్రమునఁ దిక్కననుగూర్చి చేసినవర్ణనము తిక్కనసోమయాజి చెప్పుకొన్నవైదికమార్గనిష్ఠ మగువర్తనము కల్లగాక సత్యమైనదే యని వేనోళ్ల ఋజువు చేయుచున్నది. కాని యాకవిజీవితగ్రంథకారుఁడే మఱియొకచోట,

"కాని స్వప్నములను నమ్మి వానిని గ్రంథస్థముఁ జేసినయాంధ్రకవులలో నితఁడే మొదటివాఁడు. భగవదుపాసనాపరులకుఁ దన్మూలముగ నంతఃకరణపరిపాకము గలిగి యిట్టిభగవదనుగ్రహసూచకస్వప్నంబు లగుటయు విశేషమహాత్త్వులు లభ్య మగుటయు నైసర్గికములే యని యాస్తికులకు విశేషించి చెప్పవలసినది లేదు. సోమయాజియు నట్టియుపాసనాబలంబున విజ్ఞానసంపన్నుఁ డై భారతరహస్యార్థములఁ దెలిసికొని వేదముం బ్రకటించినచతురాననప్రతిష్ఠ నందియుండె నని చెప్పుటకు సందియము లేదు.***** సోమయాజికి వేదాంతాదిశాస్త్రములందును, సాంఖ్యయోగాదిశాస్త్రములలోపలను గలవిశేషపాండిత్యము శాంత్యానుశాసనికపర్వములవలనను దక్కినపర్వములలోఁ దత్త్వముం జెప్పెడునితిహాసాంశములవలనం గోచరంబులు గాఁగలవు. పూర్వోత్తరమీమాంసాశాస్త్రము లెంతయు నేర్చినవాఁ డని సోమయాజి జైనపండితులతోఁ జేసినసంవాదాదికమువలనం గోచరంబగును. అట్టివానివివరములు గ్రంథస్థములు గాకున్న నట్టిసంవాదములవిషయము మాత్రము సోమదేవరాజీయము మొదలగుగ్రంథములలోఁ గొంత వివరింపఁబడియున్నదాని చే నీవఱకే ప్రకటించితిని."

అని వ్రాసియుండెను. ఇన్ని శాస్త్రములు చదువుకొని యిన్ని సాంప్రదాయములు తెలిసియుండి యింతవిజ్ఞానసంపన్నుఁడైన వేదవేత్త యాకాలమున వైదికమార్గనిష్ఠ మగువర్తనము గలిగియుండె ననుట యవిశ్వాసపాత్రము గాదు. వేదాంతతత్త్వరహస్యంబులు, చిదచిద్వివేకంబుల ధర్మాధర్మంబులు, రాజనీతిప్రకారంబులు, భారతవీరుల ప్రభావంబులు మొదలుగాఁగల భారతార్థముల నాంధ్రావలి మోదముం బొరయునట్లుగాఁ దెలిపి యాంధ్రప్రపంచము నుద్ధరించుటయె తిక్కన సోమయాజిమనఃసంకల్ప మైయుండెను. అందుకొఱకే యామహానుభావుఁడు మహాకవిత్వదీక్షావిధిని బూని సాత్త్వవతేయసంస్మృతి శ్రీవిభవాస్పదం బయినచిత్తముతో 'నీయాద్యశంబు లగుపుణ్యప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్కయారాధనవిశేషంబుగాఁ దలంచి'

"క. హరిహరనాథునకు మరు
త్సరిదాకల్పితమనోజ్ఞచరణశిరస్సం
దరమూర్తికి భావనతి
త్పరచేతోయుక్తభక్తపరతంత్రునకున్."

తాను 'విన్నపంబు సేయు తెఱంగుగా నంతస్సన్నిధిం గలిగించుకొని యమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేయు'వాఁడై,

"క. జలనిధిహిమవద్భూధర
కలితజననకేళికౌతుకవ్యక్తావ్య
క్తలలితసౌందర్యస్ఫుర
దలఘుతనుశ్రీసనాథ హరిహరనాథా!"

"దేవా దివ్యచిత్తంబున నవధరింపు" మని హరిహరనాథునిఁ బ్రసాదాభిముఖుని గావించుకొని విరాటపర్వము మొదలుగా స్వర్గారోహణపర్యంతముఁ బదునేనుపర్వముల నాంధ్రీకరించి యాంధ్రదేశీయుల నుద్ధరించి,

"చ. పరమపదాప్తిహేతు వగుభారతసంహిత శౌనకాదిభూ
సురవరు లింపునం గరఁగుచొప్పునఁ జెప్పినవాఁడ మోదసం
భరితతఁ బొంది యక్కథకు బ్రాఁతిగ నర్పితుఁ జేసి రక్తిలిన్
హరిహరనాథ! సర్వభువనాశ్రిత! నన్ దయఁ జూడు మెప్పుడున్."

అనుపద్యమున హరిహరనాథునిసదయావలోకనముఁ బ్రార్థించి స్వర్గారోహణపర్వాంతమున నున్నసమాప్తివృత్తములో "సంభృతానంద భావా" యనుసంబోధనమునఁ దాను మొదటఁ గోరిన 'బ్రహ్మానంద సంభృతిని' వచించెను.

తిక్కనసోమయాజికాలమున నెల్లూరున హరిహరాలయము గల దనియు నాతని పేరిటనే తిక్కనసోమయాజి తనభారతము నంకితము గావించె ననియుఁ జెప్పెదరు కాని యది యథార్థము కాదు. తిక్కనసోమయాజికాలమున హరిహరనాథునియాలయము నెల్లూరున లే దని చెప్పవచ్చును. తిక్కనసోమయాజిచే భారతమున స్మరింపఁబడిన హరిహరనాథుఁడు హరిహరులకు భేదము పాటింపనియద్వైతుల కుపాస్యుఁడును, హరిహరుల కధినాథుఁడు నగుసర్వేశ్వరుఁ డని విరాటపర్వములోనియవతారికను గాని యాశ్వాసాద్యంతపద్యములను గాని విమర్శించిచూచినపక్షమున బోధపడఁగలదు.

నన్నయభట్టారకుఁడును దిక్కనసోమయాజియును నేకకాలమునం దున్నవా రని కథలు కొన్ని కవిజీవితములందును గవులచరిత్రమునందును నుదాహరింపఁబడుటయేగాక కవిజీవితములం దావాదమె సిద్ధాంతము చేయఁబడియున్నది. కాని నూతనపరిశోధనములవలన నాయిరువురును సమకాలికులు కా రనియు నిరువుర కిన్నూఱుసంవత్సరములు కాలభేదము గల దనియు స్పష్టపడినది. కావున నాకథలన్నియు నవిశ్వాసపాత్రము లై వ్యర్థము లైపోయినవి. నన్నయ

పదునొకండవశతాబ్దిమధ్యమునను, తిక్కన పదుమూఁడవశతాబ్దిమధ్యమున నుండిరి.

ఈమహాభారతమును రచించునపుడు తిక్కనసోమయాజి చేసిన నియమము మఱియొక్కటి గానవచ్చుచున్నది. ఏదియన,

"గీ. కథ జగత్ప్రసిద్ధ గావునఁ బూర్వార్థ
రర్థయుక్తిఁ గొంత చూపఁగఁ దగదు
యత్న మించుకంత గాన నలప
వలసినట్లు చెప్పవచ్చు నింక."

అని చెప్పి సోమయాజి గ్రంథము ప్రారంభము చేసెను.

అనఁగా భారతకథ జగత్ప్రసిద్ధ మైనది; కావునఁ బూర్వాపరార్థములను సందర్భింపఁజేయునప్పుడు యత్న మేమాత్ర మక్కఱయుండ దనియును, ఇష్టానుసారముగ సందర్భము పొసఁగింపవచ్చు ననియుఁ జెప్పినపద్యమే కాని మఱేయొండు గాదు. ఈపద్యమును బురస్కరించుకొనియె కాఁబోలు సోమయాజి భారతముఁ దెనిఁగించుచో మాతృకమైనమూలగ్రంథమును ముట్టకయె యాశుధారగ నిరంకుశప్రజ్ఞతోఁ జేసియున్నాఁ డనుప్రవాద మొకటి లోకములో వ్యాపించియున్నది. ఈతెలుఁగుభారతము కష్టపడి సావకాశముగా నాలోచించి చక్కఁగాఁ జేయఁబడినగ్రంథమె కాని జను లనుకొను నట్లు మూలగ్రంథమును ముట్టక తెరలోఁ గూరుచుండి నోరికివచ్చిన ట్లెల్లను జెప్పఁబడినది కాదని కవులచరిత్రమునం దీయఁబడినసమాధానము సమంజస మైనదిగా నున్నది. తిక్కనసోమయాజి యీభారతమును జెప్పునప్పుడు దీనిని వ్రాయుటకై నిర్ణయింపఁబడినవాఁడు కుమ్మరగురునాథుఁ డని చెప్పుదురు. ఈగురునాథునకుఁ జెప్పినదానిని మరల నడుగక వ్రాయఁగలశక్తి యున్నదఁట.

ఈభారతమును రచించునపుడు తిక్కనసోమయాజి తడవుకొన కుండఁ గవిత్వముఁ జెప్పెద ననియుఁ, దా నొక్కసారి చెప్పినదానిని మరలఁ జెప్ప ననియుఁ జెప్పినదానిని మరల మార్చుకొన ననియుఁ బ్రతిజ్ఞ చేసినట్లును, జెప్పినమాటను మరల నడుగక గురునాథుఁడు వ్రాయుచుండఁగా శల్యపర్వములోఁ బ్రథమాశ్వాసముకడపట సహదేవుఁడు శకునిని జంపినతరువాత దుర్యోధనుఁడు తొలఁగిపోయె నని ధృతరాష్ట్రునితో సంజయుఁడు చెప్పుభాగమున,

> "క. పలపలని మూకలోఁ గా
> ల్నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీకొడుకు గదా
> కలితభుజుఁ డగుచు నొక్కఁడుఁ
> దొలఁగి చనియె—

అన్నంతవఱకుఁ బద్యమును జెప్పి తరువాత నేమియుఁ దోఁచక తిక్కన "యేమిచెప్పుదు న్గురునాథా"యని కుమ్మరగురునాథు నడిగినట్లును, అతఁ డది తన్నడిగినప్రశ్నగా భావింపక పద్యములోఁ జేర్చి "తొలఁగి చనియె నేమిచెప్పుదు న్గురునాథా" యని వ్రాసినట్లు, నప్పుడు తిక్కనసోమయాజి తనప్రతిజ్ఞకు భంగము వచ్చె నని చింతించుచుండఁగా "నేమిచెప్పుదు న్గురునాథా" యను కవి లేఖకునిగూర్చి యుద్దేశించినది 'కురునాథా' యని ధృతరాష్ట్రున కన్వయించి యాప్రశ్నయే పద్యపూరణమున కనుకూలించె నని గురునాథుఁ డాతని నూరార్చినట్లు నొకసిచ్చికథ కల దని యాంధ్రకవులచరిత్రమునందు గ్రంథస్థము గావింపఁబడి 'శ్రీమహాభారతము నాంధ్రీకరించిన యీమహాకవి కీచిఱుపద్యములోని యల్పభాగము తోఁచకపోయె నని సాధించుట కీకథ పనికిరాదు గాని తిక్కన యాశుధారగాఁ గవిత్వము చెప్పఁగలవాఁ డని స్థాపించుటకై యీకథ కల్పింపఁబడె ననిమాత్ర మూహింపఁ దగియున్న' దని యాంధ్రకవులచరిత్రమునందే సమాధానము చెప్పఁ

బడియున్నది. ఈపద్యమూలముననే గురునాథుఁ డొకఁడు జన్మమెత్తినాఁడు. ఈపద్యము మహాభారతమునఁ దిక్కనసోమయాజి వ్రాయకుండెనేని కుమ్మరగురునాథుఁడు జన్మ మెత్తకపోయుండును.

తిక్కనసోమయాజికిఁ గుమ్మరగురునాథుఁడు లేఖకుఁడుగా నుండె ననుట సత్యము కాదు. తిక్కన చేసినప్రతిజ్ఞమాటయు సత్యము కాదు. తిక్కన పూర్వాపరసందర్భములను జక్కఁగా నాలోచించి కవిత్వము చెప్పినవాఁడు గాని పైప్రతిజ్ఞతోఁ జెప్పినవాఁడు కాఁడని యీక్రిందివిషయమునుబట్టి స్పష్టపడఁగలదు.

ఒకసారి చెప్పినవిషయమును మరలఁ జెప్పవలసివచ్చినప్పుడును, బూర్వోక్తార్థమున కనువాదముఁ జేసినవర్ణనము మఱియొకప్రకరణమునఁ జేయవలసినప్పుడును దిక్కనసోమయాజి తొలుతఁ జెప్పిన గద్యపద్యములనే మరలఁ జెప్పుచువచ్చెను. మఱియు నొకప్రకరణమునఁ జేయవలసివచ్చినప్పుడు ప్రకరణానురూపముగఁ గొంచెము మార్పుఁ జేసి మున్నటిగద్యపద్యములనే వాడియున్నాఁడు. ఇట్టి పద్ధతి భారతములో నవలంబించుటయేగాక తాను రచియించిన నిర్వచనోత్తరరామాయణములోని పద్యములనుసైతము నించుక మార్చియు మార్పకయు సందర్భము గలిగినపుడు భారతములోఁ జొప్పించియున్నాఁడు. ఇందులకుఁ గొన్నిదృష్టాంతములను జూపుచున్నాఁడను.

ద్రోణపర్వమునం దభిమన్యుఁడు చంపఁబడినతరువాత ధర్మరాజునకు దుఃఖోపశమనముగాఁ గృష్ణద్వైపాయనుఁడు బోధించిన షోడశరాజచరిత్రమును దెలుపునట్టిపద్యములనే శాంతిపర్వమున బంధుమరణార్తిచేఁ దపించుచున్నధర్మరాజునకు గదాగ్రజుఁ డాకథను జెప్పవలసినసందర్భమునఁ బొందుపఱిచియున్నాఁడు. విరాటపర్వముద్వితీయా

శ్వాసములోఁ గీచకుఁడు తనయెడ మోహావేశపరవశుఁ డైనవు డాతని నదల్చుటకై ద్రౌపదిచేఁ జెప్పించిన,

"శా. దుర్వారోద్యమబాహువిక్రమరసాస్తోకప్రతాపస్ఫుర
ద్గర్వాంధప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రద్దు నిను నెల్లలసి విజృంభించి గం
ధర్వుల్ ప్రాణము మానసంబు గొనుట తథ్యం బెప్పితియుం గీచకా!"

అనుపద్యమునే ద్రౌపది తనభంగపాటును భీమునితో విన్నవించునపు డును దాను గీచకుని ట్లదల్చితి నని చెప్పుసందర్భమున నీపద్యమునే మరల చెప్పియున్నాఁడు.

ఉద్యోగపర్వములోఁ గౌరవులకడకు శ్రీకృష్ణుని రాయబారిగాఁ బంపినపుడు పాండవు లేవురును దమతమయభిప్రాయములను వేఱువేఱ కృష్ణునితోఁ జెప్పునప్పుడు భీముఁడు తనమాటఁగాఁ జెప్పినట్లుందు,

"తే. అన్నదమ్ముల పగయుండి యాకు మానదు
వారలు తలయెత్తి యింక నొండొరులతోడఁ
బెనఁగ నేటికి నేల పెద్దవారి
బుద్ధి విని పంచి కుడుచుట పోలదొక్కొ?"

అనుపద్యమునే స్త్రీపర్వములో గాంధారికిఁ గోపశాంతి కలిగించుటకై వినయముతో భీముఁడు ప్రయత్నించినపుడును జెప్పియున్నాఁడు.

విరాటపర్వములోఁ బ్రథమాశ్వాసమున విరాటరాజు తన కూఁతు రగునుత్తరను నాట్యశిక్షకై బృహన్నల కప్పగించుటకై రప్పించునప్పు డామెను వర్ణించిన,

"సీ. అల్లదనంబున ననువు మైకొనఁ జూచు
నడపుకాంతికి వింతతోడవు గాఁగ
వడవడ నూఁగారి వింతమై యేర్పడ
దారనిళులలో దారు నిగుడ

నిట్టలు ద్రోఁచుచు నెలవుల కలమేర
తెల్లను జిగిమెక్కి యేర్పడంగఁ
దెలుపును గప్పును వెలయంగ మెఱుఁగెక్కు
తారకంబులఁ గల్కితనము గోరఁ

ఆ చరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు
జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
చునికిఁ దెలుపు మండ నుత్తర నగుచెంచె
నలరుమయు నిప్పువ్వుటమ్ము గోలె."

అనుపద్యమునే శాంతిపర్వప్రథమాశ్వాసములో సృంజయరాజుకూఁతును నారదుఁడు మోహించినకథను జెప్పుచు దానివర్ణన సేయుచు నాటవెలఁదిగీతి 3, 4 పాదములను "ఉనికిఁ దెల్ప సృంజయునిపుత్రి మెలఁగువిధంబు నారదునకుఁ దగులొనర్చె" అని మార్చి ప్రయోగించియున్నాఁడు.

భీష్మపర్వము మొదట సంజయుఁడు ధృతరాష్ట్రునకు భీష్మశరతల్పగమనమును జెప్పునప్పుడు వ్రాసిన;

"సీ. ఆత్మయోధుల కెల్ల నాధార మగునట్టి
తనకు నస్త్రంబు లాధార మయ్యెఁ
బరశురామునకు నేల్సరిగాన తనయుండుఁ
గలిగె భంగంబు శిఖండిచేత
జనపతి దను నచ్చి మును జూద మొనరించెఁ
దాను గయ్యంపుజూదమున నోడెఁ
దనయార్పు లెలుఁగునఁ దలఁకువైరులు వొంగ
నొఱలుచు నేలకు నొఱఁగె నేఁడు

ఆ. తీవ్రబాణజాలదీప్తులు పరఁగించి
పాండుతనయసైన్యబహుళతమము
లీలఁ బదిదినంబు లోలిమై విరియించి
యధిప భీష్మభానుఁ డస్తమించె."

అనుపద్యములోఁ గడపటి యాటవెలఁదిగీతినే స్త్రీపర్వద్వితీయాశ్వాసమున గాంధారి భీష్ముంగూర్చి శోకించుచుఁ గృష్ణునితోఁ జెప్పునప్పుడు మూఁడునాలుగుపాదములలో నుండు ‘పదిదినంబు లోలిమై విరియించి యధిప’ యనుపదములను ‘పదిదినములు దోలి వినోదించి యనఘ’ యనుపదములతో మార్చి వ్రాసెను. ద్రోణపర్వముతృతీయాశ్వాసములో సైంధవవధార్థ మర్జునుఁ డరుగుచు ధర్మరాజును బట్టి దుర్యోధనున కిచ్చునట్టులు ద్రోణుఁడు చేసినప్రతిజ్ఞ మనస్సునకుఁ దట్టఁగా సాత్యకిం బిలిచి యాతనిరక్షణార్థము నియోగించునప్పుడు చెప్పిన,

“క. మనకు నిమిత్తము లెంతయు
ననుకూలము లయ్యె గెలుతు మాహవమున నేఁ
జనియెదఁ బ్రతిజ్ఞఁ దీర్పఁగ
ననఘా ధర్మసుతురక్ష కరుగుము నీవున్.”

“క. విను సింధురాజవధయును
మనుజాధపరక్షణంబు మనకు సరియ కా
వున నే నొకపని నీ వొక
పని మేకొని చేయు టరయఁ బాడియ కాదే.”

“ఆ. ఏను నిలిచినట్లకా నూఱడిల్లు నీ
వున్న నన్నరేశ్వరోత్తముండు
నిర్భరుండ వగుము నీవు నాదెస నాకు
హారి గలండు గలఁడె యచట నితఁడు.”

“వ. ఎల్లభంగుల రాజరక్షణార్థంబుగా నీకుం బోవలయును. పరాక్రమధుర్యుం డగునాచార్యుని ప్రతివ యొఱుంగవే యనుటయు.”

అనుపద్యగద్యములనే ధర్మరాజు సాత్యకి నర్జునునకుఁ దోడ్పడఁ బొమ్మనినప్పు డతఁ డతనితో నీసమాచారముఁ జెప్పుసందర్భమునఁ బ్రయోగించియున్నాఁడు. అప్పటిమాటలే యనువాదమునఁ జెప్పుట యెంతయుఁ జతురమై యుండెను.

కర్ణపర్వముప్రథమాశ్వాసమునఁ గర్ణునిదినయుద్ధమున శల్యుని పోరు వర్ణించుసందర్భమునఁ బ్రయోగించిన,

"సీ. కమలాకరములీలఁ గలఁచియాడెడు గంధ
దంతావళముసముద్దండతయును
దరఁ జిఁడి మృగసముత్కరము సింహంబుగా
వధియించుకంఠీరవంబు సేవ
వీరసారణ్యంబు నిర్భరాటోపతఁ
గాల్చునావాగ్నియుగ్రక్రమంబుఁ
బ్రకటవిక్రాంతిఁ బురత్రయంబును సహి
యించుఫాలాక్షునియేగ్గఱయును
ఆ. బోల్పఁబడియె నపుడు భుజగర్వశౌర్యప్ర
తాపదుర్గమప్రకోపములకు
మద్రవిభుఁడు గోలు మసఁగి శాత్రవసైన్య
హననకేళి సల్పునవసరమున."

అనుపద్యమునే యాటవెలఁదిగీతిమొదటిపాదమునఁ "బోల్పఁబడియె నపు" డనుపదములను "బోల్పఁబట్టుగాఁగ" ననుపదములతో మార్చి శల్యపర్వప్రథమాశ్వాసమున శల్యునియుద్ధమును వర్ణించుచోఁ జెప్పియున్నాఁడు.

ఇఁక నిర్వచనోత్తరరామాయణములోనిపద్యములను గొన్నిటి మార్చియు, మార్పకయు భారతమునఁ బ్రయోగించినవానిలో నొకటిరెండు దృష్టాంతములను జూపి విరమించుచున్నాను.

"చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ దాగ భీ
షణముగ నుప్పతిల్లి గభసంబున గేఁగినసూడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబు లొక్కటఁ బరాతిబలంబులఁ గప్ప శార్ఙ్గని
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్."

ఈపద్యమును నిర్వచనోత్తరరామాయణములో మూఁడవయాశ్వాసమున మొదట వ్రాసియున్నాఁడు. దీనినే విరాటపర్వములో సైంధవ

యాశ్వాసమునఁ గొంచెముమార్పు చేసి యీక్రిందిరీతిగాఁ బ్రయోగించియున్నాఁడు.

"చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ జాలభీ
షణముగ నుప్పతిల్లి రభసంబున రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబు లొక్కట నగారిబలంబులఁ గప్ప గాండివ
క్వణనము రోదసీకుహరకర్పరముం జెలింప నుగ్రతన్."

ఇంత 'తార' యనునది 'చాల' గను 'శార్ఙ్గనిక్వణన' మనునది 'గాండివక్వణనము' గను మార్పఁబడినవి.

మఱియుఁ దిక్కనసోమయాజి,

"మ. కలఁగెం దోయధిసప్తకంబు గిరివర్గంబెల్ల గూటాడె సం
చలతం బొందె వసుంధరాస్థలము పూర్ణాచక్రమల్లాడఁ గ్రొం
దల మందెం ద్రిదశేంద్రుపట్టణము పాతాళంబు ఘూర్ణిల్లె నా
కుల మయ్యెన్ గ్రహతారకావలులు సంక్షోభించె నావేధయున్."

అను నిర్వచనోత్తరరామాయణములో నైదవయాశ్వాసములోనిపద్యము మార్పు చేయకయె విరాటపర్వములో నాలవయాశ్వాసమునఁ బ్రయోగించియున్నాఁడు.

నిర్వచనోత్తరరామాయణములో నాలవయాశ్వాసమున దేవదానవయుద్ధసందర్భమున రచియింపఁబడిన,

"మ. పటువేగంబున శాతభల్లనియతాంపాతంబునన్ మింట ని
క్కుటమై పర్వ ధగద్ధగీయ మగుచుం గోపంబు రూపంబులై
చటులక్రీడఁ జరించున ట్లిరువురున్ శౌర్యోన్నతిం బోరి రు
త్కటదర్పోద్ధతులై పరస్పరజయాకాంక్షాప్రచండంబుగన్."

అనుపద్యమునే రెండవపాదమున "పర్వధగద్ధగీయ మగుచున్" అను పదములు "మంట ధగద్ధగద్ధగ యనన్" అనుపదములతో మార్చియు, నాలవపాదంబునందలి 'పరస్పరజయాకాంక్షాప్రచండంబుగన్' అను సమాసమును 'బరస్పరజయాకాంక్షం బ్రచండంబుగన్' అని వ్యస్త

పదములుగఁ జేసియు, విరాటపర్వము మూఁడవయాశ్వాసమున దక్షిణగోగ్రహణయుద్ధమునం బ్రయోగించియున్నాఁడు.

"శా. శ్రావ్యం బై చెలఁగన్ గభీరమధురజ్యానాద ముద్దారుపీ
రవ్యాపారనిరూఢతం బ్రతిశరాసంఘంబు మర్దించుచున్
సవ్యప్రౌఢి దృఢాపసవ్యగతి నాశ్చర్యంబుగాఁ జేయుచున్
దివ్యాస్త్రంబులఁ బోరి రిద్దఱును సాదృశ్యం బదృశ్యంబుగన్."

అను నిర్వచనోత్తరరామాయణములోఁ జతుర్థాశ్వాసమున రావణకుబేరులకు జరిగినయుద్ధసందర్భమునఁ బ్రయోగింపఁబడినదానిని మార్పేమియుఁ జేయకయే విరాటపర్వపంచమాశ్వాసమున నుత్తరగోగ్రహణమున ద్రోణార్జునసమరవర్ణనమునం జొప్పించియున్నాఁడు. ఇట్టివానిని బెక్కులు చూపవచ్చును. గ్రంథవిస్తరభీతిచే వానిని విరమించుచున్నాను.

రెండవ ప్రకరణము

భారతాంధ్రీకరణమునఁ దిక్కనసదృక్కృషి మేమి?

తిక్కనసోమయాజి నన్నయభట్టారకునివలె సంస్కృతమహాభారతమును యథామూలముగా నాంధ్రీకరింపలే దనియు, మాతృకకు సరిగా రచింపకపోవుటయేగాక మూలములోని పెక్కుభాగములను వెలిఁగింపక విడిచిపెట్టియు, సంగ్రహపఱిచియు, నిచ్ఛానుసారము పెంచియు రచించినాఁ డనియు, నిప్పటిపండితులు కొందఱు దోషారోపణములను జేయుచుండుటను వినుచున్నారము. ఆంధ్రభారతకవిత్రయమువారి భాషాంతరీకరణపద్ధతియే వీరికి బోధపడినట్లు గనుపట్టదు. ఆంధ్రభారతము, సంస్కృతమహాభారతములోని ప్రధానకథనుమా

త్రము గైకొని, స్వతంత్రకావ్యముగా వ్రాయఁబడిన గ్రంథమె. కాని కేవలము సంస్కృతభారతమునకు మక్కికిమక్కిగాఁ దెలిఁగింపఁబడిన దని యనుకొనుటయుఁ బొరపాటు. ఇప్పటిసంస్కృతభారతము నన్నయ తిక్కనాదులకాలములో నిట్లే యున్న దనుకొనుటయు మఱియొకపొర పాటు. తిక్కనకృతభారతమును సంస్కృతమహాభారతమునకు భాషాం తరీకరణ మని తలంచుట తిక్కనయెడ మనము సేయునపరాధముగాఁ బరిగణింపవలయు నని యొకరు వ్రాసిరి. సంస్కృతమహాభారతము నుండి కథనుమాత్రము గైకొని మూలములో లేనియర్థాలంకారము లను, రసభావములను, మానవస్వభావవర్ణనలను స్వేచ్ఛగాఁ బెంచి యు, మూలములో విసుగుపుట్టించెడు ననేకదీర్ఘకథానకములను, వర్ణనలను, వేదాంతఘట్టములను సంగ్రహపఱిచియు, నిరంకుశవృత్తిఁ గైకొని మూలముకంటెను వేయింత లధికమనోహరముగా నుండు నటుల రచించిన స్వతంత్రమహాకావ్యమనియే చెప్పఁదగియున్నది కాని మఱి యన్యముగా నూహింపఁదగినది కాదని వ్రాసిరి. తిక్కనసోమ యాజి సంస్కృతభారతములో నున్నదానిని మక్కికిమక్కిగాఁ దెనిఁ గించిపెట్టియుండినయెడల నీయాంధ్రభారత మింతయుత్తమోత్తమ కావ్యముగా నుండకయెపోవును. సంస్కృతకావ్యేతిహాసములను భాషాంతరీకరింపవలసినరీతి నిప్పటిపండితులకంటె నెక్కువబాగుగా నెఱింగినవాఁడే కాని తిక్కనసోమయాజి యల్పజ్ఞుఁడు గాఁడు. ఈ సందర్భముననే వ్రాయుచు విజ్ఞానసర్వస్వసంపాదకు లగు శ్రీయుత కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుపంతులుగారు "సంస్కృతభారతము బంగారపుముద్దవంటిది. ఆంధ్రభారత మాముద్దలోనుండి కావలయు నంతబంగారమును దీసికొని స్వర్ణకారునిబుద్ధివైభవముతోఁ జేయఁ బడిన చక్కని సువర్ణకమలమువంటిది. ఉభయభారతములలోని యీభేదముఁ జూపి స్వర్ణకారునిబుద్ధివైభవము వెల్లడిచేయుటయే

మాయుద్దేశము" అని యొకచోట వ్రాసియున్నారు. ఇదియెంతయు సయుక్తికమును సమంజసము నైనవాదము. ఈకాలమునందు, ముఖ్యముగా నీశతాబ్దిప్రారంభమునుండి, సంస్కృతమహాభారతగ్రంథకర్తలను గూర్చియు, వారిరచనలను గూర్చియు, మీమాంసలు చర్చలు విశేషముగా జరుగుచున్నవి. అసంఖ్యాకము లయిన యీచర్చలలోని విషయములను బరిశీలించినప్పుడు, నేగ్రంథము సరియైనపాఠములతో నొప్పుచున్నదో యిప్పటిపండితులకుఁ బరిశోధకులకు నిర్ణయించుటకు సాధ్యము కాకయున్నప్పుడు, నెప్పుడో 7, 8 వందల సంవత్సరములకుఁ బూర్వమున నన్నయతిక్కనాదులకాలమున నీమూలగ్రంథ మెన్ని పాఠాంతరభేదములతో వ్యాప్తిఁ జెందియుండెనో యెవ్వరు నిరూపింపఁ గలరు? ఈకారణమువలననే యాంధ్రభారతకవిత్రయములో నొక్కఁడగు నెఱ్ఱనార్యుఁడు తననృసింహపురాణమునందుఁ బూర్వకవిస్తుతిఁ జేయుసందర్భమున,

"భాసురభారతార్థములభంగులనిక్క మెఱుంగ నేరమిన్
గాసటఁజేసి చదివి గాథలఁ ద్రవ్వు తెనుంగువారికిన్
వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లఁగఁ జేసినట్టి య
బ్జాసనకల్పులం దలఁతు నాద్యుల నన్నయతిక్కనార్యులన్."

అని నన్నయతిక్కనార్యులనుమాత్రము స్మరించుటయగాక సంస్కృత మహాభారతమునుగూర్చి యొకవిశేషాంశమునుగూడఁ దెలుపుచున్నాఁడు. ఎఱ్ఱనార్యునికాల మిప్పటికిఁ గొంచెమించుమించుగా నాలుశతాబ్దులక్రిందటి దని మన మెఱుంగుదుము. నన్నయభట్టారకునకు మూఁడుశతాబ్దులకుఁ బిమ్మటను, దిక్కనసోమయాజికి నూఱుసంవత్సరముల కనంతరకాలమున నెఱ్ఱనార్యుఁ డుండుటచేత నాతనియభిప్రాయములనుగూడ నొకింత మనము పరిగణనములోనికిం దేవలసియుండును. అతఁ డేమనుచున్నాఁడు? వ్యాసమునిప్రణీతభాసురభారతార్థముల

నీతులసత్యత్వమును దెలిసికొనఁజాలక తెనుంగువా రాయా దేశములలో గందరగోళముగా బీభత్సరసములతో నొప్పుగాథలనే త్రవ్వుకొనుచు వ్యవహరించుకొనుచుండఁగా వారికి వ్యాసమునిప్రణీతభారతములోని పరమార్థమును స్పష్టపఱిచినట్టి యజ్ఞాసనకల్పులు నాద్యులు నగు నన్నయతిక్కనార్యులను స్మరించుచున్నా నని తెల్పుచున్నాఁడు. సంస్కృతమహాభారతమున నాగ్రంథమునకు మూఁడునామము లున్నట్లాగ్రంథమునందే కన్పట్టుచుండెను. మొదటినామము 'జయ' మనియు, రెండవనామము 'భారత' మనియు, మూఁడవనామము 'మహాభారత' మనియు వ్యవహరింపఁబడుచున్నవి. భారతయుద్ధానంతరము వ్యాసుఁడు పాండవవిజయమును సూచింపుచు "జయ" మనుపేరిట వ్రాసిన యితిహాసకావ్యమే మూలగ్రంథముగా నెంచుట యుక్తిసంగతముగాఁ గానంబడుచున్నది. ఇందు ౮ వేల ౮ వందల శ్లోకములుమాత్రము కల వనియు, నివియే వ్యాసమునిప్రణీతము లైయుండు ననియుఁ గొందఱువిమర్శకులు తలంచుచున్నారు.

"శ్లో. అష్టౌశ్లోక సహస్రాణి
అష్టౌశ్లోక శతానిచ
అహంవేద్మి శుకోవేత్తి
సంజయోవేత్తి వానవ॥"

కొంద ఱీసంఖ్య నొప్పుకొనకున్నను, వీనిని ౨౪౦౦౦ శ్లోకములవఱకుఁ బెంచి వైశంపాయనుఁడు "భారత" మని పేరిడినదానినెల్ల వా రంగీకరించుచున్నారు. అటుపిమ్మటఁ గొంతకాలమునకు "సౌతి" యను నాతఁడు లక్షగ్రంథముగఁ జేసి "మహాభారత" మని పేరుంచినట్లు కన్పడుచున్నది. ఇప్పు డీమహాభారతమే వేర్వేఱురాష్ట్రములయందు వేర్వేఱుపాఠాంతరభేదములతో నొప్పియున్నది. (మూలగ్రంథము యొక్కస్థితి యిట్లుండఁగా నన్నయతిక్కనార్యులకాలమున నెట్లుం

డెనో యూహింప సాధ్య మగునా ? కనుకనే నన్నయతిక్కనార్యులు వ్యాసమునిప్రణీతపరమార్థమును స్పష్టపఱిచినవా రని యెఱ్ఱనార్యుఁడు మనకుఁ దెలుపుచున్నాఁడు. కావున నన్నయతిక్కనాదులు మూలగ్రంథమును ముట్టలే దనికాని, మక్కికిమక్కిగాఁ దెనిఁగింపలే దనికాని యధిక్షేపించుటకు నెవ్వరికిని హక్కు లేదు. ఇట్లగుటచేతనే యీకాలమునందు సంస్కృతమహాభారతము పాఠాంతరభేదములతో సంపూర్తిగా ముద్రించుటకై పూనానగరమునందలి "భాండార్కరుఇన్స్టిట్యూటు" అను పేరిటిసమితివారు వివిధరాష్ట్రములనుండి ప్రచారమునందున్నప్రతులనుమాత్రమె కాక యముద్రితములై పడియున్న భిన్నభిన్నములై వివిధపాఠాంతరములతోఁ గూడుకొనియున్నప్రతులను పెక్కింటిని సంపాదించి పాఠాంతరభేదములతో ముద్రించుటకై సంకల్పించి యిప్పటికి విరాటపర్వమునుమాత్రము ముద్రింపఁగలిగిరి. ఇట్లుండినసందర్భములో మూలమును మక్కికిమక్కిగాఁ దెలిఁగింపఁబూనిన కవి యేపాఠమును సరియైన దని విశ్వసింప సాధ్యమగును ? ఇట్లుండినపుడు కవియగువాఁ డేమార్గము తనకు సరియైన దని విశ్వసించునో యట్టిస్వతంత్రమార్గమునే యనుసరించి పోవుట సంభవించును గాని యన్నిమార్గముల ననుసరించి పోవుట యసంభవముగా నుండును గదా ! ఎప్పటివారిమాటయో మన కేల ? ఇప్పటివిమర్శకాగ్రేసరుల దృక్పథము లన్నియు నొక్కరీతిగా నున్న వని యెవ్వరైనఁ జెప్పఁగలరా ? సంస్కృతమహాభారత మంతయు వ్యాసమునిప్రణీతము కాదని యామహాగ్రంథమే తెలుపుచుండుటచేత, నిప్పటివిమర్శకాగ్రేసరు, లగు పెక్కండ్రదృక్పథములలో నట్లే నిర్ధారింపఁబడియుండుటచేతఁ నాదిపర్వమునందును నంత్యపర్వమునందును "జయోనామేతిహాసోయమ్" అనఁగా మూలగ్రంథ మితిహాసమైయున్న దని చెప్పఁబడియుండుటచేత, నయ్యాది మహాభారతమునం దంతర్గర్భిత మైయుండుట

చేతను, ప్రపంచములో వేఱ్వేఱుదృక్పథములు వ్యాపించుటకు నవకాశము గలుగుచున్నది. ఇట్లుండునప్పు డొకరిదృక్పథము ఘనమైన దనియు, మఱియొకరిదృక్పథము హీనమైన దనియు వాదులాడుట వివేక మనిపించుకొనదు. ఈనాఁటివిమర్శకాగ్రేసరులలో నొక రగు నామిత్రులు బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రులుగారు "ధర్మప్రధాన మగుభారతామ్నాయమును రసప్రధాన మగుభారతప్రబంధముగా మార్చి తిక్కనసోమయాజి మహాభారతమును జాలహీనస్థితిలోనికిఁ దెచ్చుట సత్య మగు" నని యాంధ్రసాహిత్యపరిషత్పత్రికయొక్క రజతోత్సవసంపుటమునఁ బ్రకటింపఁబడిన "తిక్కనార్యకృతవిరాటపర్వవిమర్శనము" నందు వ్రాయుట వారివిమర్శనములోని సంకుచితభావమునే వెల్లడించుచుండె ననుట స్పష్ట మగుచున్నది. మఱియు వీరు ధర్మప్రధాన మగుభారతామ్నాయమును రసప్రధాన మగుకావ్యముగా మార్చుట, "అతిపవిత్ర మగుదేవాలయమును వినోదదాయక మగుగృహస్థాలయముగా మార్చుటవంటిదే యగు" నని చెప్పుట యతిసాహసమును సత్యవిరుద్ధము నగుమాట కాని మఱియొండు కాదని స్పష్టముగా ననువఁదగును. తిక్కనార్యుఁడుగూడ నీక్రిందిపద్యములో భారతమును బంచమవేద మనియు ధర్మమూల మనియు లిఖించి యున్నాఁడని,

"శా. విద్వత్సంస్తవనీయభవ్యకవితావేషుండు విజ్ఞానసం
పద్విఖ్యాతుఁడు సంయమిప్రకరసంభావ్యానుభావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థిలోకహితనిష్ఠం బూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్య మగు లేఖ్యం బైనయామ్నాయమున్.

క. వేదములకు నఖిలస్మృతి
వాదములకు బహుపురాణవర్గంబులకున్
వా దైనచోటులను దా
మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్."

అనుపద్యములనుదాహరించి, "యిట్టిదానిని గావ్యకళాదృష్టితో విరచించుట యన, దానిఘనతను దీసివేయుట గాదె?" యని యడుగుచున్నారు.

పైపద్యములలోఁ దిక్కనసోమయాజి భారతసంహిత ధర్మార్థకామమోక్షములకు మూల మని చెప్పియున్నాఁడే కాని యీయపూర్వవిమర్శకాగ్రేసరులు తలంచినట్లుగాఁ గేవలము ధర్మమూల మని చెప్పియుండ లేదు. తిక్కనార్యుఁడు "భారతాఖ్య మగు లేఖ్యం బైన యామ్నాయ" మనిమాత్రమె పల్కుచున్నాఁడు గాని "మహాభారతాఖ్య మగు లేఖ్యం బైనయామ్నాయ" మనుచుండ లేదు. ఈపద్యములు విరాటపర్వమునకు మొదట తిక్కన రచించియున్నాఁడు. పదునేనుపర్వములు రచించినతరువాతఁ దుదిభాగమున ఫలశ్రుతిలో:—

"ఉ. భ్రాజితవృత్తిమైఁ బరఁగు భారతసంహిత, సంయమీంద్రులా
రా, జయనామకంబునను రాజితసంగి జగత్త్రయంబునం
బూజితకీర్తియై నెగడు; భూరిజయోన్నతిఁ గంద్రు దీనిచే
రాజు, లిలాసురుల్, మఱి యరాతుల గెల్తురు విన్నయంతటన్."

అనుపద్యమునుగూడ లిఖించియున్నాఁడు. దీనిలో వ్యాసమునిప్రణీత మగు జయనామకకావ్యమునే, యాయితిహాసమునే, భారతసంహితనుగా భావించుచున్నట్లు దెల్పుచున్నాఁడు. వ్యాసప్రణీత మగు జయనామకకావ్య మనం బరఁగినభారతసంహిత కేవలము ధర్మమోక్షములమాత్రమె కాక యర్థకామములకుఁగూడ నుపకరించునట్టి దని పైపద్యమునుబట్టి బోధపడుచుండ లేదా? ఈప్రఖ్యాతమైన విజయనామకభారతేతిహాసమును విన్నమాత్రముచేతనే రాజులును భూసురులును గొప్పదైన విజయముయొక్క యున్నతిని బొందుదు రనియు, మఱియు శత్రువులనుగూడ గెల్తు రనియుఁ జెప్పుచున్నాఁడు. అర్థకామములయందుఁ గోరికయే లేకుండినయెడల గొప్పవిజయముయొక్క

యున్నతిని బొందుటయు, శత్రువులను జయించుటయు నెందుకొఱకు? మఱియుఁ దిక్కనసోమయాజి వ్యాసుని వర్ణించునపుడు మొదటిపద్యములో విజ్ఞానసంపద్విఖ్యాతుఁ డనియుమాత్రమె కాక "విద్వత్సంస్తవనీయభవ్యకవితావేశుం" డనికూడ వర్ణించియున్నాఁడే? ఇట్టివానికిఁ గావ్యకళాదృష్టి లేదని బ్రహ్మయ్యశాస్త్రిగారు చెప్పఁగలరా? కొందఱు తలంచునట్లు వ్యాసుఁడు శుష్క[illegible]దసుఁడు గాఁడు.

"భారతదృక్పథములఁగూర్చి నన్నపార్యుఁడు వ్యాసాశయముల ననుసరించి యిట్లు వ్రాసినాఁ" డని యుదాహరించిన

"సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు,
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని
కవివృషభులు మహాకావ్య మనియు,
లాక్షణికులు సర్వలక్షణం బనియును
నైతిహాసికు లితిహాస మనియుఁ,
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యం బని మహిఁ గొనియాడుచుండ."

అనుపద్యములోఁ "గవివృషభులు మహాకావ్య" మని కొనియాడుచుందు రనియుఁ జెప్పియున్నాఁడు గదా? రసప్రధానమైనదానిఁగా వ్యాసుఁడు భారతమును రచించుటచేతనే కదా యయ్యది కవిశ్రేష్ఠుల చేత మహాకావ్యముగాఁ గొనియాడఁబడుచుండుట సంభవించుచున్నది! రసప్రధానమైనది కాకుండినయెడల మహాకావ్య మనిపించుకొనుట యెట్లు? ధర్మప్రధాన మగుభారతామ్నాయమును రసప్రధాన మగు భారతప్రబంధముగాఁ జేయుట మహాభారతమును జాల హీనస్థితి లోనికిఁ దెచ్చుటయే యగునేని వ్యాసుఁడే నిందార్హుఁ డగును గాని తిక్కనసోమయాజి కాఁ డని విమర్శకాగ్రేసరులు తెలిసికోవలసి యుండును. కాని యిందు వ్యాసునితప్పు గాని తిక్కనసోమయాజితప్పు

గాని కానరా దని నాయభిప్రాయము. ఈదోషమంతయు విమర్శకా గ్రేసరులదృక్పథములోనే యున్నది.

నన్నయభట్టారకుఁడు తనపద్యములో నుదాహరించిన దృక్పథములన్నిటిని దనమనంబునం దిమిడ్చికొనియే, తిక్కనసోమయాజి భారతమును దెలిఁగించినాఁడు. కాని బ్రహ్మయ్యశాస్త్రులవారు తలంచినట్లు కేవలము కావ్యకళాదృష్టనే ప్రధానము చేసికొని ధర్మాదుల నంతగాఁ బాటింపక గ్రంథము వ్రాసినాఁడని యధిక్షేపించుట యెంత మాత్రమును దగియుండ నేరదు. "తిక్కనార్యుఁడు తాను గావ్యకళాదృష్టితో వ్రాసితి నని యెచ్చటను జెప్పలేదు, కాని" యని తాము వ్రాయుచు "నాతనిభాషాంతరీకరణగుమనికం గనఁ దనకావ్యకళాచాతురిని జూపుటకై తీసికొనినశ్రమను ధర్మాదివివరణములకై తీసికొనలే దని బోధలోనికి వచ్చు" ననిరి. తిక్కనసోమయాజి విరచించిన శాంత్యానుశాసనికపర్వములను విమర్శనాదృష్టి కలిగి నిష్పక్షపాతబుద్ధితోఁ బఠించినవా రెవ్వరును బ్రహ్మయ్యశాస్త్రిగారియభిప్రాయముతో నెంతమాత్రము నేకీభవింపఁజాలరు. "పంచమవేదమనఁ బ్రాణభూత మైనభగవద్గీత నే యాతఁడు ముట్టలే" దని వ్రాయుట సత్యదూర మగువిషయము. కీర్తిశేషులైన శతఘంటము వేంకటరంగశాస్త్రిగారు తాము వ్రాసిన విమర్శనపీఠికలోనిదాని నీదిగువ నుదాహరించుచున్నాఁడను.

"భగవద్గీతల నతఁడు తెనుఁగు సేయక యుపేక్షించె నని జనప్రతీతి కలదు గాని యది యట్లుకాదు. దానింగూడ సంగ్రహముగఁ దెనుఁగుఁ జేసియున్నాఁడు."

"శ్లో॥ ధర్మక్షేత్రే కురుక్షేత్రే, సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ, కిమ కుర్వత సంజయ."

అను భగవద్గీతాప్రథమశ్లోకమును,

కాని సంస్కృతభారత మొక్క యద్వైతదృష్టితోడనే రచియింపఁబడిన దనుటయు న్యాయ్యము కాదు. సంస్కృతభారతము వివిధతత్త్వార్థబోధక మైనదిగాఁ గన్పట్టుచున్నది కాని కేవల మొక్క యద్వైతదృష్టితోనే రచింపఁబడినట్లు గానరాదు. మూలగ్రంథ మెట్టిమతదృక్పథము ననుసరించి వ్రాయఁబడినదో తిక్కనభారతము గూడ నట్టిదృక్పథముతోనే వ్రాయఁబడిన దని విజ్ఞులయభిప్రాయ మైయున్నది. ద్వైతాద్వైతవిశిష్టాద్వైతవివిధతత్త్వసూచకము లగు మతబోధనలును, కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగములను గూర్చినబోధనములును, సంస్కృతభారతమునందువలెనే తిక్కనవిరచితభారతమునందును నాయాసందర్భములలో సముచితరీతిని సంధానింపఁబడినవై యున్నవి. ఇయ్యవి తిక్కనవిరచితశాంతిపర్వము నామూలాగ్రముగా సరళహృదయముతోఁ బఠించినవారికి బోధపడక మానవు. కేవలము రంధ్రాన్వేషణబుద్ధితోఁ బఠించువారిదృక్కులకుఁ గానుపింపకపోవచ్చును. అందుకై మన మచ్చెరువుపడవలసిన పని లేదు.

కావున బ్రహ్మయ్యశాస్త్రిగారు తిక్కనసోమయాజి కేవలము కావ్యకళాదృష్టినే ప్రధానము చేసికొని తనభారతమును విరచించినాఁ డని తలపోయనక్కఱలేదు. నన్నయభట్టారకుఁ డెన్నిదృక్పథములను వ్యాసాశయముల ననుసరించి సూచించియున్నాఁడో, యాదృక్పథముల నన్నిటిని విస్మరింపక మనస్సునం దుంచుకొనియే తిక్కన తన భారతమును రచించి కొన్నికొన్నిఘట్టములలో మూలముకంటెను మెఱుఁగులు వెట్టి మహాభారతప్రాశస్త్యమునకు వృద్ధిని సమకూర్చినాఁ డని విజ్ఞు లగువారియభిమతము కాని, మహాభారతమును హీనస్థితిలోనికిఁ దెచ్చినవాఁ డని చెప్పుట యెన్నఁటికిని వారియభిమత మై యుండ దనియె నాయభిప్రాయము.

మూఁడవ ప్రకరణము

తిక్కన కావ్యకళాదృష్టి

ధర్మప్రధాన మగుభారతామ్నాయమును రసప్రధాన మగు భారతప్రబంధముగా మార్చి తిక్కన మహాభారతమును హీనస్థితిలోనికిఁ దెచ్చె నని వ్రాసినవిమర్శకులే, "ఏమైననేమి? విరాటపర్వము ముఖ్యముగాఁ గావ్యకళాదృష్టితోనే వ్రాయఁబడిన దని చెప్పినఁ జెప్ప వచ్చును. ఏమన, నందుఁ బురుషార్థచతుష్టయములో నర్థకామములకే హెచ్చగుతావు కలదు గాని ధర్మమోక్షముల కంతగాఁ దావు లేదు" అనువాక్యములను వ్రాయుటవలననే తిక్కనకవితారచనము నందు దోష మావంతయు లేదనియు, నేయేకథాసందర్భముల యందుఁ దనకావ్యకళాచాతుర్యమును గనుపఱచుటకు నెక్కువగా నవకాశము గలదో యాసందర్భములలో నాయాతావులందుమాత్రమే తనకావ్యకళాచాతుర్యమును నెక్కువగాఁ జూపించినవాఁడు గాని యనవసరము లగుతావులయందుఁ జూపించియుండలే దనియుఁ, దిక్కనభారతమే వేయివిధములఁ జాటిచెప్పఁగల దని స్పష్ట మగుచున్నది. తిక్కనార్యుని కిది చాలఁ బ్రీతిపాత్రమైనపర్వ మనిరి. అగుఁగాక! దాన దోష మేమికలదు? కాని యీతనికి దీనియం దున్నమోహ మితర పర్వములందు లేదని చెప్పుట సాహస మనిపించుకొనును. అది యథార్థమును బోధించునదియుఁ గాదు. కనుకనే తాను దెనిఁగించు పదునేనుపర్వములనుగూర్చి మొదట ముచ్చటించునపుడు విరాటపర్వము మొదటి దగుటచేత నీక్రిందిపద్యమును జెప్పినవాఁడు. కాని యీయపూర్వవిమర్శకులు భావించినట్లుగా నీపర్వమును బ్రత్యేకముగా వర్ణించి యితరముల వర్ణింపక విడిచినాఁ డనుట సంభావ్యము గాదు. చూడుఁడు.

కాని సంస్కృతభారత మొక్కయద్వైతదృష్టితోడనే రచియింపఁబడిన దనుటయు న్యాయ్యము కాదు. సంస్కృతభారతము వివిధ తత్త్వార్థబోధక మైనదిగాఁ గన్పట్టుచున్నది కాని కేవల మొక్కయద్వైతదృష్టితోనే రచింపఁబడినట్టు గానరాదు. మూలగ్రంథ మెట్టిమతదృక్పథము ననుసరించి వ్రాయఁబడినదో తిక్కనభారతము గూడ నట్టిదృక్పథముతోనే వ్రాయఁబడిన దని విజ్ఞులయభిప్రాయ మైయున్నది. ద్వైతాద్వైతవిశిష్టాద్వైతవివిధతత్త్వసూచకము లగు మతబోధనలును, కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము లను గూర్చినబోధనములును, సంస్కృతభారతమునందువలెనే తిక్కనవిరచితభారతమునందును నాయాసందర్భములలో సముచితరీతిని సంధానింపఁబడియే యున్నవి. ఇయ్యవి తిక్కనవిరచితశాంతిపర్వము నామూలాగ్రముగా సరళహృదయముతోఁ బఠించినవారికి బోధపడక మానవు. కేవలము రంధ్రాన్వేషణబుద్ధితోఁ బఠించువారిదృక్కులకుఁ గానుపింపకపోవచ్చును. అందుకై మన మచ్చెరువుపడవలసిన పని లేదు.

కావున బ్రహ్మయ్యశాస్త్రిగారు తిక్కనసోమయాజి కేవలము కావ్యకళాదృష్టినే ప్రధానము చేసికొని తనభారతమును విరచించినాఁ డని తలపోయనక్కఱలేదు. నన్నయభట్టారకుఁ డెన్నిదృక్పథములను వ్యాసాశయముల ననుసరించి సూచించియున్నాఁడో, యాదృక్పథముల నన్నిటిని విస్మరింపక మనస్సునం దుంచుకొనియే తిక్కన తన భారతమును రచించి కొన్నికొన్నిఘట్టములలో మూలమునకంటెను మెఱుఁగులు వెట్టి మహాభారతముప్రాశస్త్యమునకు వృద్ధిని సమకూర్చినాఁ డని విజ్ఞు లగువారియభిమతము కాని, మహాభారతమును హీనస్థితిలోనికిఁ దెచ్చినవాఁ డని చెప్పుట యెన్నఁటికిని వారియభిమత మై యుండ దనియె నాయభిప్రాయము.

మూఁడవ ప్రకరణము

తిక్కన కావ్యకళాదృష్టి

ధర్మప్రధాన మగుభారతామ్నాయమును రసప్రధాన మగు భారతప్రబంధముగా మార్చి తిక్కన మహాభారతమును హీనస్థితిలోనికిఁ దెచ్చె నని వ్రాసినవిమర్శకులే, "ఏమైన నేమి? విరాటపర్వము ముఖ్యముగాఁ గావ్యకళాదృష్టితోనే వ్రాయఁబడిన దని చెప్పినఁ జెప్ప వచ్చును. ఏమన, నందుఁ బురుషార్థచతుష్టయములో నర్థకామములకే హెచ్చుగుతావు కలదు గాని ధర్మమోక్షముల కంతగాఁ దావు లేదు" అనువాక్యములను వ్రాయుటవలననే తిక్కనకవితారచనము నందు దోష మావంతయు లేదనియు, నేయేకథాసందర్భముల యందుఁ దనకావ్యకళాచాతుర్యమును గనుపఱచుటకు నెక్కువగా నవకాశము గలదో యాసందర్భములలో నాయాతావులందుమాత్రమే తనకావ్యకళాచాతుర్యమును నెక్కువగాఁ జూపించినవాఁడు గాని యనవసరము లగుతావులయందుఁ జూపించియుండలే దనియుఁ, దిక్కనభారతమే వేయివిధములఁ జాటిచెప్పఁగల దని స్పష్ట మగుచున్నది. తిక్కనార్యుని కిది చాలఁ బ్రీతిపాత్రమైనపర్వ మనిరి. అగుఁగాక! దాన దోష మేమికలదు? కాని యాతనికి దీనియం దున్నమో యితర పర్వములందు లేదని చెప్పు టతిసాహస మనిపించుకొనును. అది యథార్థమును బోధించునదియుఁ గాదు. కనుకనే తాను దెనిఁగించు పదునేనుపర్వములనుగూర్చి మొదట ముచ్చటించునపుడు విరాటపర్వము మొదటి దగుటచేత నీక్రిందిపద్యమును జెప్పినవాఁడు. కాని యీయపూర్వవిమర్శకులు భావించినట్లుగా నీపర్వమును బ్రత్యేకముగా వర్ణించి యితరముల వర్ణింపక విడిచినాఁ డనుట సంభావ్యము గాదు. చూడుఁడు.

"మ. హృదయాహ్లాదిచతుర్థ మూర్జితకథోపేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట నుద్యోగాదులుం గూడఁగాఁ
బదునేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టంగ రచించు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్."

ఈ పై పద్యమును దిక్కనసోమయాజి యేసందర్భమును బురస్కరించుకొని చెప్పియున్నాఁడో ముందుగా మనము గ్రహింపవలసి యుండును. తనభారతపీఠికభాగమునందు భారతకృతినిర్మాణప్రస్తావనలోఁ జెప్పినపద్య మిది. విద్వత్సంస్తవనీయభవ్యకవితావేశుండును, విజ్ఞానసంపద్విఖ్యాతుఁడును, సంయమిప్రకరసంభావ్యానుభావుండు నగు కృష్ణద్వైపాయనుఁడు లోకహితనిష్ఠను బూని ధర్మార్థకామమోక్షస్థితికి మూలమైనభారత మనువేదమును ధర్మాద్వైతస్థితి రచించినాఁ డని ముందుగ వక్కాణించి యటుపిమ్మట,

"ఉ. ఆదరణీయపారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృతమై పెనుపొందియుండ నం
దాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్."

అనుపద్యమును వ్రాసియున్నాఁడు. అనఁగా వ్యాసకృతమూలభారతము వివిధార్థస్ఫురణము గలిగి పదునెన్మిదిపర్వములతోఁ గూడుకొన్నదై యతిశయించి యాదరణీయ మైయుండఁగా నందు మొదటి మూఁడుపర్వముల నాంధ్రకవిత్వవిశారదుండును, విద్యాదయితుండును, మహాత్ముఁడు నగునన్నయభట్టు దక్షతతో రచించినాఁ డని చెప్పుచు నటుపిమ్మటనే పైపద్యమును జెప్పియున్నాఁడు. మూఁడుపర్వములు నన్నయభట్టు రచింపఁగాఁ దక్కినపదునేనుపర్వములను దాను రచించితి నని తెలుపుటకొఱ కాపద్యమును జెప్పెనే కాని విరాటపర్వమును బ్రత్యేకముగా వర్ణించి తక్కినపర్వములను వర్ణింపక విడుచుటకొఱకుఁ గా దని యాసందర్భమే విస్పష్టపఱుచుచుండఁగా నీయపూర్వవిమర్శ

కుఁడు విపరీతభావమును బ్రదర్శించుటకుఁ గడంగుట పరిహాసాస్పద మైనవిషయముగా నున్నది.

తిక్కనకు విరాటపర్వము ప్రీతికర మగుటచేత దానిమాత్రమే ప్రత్యేకముగా వర్ణించి తక్కినపర్వము లంతగాఁ బ్రీతికరములు కాక పోవుటచేత వానిని వర్ణింపక విడిచినాఁ డని చెప్పుచు నీవిమర్శకులసంకుచితస్వభావమునే వెల్లడించుచున్నారు. కాని [illegible] విషయమును చేటుపఱుపఁజాలదు. తిక్కన [illegible] ప్రతిపర్వమును దనపీఠికలో వర్ణించుటకుఁ బూనుకొనియుండెనే? [illegible] నియుదంతమే విస్పష్టపఱుచుచున్నది.

"ఈవిరాటపర్వము కథాచమత్కారము గలదియు, రససమంచిత మగునదియు, హృదయాహ్లాదకర మగునదియు నని నుడివినాఁడు గనుకను, దీనిని శృంగారాదివర్ణనలతో విశేషముగాఁ బెంచినవాఁడు గనుకను నీతనికావ్యకళాచాతుర్యము దెలిసికొనుటకు నీపర్వవిమర్శనము బెట్టుకొనుట యుచితమే" యని తమ [illegible] తలపోసికొనుచుఁ గుత్సితవిమర్శమునకు దొరకొని "మననవవిమర్శకులు కవికులసార్వభౌముఁ డగుతిక్కనార్యునికవితారహస్యమును బాగుగ గ్రహించుకొనఁజాలక తమయభినవకళాచాతురిచే నాతని నిలువఁబెట్టవలసి యున్నట్లు భావించి తమమెదడుఁ గ్రొత్తగాఁ బ్రవేశించి వికారములఁ బుట్టించుచున్న పాశ్చాత్యకవితావిశేషాభాసములనే సోమయాజియను ప్రధానముగాఁ జేసికొని కావ్యకళను బెంపుచేసె నని తెల్పుచు నందులకు వ్యర్థస్తవములఁ జేయ మొదలిడిరి. వీరియపమార్గము తిక్కయజ్వమార్గమున కెంతదూరముగా నున్నదో ముందుముందుఁ జూపవలసి యున్నది." అని యొకవింతభావమును విమర్శకుముందుఁ దెలుప మొదలుపెట్టిరి. తిక్కన యుభయకవిమిత్రుఁడ ననియు, బుధారాధనవిహారి ననియుఁ జెప్పుకొనియున్నాఁడే కాని తా నెన్నఁడును నెచ్చో

టనుగూడఁ గవిసార్వభౌముఁడ నని చెప్పుకొనియుండలేదు. నే నెఱింగి నంతవఱకుఁ దిక్కనకాలము మొదలుకొని నేఁటికాలమువఱకును గల కవు లెవ్వరును నట్టిబిరుదముతోఁ బేర్కొనియుండలేదు. ఆంధ్రకవి ప్రపంచమునఁ బ్రాచీనమహాకవు లెల్లరును నత్యున్నతస్థాన మగు బ్రహ్మపదమున నాతని నధిష్ఠింపఁజేసి సప్తశతసంవత్సరములనుండి పూజించుచున్నారు. భారతకవిత్రయమువారిలోఁ గడపటివాఁడై ప్రబంధపరమేశ్వరుఁ డనుబిరుదాభిధానము గల యెఱ్ఱాప్రెగ్గడ తన హరివంశములో,

"మ. తనకావించినసృష్టి తక్కొకలచేతం గాదు నా నేర్చుఖం
బునఁ దాఁ బల్కినఁ బల్కు లాగమము లై పొల్పొందు నావాణి న
త్తను నీతం డొకరుండ నాఁ జను మహత్త్వంబుం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్."

అనియుఁ గవిసార్వభౌముఁడైనశ్రీనాథకవి తనభీమేశ్వరపురాణములో,

"ఉ. పంచమవేద మై పరఁగుభారతసంహిత నాంధ్రభాషఁ గా
వించెఁ బదేనుపర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యున కఖండితభక్తి నమస్కరింతు ని
ర్వంచితకీర్తికై భవవిరాజికిఁ దిక్కనసోమయాజికిన్."

అని పొగడినపొగడ్తలనే దృష్టాంతములుగాఁ జూపవచ్చును.

ఇమ్మహానీయుని నట్టిబ్రహ్మపదస్థానమునుండి భ్రష్టుని గావించి కూలఁద్రోయుటకు నెట్టిశక్తియుక్తులను బ్రయోగించినను నెట్టికలియుగబ్రహ్మలకైనను సాధ్యము కా దనువిషయము కవితావాసనం గలబాలురును బాలికలునుగూడ నెఱుంగునదే. అందునుగూర్చి నవవిమర్శకులు గాని ప్రాఁతవిమర్శకులు గాని ప్రస్తావింపఁ బనిలేదు.

మామిత్రులు బ్రహ్మయ్యశాస్త్రులుగారు "సంస్కృతగ్రంథముకంటెఁ గొన్నితావులఁ దిక్కనార్యునిగ్రంథము మెఱుఁగుగా నున్న

దనిన ననవచ్చు'' నని వ్రాయుచున్నారు. సంస్కృతభారతముకంటెం దిక్కనభారత మేతావులందుఁ బ్రకాశవంతముగ నున్నదో యాతావులనుగూడఁ దమవిమర్శనమునఁ బాఠకులకుఁ జూపుటకై శ్రద్ధను బూని ప్రయత్నింపరు గాని రంధ్రాన్వేషణముఁ జేయుచు దోషములను జూపుటకై పుండ్లపై పునకుఁ బర్వెడునీఁగవలెనే పర్వెడుచుందురు. ఇదియే వీరివిమర్శనలందుఁ గానుపించు గొప్పలోపము. అదియేమి చిత్రమో కాని యీయపూర్వవిమర్శకాగ్రేసరులకు నన్నయభట్టారకునియెడఁ గలగౌరవమాత్రమయినను దిక్కనసోమయాజియెడఁ గన్పట్టదు. మొదలనుండియు నొకవిధ మైనయుపేక్షాభావమే చూపుచుందురు.

''తిక్కన యెక్కు వవాఁడే. అయినను నక్కడక్కడఁ బ్రమాదములకు లోనగుచువచ్చినాఁడు. అది కనిపెట్టక యిదివఱకు మననవవిమర్శకులు తిక్కనయందుఁ గలిగినగ్రుడ్డివ్యామోహముచే దోషములనుగూడ గుణములుగానే స్తుతించివేసిరి. అదియే కూడనిపని. అదియే సారస్వతమునకు హానిని గలిగించునది. కానఁ, దిక్కనార్యుని దోషములను దోషము లనియు, గుణములను గుణము లనియు సందర్భానుకూలముగా నిరూపించుచు నిష్పాక్షికవిమర్శనమును లోకహితార్థమై యిప్పుడు కావించుకొందము.

గుణవత్తర మనియు దోషరహిత మనియు నిదివఱకుఁ బ్రజలందఱిచేతను గొనియాడఁబడుచున్నది తిక్కనభారతము. అట్టిలోకాతీత మైనప్రఖ్యాతి గల తిక్కసార్వభౌమునివిరాటపర్వమున దోషములఁగూడ నెంచుటయా యని యాగ్రహమును వహింపకుఁడు. అట్లు చేయుట తగదు. ప్రమాదములు ధీమంతులకయిన నుండవచ్చును గదా. లోకసామాన్యదృష్టికి మనోహరజలపూరితముగాఁ గాన్పించుచున్నతటాకోదకము పారిశుద్ధ్యవిచారకపరీక్షలోఁ బెట్టిచూచినఁ

గొంతదోషయుతముగాఁ గాన్పింపవచ్చును. అయినను లోకము మెచ్చుచున్న దనుకారణమునఁ గారిశుద్ధ్యవిమర్శకాభిప్రాయమును ద్రోసివేయరాదు. అట్లుద్రోసివేయుట హానికి మూల మగును. అట్లే నిక్కమైనకావ్యకళాదృష్టితోఁ బరిశీలించిచూచిన దోషాదికములేవైనఁ గాన్పించిన వానిఁ ద్రోసివేయుట సారస్వతమునకు హానికర మగును. కాఁబట్టి మానసవవిమర్శకులు కావ్యకళాదృష్టితోఁ గావించిన విరాటపర్వవిమర్శన మెంతపటుత్వము గలదిగా నున్నదో కావ్యకళాదృష్టితోఁ బరిశీలించిచూచుకొందము. చదువరులు శాంతచిత్తములతోఁ జిత్తగింతురుగాక !"

అని తిక్కనార్యకృతవిరాటపర్వవిమర్శనమును బ్రారంభించుటకుముందు విమర్శకులు వ్రాసిన చమత్కారముగలపీఠిక యిది. ఇందు వీరు "తిక్కనయందుఁ గలిగినగ్రుడ్డివ్యామోహముచే" నని యొకచోటను, "లోకాతీతమైనప్రఖ్యాతిఁ గలతిక్కకవి" యని యొకచోటను బిరుసుదనమును జూపుచు రెండువిసురులు విసరియుండుటచేత లోకహితార్థము చేయఁబోవు నిష్పాక్షికవిమర్శన మేరీతిగ నుండునో వానిజాడలనీడలను ముందుగానే పాఠకులదృష్టికి గోచరింపఁ జేసి, వారివిమర్శన మెంతపటుత్వముగలదో, వారివిజ్ఞప్తిలోని రచనాచమత్కారమువలననే గ్రహింప ననువగురీతిని సూచించినసూచనమును మన మెంతేని మెచ్చుకోఁ దగియున్నది. మఱియు నింకొకవిశేషమునుగూడఁ దోపింపఁ జేయుచున్నది.

మన కింతవఱకుఁ బ్రబంధపరమేశ్వరుని కావ్యకళాదృష్టికంటెను, గవిసార్వభౌముని కావ్యకళాదృష్టికంటెను, గవిబ్రహ్మగారి కావ్యకళాదృష్టి మిన్నందిన దని బోధపడినది. ఇప్పుడో యీయపూర్వవిమర్శకబ్రహ్మగారివిజ్ఞప్తివలనఁ గవిబ్రహ్మగారి కావ్యకళాదృష్టి నిక్కమైన

కావ్యకళాదృష్టి గాక కృత్రిమమైనదిగా హీనమైనదిగాఁ 'తిక్కనవిర చితవిరాటపర్వవిమర్శనము'వలననే తెలియఁగల దని బోధపడు చున్నది.

ఇంతియగాక, యిదివఱకే గుణవత్తర మనియు దోషరహిత మనియుఁ బ్రజలందఱిచేతను గొనియాడఁబడుచున్న తిక్కనభారతము పట్లను, లోకాతీత మైనప్రఖ్యాతిని బొందిన తిక్కనకవిపట్లను, లోకము నంతట వ్యాపించియుండిన గ్రుడ్డివ్యామోహమును, లోకహితము కొఱకు వీరు ప్రారంభించిన నిష్పాక్షికవిమర్శనమే తొలఁగించి తిక్కన కావ్యకళాదృష్టియొక్క సహజస్వరూపమును బ్రదర్శింపఁగల దనికూడ బోధపడుచున్నది. కావున నిట్టిమహాకార్యమునకు నేటికెదురీద సంకోం చునట్లుగా సాహసించుచున్నారము గాన నెవ్వరును నాగ్రహింపవల సినపని లేదని, చదువరులు శాంతచిత్తములతోఁ జిత్తగింపవలె నని విమర్శకుల ప్రార్థన మైయున్నది. ఇట్టివిమర్శకు లెందఱు దేశమున బయల్వెడలి యిట్టివిమర్శనలను గావించి తిక్కనకావ్యకళ నగ్ని పరీక్ష కెంత గుఱిగావించినను, బుటము వెట్టిన మేల్మిబంగారువలెనే ప్రకాశింపఁగల దని యందఱకును దృఢవిశ్వాసము నిండుకొనియున్నది.

పాండవులు తమ దుర్ఘటమైన యజ్ఞాతవాసదీక్షను నడపినవిధా నము భారతములోని పదునెన్మిదిపర్వములలో, నేపర్వమున వర్ణింపఁ బడియెనో, యాపర్వమునకే విరాటపర్వ మనుపేరు పెట్టఁబడినది. తమయజ్ఞాతవాసదీక్షను గడపుట కనువయిన దేశము మత్స్యదేశము నగా నిర్ణయించుకొని యాదేశమునకుఁ బ్రభు వయిన విరాటరాజు కొల్వుకూటమునఁ బ్రచ్ఛన్నవేషములతో నాతని సేవింపుచు, నాతని రాజధానీనగర మగు నుపప్లావ్య మనువిరాటనగరంబున నొకసంవత్సర కాలము పాండవులు గడపుట సంభవించినది కావున నద్దానినంతయు

వర్ణించుపర్వమునకు విరాటపర్వ మని నామకరణముఁ జేయుట సమంజసముగానే కన్పట్టుచున్నది.

పాండవుల విరాటసభాప్రవేశము.

"తిక్కనార్యుఁడు పాండవుల విరాటనగరప్రవేశము నెట్లు సమర్థించుకొనివచ్చెనో దానిని ముందుగా మనము కనుఁగొనవలసి యున్నది. ఈసందర్భములో సోమయాజి పాండవులయజ్ఞాతవాసమును సురక్షితము చేయలేకపోయె నని చెప్పితీరవలసివచ్చుచున్నది. ఏమన, నీతఁడు పాండవులు విరటునింట జ్యేష్ఠానుక్రమముగా, ననఁగా ధర్మజుని తరువాత భీముఁడు, భీమునియనంతరమున నర్జునుఁడును, నటుపిమ్మట నకులుఁడును, నంత సహదేవుఁడును, పిదపఁ బాంచాలియుఁ జొచ్చి నట్లు వర్ణించినాఁడు. ఇట్లు చెప్పుటచే వారిని బాండవు లని విరాటాదులు గుర్తుపట్టుట సులభ మగు నని మనవారు తలఁచుచున్నారు. కావుననే యుత్తరదేశమందలి భారతప్రతులలో వ్యుత్క్రమముగాఁ బాండవులు విరటునికొలువులోఁ బ్రవేశించినట్లుగాఁ జెప్పఁబడియున్నది. ఉత్తరదేశప్రతులే కాక, తిక్కనకవిత్వము ననుసరించిన వని తెలుపఁబడిన దక్షిణదేశప్రతులందుఁ దక్కఁ, దక్కినభారతప్రతు లన్నిటియందును బాండవులు వ్యుత్క్రమముగానే విరటునికొలువు సొచ్చినట్లు చెప్పఁబడినది.............ఈప్రకారముగాఁ బ్రమాణముగాఁ దీసికొనఁదగిన సంస్కృతప్రతు లన్నిటియందును బాండవులవిరాటసభాప్రవేశమును గ్రమము తప్పించి వ్యుత్క్రమముగాఁ జెప్పియుండఁగాఁ దిక్కనార్యుఁడుమాత్రము జ్యేష్ఠానుక్రమప్రవేశమును వర్ణించుటలో విశేష మేమియుండఁగలదు? పరికించిచూడ వ్యుత్క్రమప్రవేశము నందే విశేషము గాన్పించుచున్నది. జ్యేష్ఠానుక్రమప్రవేశములో వీరు పాండవు లని తెలిసికొనుటకు నవకాశము గల దనియు, వ్యుత్క్రమ

ప్రవేశములో నట్లు లేదు కాన నిందే విశేషము కల దనియు విమర్శ కులు చెప్పుచున్నారు. కనుఁడు.'' అని బ్రహ్మయ్యశాస్త్రిగారు పెద్ద యాక్షేపణము చేయుచున్నారు.

ఇది యంత పెద్దయాక్షేపణము కాదు. విరటునికొల్వునఁ బాండ వులను జ్యేష్ఠానుక్రమముగాఁ బ్రవేశపెట్టినను, వ్యుత్క్రమముగాఁ బ్రవేశపెట్టినను, నిట్టియాక్షేపణము రెండువిధములప్రవేశమునకును వర్తింపకమానదు. భారతప్రతులపాఠాంతరకథనభేదము లటుండనిచ్చి సంస్కృతప్రతు లన్నింటియందును నొక్క విధముననే వ్యుత్క్రమముగాఁ బ్రవేశపెట్టఁబడియుండె ననుప్రతిపక్షవాదము నంగీకరించినను, నీయాక్షే పణమున కవకాశము లేకపోలేదు. పాండవు లేవురును, వారిభార్య ద్రౌపదియు నొక్క దినముననే విరాటనగరమునఁ బ్రవేశించి, ధర్మజ భీమార్జుననకులసహదేవు లేవురు నొకరివెంబడినొకరు విరాటరాజు కొల్వునకును, నటుపిమ్మట ద్రౌపది విరాటరాజుపట్టపుదేవి యగు సుధేష్ణాదేవికొల్వునకును వచ్చియున్నట్లుగా సకలప్రతులయందును దెలుపఁబడియుండె ననుట వాస్తవ మనుటకు సందియము లేదుకదా!

కురుదేశమునకును మత్స్యదేశమునకును నడుమఁ జాలదూ రము కలదు. అందందు దుర్గమారణ్యప్రదేశములు ఘాతుకజంతుపరి వృతములై యుండునవి పెక్కులు కలవు. ప్రజల రాకపోకలకు సుల భము లగుదారులు కల వని విశ్వసించుటకు భారతములోనివర్ణనముల వలన సాధ్యపడునది కాదు. విరాటనగరమును బరిపాలించురాజు గాని, వానిపట్టపురాణి గాని, వానిమంత్రివర్గము గాని, వానిప్రజలు గాని, పాండవు లేవురను, ద్రౌపదిని బాగుగా నెఱింగినవా రని చెప్ప సరిపడదు. అచ్చటిసమాచారము లిచ్చటను, నిచ్చటిసమాచారము లచ్చటను దెలిసికొనుటకుఁ జారులను నియమించి వారిద్వారా తెలిసి కొనవలసియుండెను. ఆకాలమునం దట్లే జరుగుచుండెను. విరాట

రాజునకును పాండవులకు నంతకుఁబూర్వమున సంబంధబాంధవ్యము లున్నట్లు భారతమున నెందును జెప్పఁబడియుండలేదు. అందువలన విరాటరాజుగాని, సుధేష్ణాదేవిగాని, పాండవులనుగాని, ద్రౌపదినిగాని యెఱింగియున్నవా రని చెప్ప వలనుగాదు. పాండవజ్యేష్ఠుఁ డగు ధర్మరాజు కౌరవులపక్షమునఁ బ్రతినిధిగా నిలుపఁబడినశకునితోఁ జూద మాడుసందర్భమున, ఓడిపోయినవారు పండ్రెండేఁడు లరణ్యవాసమును నొకయేఁ డజ్ఞాతవాసమును జేయుటకుఁ, బందెము నొడ్డి యోడిపోవుటయు సంభవించెను. ఈవిషయము లన్నియుఁ జారులవలన మత్స్యదేశమునందలి ప్రజలును, ప్రభువులును వినియుండవచ్చును. అంతమాత్రముచేతఁ బాండవుల యరణ్యవాసవివరములు కాని, యజ్ఞాతవాసమునుగూర్చి వా రేర్పాటుచేసికొన్న పద్ధతులు కాని వారి కింతమాత్రముఁ దెలియు నని తలంపరాదు. ఇట్లుండఁగా, వరుస నైదుగురుపాండవులు జ్యేష్ఠానుక్రమముగను చివరకు ద్రౌపదియుఁ బ్రవేశించి రని చెప్పినచో, వీరు పాండవులు ద్రౌపదియు నని విరాటాదులు గుర్తుపట్టుట సంభవింపవచ్చును గాన, నట్లుగాక చివరఁ బ్రవేశించిన దని చెప్పఁబడినద్రౌపదిని ధర్మజభీములకుఁ దరువాతను బ్రవేశపెట్టినచో నట్లుగుర్తుపట్టుటకు సాధ్యపడ దని తిక్కన నధిక్షేపించిన వారివాదముగూడ నాక్షేపణార్హమును బరిహాసాస్పదముఁగూడ నగుచున్నది. ఏమనఁగా నొకరివెంబడి నొకరు వచ్చినవారైనను ద్రౌపది మాత్రము విరాటరాజుకొల్వునకు వచ్చియుండలేదు. ద్రౌపది సైరంధ్రీవేషముతో బయలుదేఱి విరాటనగరముఁ బ్రవేశించి,

"సీ. పలుమొయిల్ గప్పినఁ బాడఱి, నునుగాంతి
గదలిన యమృతాంశుకలయుఁబోలె,
పెనుమంచు వీఁదఁ బర్విన, వికాసము దప్పి
పొలుపు గుందినసరోజనివిధమున,

ధూమంబు వొదివినఁ దూఁగలిమెఱుఁగులు
నలఁగి మాసినదీపకళికపగిది,
ధూళి పైఁ బొరసినఁ గొంగలించుట మాని
లావణ్య మెడలినలతికభంగి,
తే. గంధకారికావేషంబుఁ గలన, మూర్తి
యుజ్జ్వలత్వంబు మాఱుపడి యుండఁ, గాంచి
తనయామహిషి యంచితగతిఁ జేరఁగ రాజ
వీథిఁ బౌరజనంబు నవ్వేఱఁగొంది చూచి."

అని తిక్కనసోమయాజి ద్రౌపదిని వర్ణించుచు రాజవీధిని జనుచుండె నని చెప్పినాఁడు. అంతఁ బౌరజనంబులు తమలోఁ దాము పలువిధంబులుగాఁ బ్రశంసించుచు నామెను జేరి,

"కం. నీ వెవ్వ, రేమిపనికై
యేవలనికిఁ బోవుచునికి యిది; నావుడు, న
ద్దేవియు సౌముఖ్యము సం
భావనముం దోఁప నుచితభంగిం జెప్పెన్.
ఆ. ఏను గట్టువాలుదాన నా కెవ్వరు
గడుపుకూడు వెట్టి కట్టఁ జీర
యిచ్చి సాకతమున నేలుదు రట్టివా
రలకుఁ బనులు చేసి మెలఁగుదాన."

అని ప్రశ్నించినవారికిఁ దగువిధమున సమాధానము చెప్పుచుఁ గనుంగొనుచు ముసరికొని చనుచుండ రాజమందిరంబుచక్కటికి నరుగునవసరంబునఁ దనరమ్యహర్మ్యముమీఁదినిలువునఁ బ్రణయసఖులతోడ విహారాస్పద మగునెలవున మెలఁగెడివిరటునిపట్టపుదేవి యగుసుదేష్ణ పాంచాలరాజనందనఁ గాంచి యామెను దనకడకు రప్పించుకొని కుశలప్రశ్నంబు లడుగుచు నామెవలనఁ బ్రత్యుత్తరములను బొంది యాదరబుద్ధితోఁ దనకొల్వునఁ దనసేవకై నిలుపుకొన్నట్లుగాఁ దెలుపఁబడినది.

పాండవు లేవురు ప్రచ్ఛన్నవేషములతో విరాటునికొల్వుకూటమునకుఁ బోయినవిధముగాని, యక్కడ వారలు కొలువున కమరిన

విధముగాని విరటునిపట్టపురాణి యగుసుధేష్ణకుఁగాని, యంతఃపురము లోని సతీజనంబులకుఁగాని తెలియరాదు. అట్లే విరాటరాజునకుఁ గాని, యాతనిమంత్రివర్గమునకుఁగాని, తదితరోద్యోగియులకుఁగాని మాలిని యనుపేరిట సైరంధ్రీవేషముతో ద్రౌపది సుధేష్ణసన్నిధాన మునకు వచ్చి యామెకొల్వు నమర్చుకొన్నవిషయము దెలియరాదు. ఇట్టిసందర్భములోఁ బాండవులను దిక్కనసోమయాజి జ్యేష్ఠానుక్రమ ముగాఁ బ్రవేశపెట్టినను, సంస్కృతప్రతులలోఁ గొన్నింటిలోవలె వ్యుత్క్రమముగాఁ బ్రవేశపెట్టినను, ఫలిత మొక్కటియే యగునుగాని భిన్నముగా నుండఁజాలదు. ద్రౌపది ధర్మజాదులతరువాత వచ్చిన దన్నను, పాండవు లేవురతరువాతను గడపట వచ్చినదన్నను విరుద్ధ ముగా నుండుభేద మేమియును గానుపింపదు. విరటునకును విరటుని కొల్వున నున్నవారికి నాదినమున ద్రౌపది గానుపింపనేలేదు. విరటుని రాణి యగుసుధేష్ణాదేవి కాదినమున ద్రౌపదిభర్త లేవురు విరటుని గొల్వవచ్చి రనువిషయము తెలియనే తెలియదు. కావున ద్రౌపది నెట్లుప్రవేశపెట్టినను పాండవు లెఱుకపడి చిక్కులు కలుగు ననుకొనుట కవకాశము లేదు. ఇంకను పాండవులేవురలోను భీమునితరువాత సహదేవుని, వానియనంతరమున నర్జునుని, పిదప నకులుని బ్రవేశ పెట్టుటవలన నద్దియొచమత్కారము గల దని యనుకొనుటకూడ వట్టిభ్రమయే యగును. అర్జునుఁడు పురుషస్వరూపమును గాక స్త్రీ స్వరూపమును గాక, యుభయస్వరూపచిహ్నములుం గల యొక వికారపుపేడిరూపము ధరించి వచ్చినవాఁడు. అతనిని దిక్కనసోమ యాజి నకులునికిముందు ప్రవేశపెట్టినను, కొన్నిప్రతులలోవలె సహ దేవునకు, నకులునకునడుమఁ బ్రవేశపెట్టినను నందుఁ జమత్కారము గాని విశేషముగాని యేమియుఁ గానరాదు. ఇట్టిపేడిస్వరూపుఁ డగు నర్జునుని దిక్కనవలె భీమునితరువాతఁ బ్రవేశపెట్టిన నర్జునుఁ డని

గుర్తుపట్టుటకు నవకాశ మిచ్చునేని, సహదేవునితరువాతఁ బ్రవేశపెట్టిన నట్టియవకాశ మీయకుండునా? ద్రౌపదీస్వయంవరమునకుఁ బోయిన విరాటరాజు, విప్రవేషముతో నుండి మత్స్యయంత్రమును గొట్టినప్పుడు వాని నర్జునునిగాఁ దెలిసికొనఁజాలకుండెను. అట్టివాఁడు తనయెట్ట యెదుట షండరూపమున నున్నవాని నర్జునునిగా గుర్తింపఁగలుగునా? అదెక్కడిమాట? భీమునకుఁ దరువాతఁ బ్రవేశపెట్టినను నకులసహదేవులకునడుమఁ బ్రవేశపెట్టినను నొక్క విధముగానే తోఁచును. వాస్తవముచేత సులువుగా గుర్తింపఁబడఁదగినవాఁడు వంటలవాని వేషముతో నున్నభీముఁడు. అట్టిభీముని నే గుర్తింపఁజాలనివారు వినికిడిమాత్రమున వీరిని పాండవులని గుర్తింపఁగలరా? దీనినిబట్టి మన కేమిబోధపడుచున్నది? విరాటరాజుగాని వానిమంత్రివర్గమువారుగాని పాండవుల నెఱింగియుండరనియు, వినికిడిమాత్రముచేతనే పాండవుల యరణ్యావాసాజ్ఞాతవాసముల చరిత్రమును మాత్రము వినియుండవచ్చుననియును. అంతమాత్రముచేత యథానుక్రమముగాఁ బ్రవేశపెట్టినను, వ్యుత్క్రమముగాఁ బ్రవేశపెట్టినను, వీరే పాండవులని గుర్తుపట్టుటకు నవకాశము చాలదు. సహదేవుని నడుమఁ బ్రవేశపెట్టినను, నకులునిఁ దుదను బ్రవేశపెట్టినను భేద మేమియును గానరాదు. నిజముగా విరాటాదులు పాండవులేవ్వరను గుర్తెఱింగినవారే యైనయెడల, నేక్రమము ననుసరించివచ్చినను నొక్కదినముననే, యేవురు నొకరివెంబడినొకరు, వచ్చినవారుగనుకను, నేవురును బ్రచ్ఛన్నవేషములతో వచ్చినవారుగనుకను, వారిని సులువుగాఁ బాండవులేవ్వరనుగా గుర్తింపవచ్చును. కాని, వారివారిస్వరూపాదులును స్థితిగతులు నంతగా వీరికిఁ దెలియరావని మనము దృఢముగా విశ్వసింపవలసియున్నది. కాని యీసందర్భమున బ్రహ్మయ్యగారు తిక్కనయెడ స్వవచనవ్యాఘాతదోషము నొకదానిఁ బ్రశంసించియున్నారు. అందునుగూర్చికూడ నొకింత ప్రత్యుత్తరముఁ జెప్పనగు.

“ఇవియున్నియు నిట్లుండఁగాఁ బాండవులు జ్యేష్ఠానుక్రమముగా విరటుఁ గొల్వ వచ్చిరనుటలో నొకదోషము కలదు. దానిని మన తిక్కమఖిగాని, మననవవిమర్శకులుగాని కనుఁగొనలేదు. ఏమన— నీక్రమము తిక్కనగారే వ్రాసినయుత్తరగ్రంథమునకు విరుద్ధముగా నున్నది. కీచకుని వధించుటనుగూర్చి ద్రౌపదీభీములు మాటలాడుకొనుటలో ద్రౌపది భీమునితో ‘మనముభయులము విరటునిఁ గొల్వనకు వచ్చినసమయ మొక్కటియే కావున సుధేష్ణాదులు మనకిద్దఱకును సంబంధ మున్నట్లు తలంచి’ రని చెప్పినది. తిక్కనపద్యముం గనుఁడు.

“కం. తలు[illegible]
దక్కఁ[illegible] గంటిరె వీ
రలు వచ్చినసమయంబున
దలఁ[illegible] సంబంధం[illegible].”

భీముఁడు, ద్రౌపది సమకాలమున వచ్చిన ట్లిచ్చటఁ జెప్పినతిక్కనార్యుఁడు మొదటఁ బాండవులు జ్యేష్ఠానుక్రమముగఁ బ్రవేశించిన ట్లేట్లు చెప్పెను? ఇది స్వవచనవ్యాఘాతదోషముతోఁ గూడుకొనినది కాదా? తప్పక యిది దోషమే. కానఁ దిక్కనవ్రాఁతనుబట్టియే పాండవులవిరటుకులప్రవేశము వ్యుత్క్రమముగ నున్న దని రూఢిపడుచున్నది.” అని విమర్శకులు వ్రాసిరి. ఇందుఁ దిక్కనగారిస్వవచనవ్యాఘాతదోషము నా కెంతమాత్రముఁ గానరాదు. “సుధేష్ణాదులును దత్పురిజనంబులును దమలోన నీకును నాకును సంబంధము కల దని లే దని పెక్కువిధంబుల నూహలు చేసి గుజగుజలు వోవుచుండుదు’ రని ద్రౌపది భీమునితో మొఱపెట్టుకొనుసందర్భమునఁ జెప్పినపద్య మిది. దీనినిబట్టి యియ్యది స్వవచనవ్యాఘాతదోష మని బ్రహ్మయ్యగారు తిక్కనగారి నెత్తిపైఁ బెట్టి యాతనిం గేలిసేయవలె నని సంకల్పించిరి కాని యింతమాత్రమున నాప్రతిభావంతుని కావ్యకళాదృష్టి కావంతయుఁ గళంకము కలుగఁబోదు. పాండవులెల్లరును ద్రౌపదియు

నొక్కదినంబుననే, యొక్క పూఁటనే వచ్చినవారు. "వచ్చినసమయంబును దలఁపఁగ నొక్కటియ" యని దెలుపునపుడు, సమయమనఁగాఁ, గాలము, లేక దిన, మని సామాన్యార్థము చెప్పుకొనవలయునే కాని, భీముని వెంట ద్రౌపదిగాని, ద్రౌపది వెంట భీముఁడుగాని, లేక యిరువురు జంటగఁగాని యొకసారియె వచ్చి రని యర్థము కాఁజాలదు. సంస్కృతప్రతులయందును నట్లు వ్రాయఁబడియుండలేదు. కీచకునిచేఁ బరిభవింపఁబడిన ద్రౌపది, సుధేష్ణయుఁ దత్పరిజనంబులును దమ్ముఁగూర్చియుఁ దమకుంగల సంబంధమునుగూర్చియు గుసగుసలువోవుచుఁ జెప్పుకొనుమాటలను దెలుపుచుఁ, దనపరిభవాతిశోకమునకుఁ గనలి యుద్రేకించినయెడలఁ, దమ్మునిరువుర భేదింతురు గాన 'నీకుఁ దోఁచినభంగి రహస్యభంగము గాకుండ శత్రుసంహారము చేయు' మని భీమునిఁ బ్రోత్సహించుచు నాతనితో ద్రౌపది తెలియఁ జెప్పుసందర్భమునఁ జెప్పినపద్య మది కావునఁ దిక్కనకు స్వవచనవ్యాఘాతదోషము పట్టిన దనుట దుర్భ్రమి కాని, యథార్థము గ్రహించినవారి కట్టిది కాదని విస్పష్టము కాఁగలదు. కాన "తిక్కనవ్రాఁతను బట్టియే పాండవులవిరటుకొలప్రవేశము వ్యత్క్రమముగానున్న దని రూఢిపడుచున్న" దనుట వట్టి నిరర్థకమైనదిగాఁ దలంపవలసియుండును. "తిక్కనార్యుఁడు వ్రాసిన యీవ్రాఁతంబట్టి ధర్మజుఁడు, భీముఁడు, ద్రౌపది ప్రవేశించినతర్వాత మిగిలినవారు ప్రవేశించినట్లు తేలుచున్నది. ఇదియే హాని లేనిపాఠము." అని వ్రాయుట తిక్కనయెడ నపరాధమును మోపుటకంటె మఱొండు కాఁజాలదు. ఇంకఁ బాండవులప్రవేశమును గూర్చినచర్చను ముగించి, వారు వేసికొన్న వేషములను గూర్చియుఁ జేసినప్రసంగములను గూర్చియుఁగూడ నొకింత చర్చింతముగాక.

నాల్గవ ప్రకరణము

తిక్కన కావ్యకళాదృష్టి

పాండవుల వేషభాషాదులవర్ణనము.

"ఉభయభాషాకవిమిత్రుని యుభయభాషాసంపూర్ణప్రవీణత పుస్తకమునం దెక్కడఁజూచినను విస్పష్టముగాఁ దెలియుచున్నది" అని మనవిమర్శకాగ్రేసరులు తిక్కనభాషవిషయమై నిష్కళంకాభిప్రాయమును వెలిబుచ్చుచున్నను దిక్కనసోమయాజి వెల్వరించినభావములనుగూర్చి చేసినవిమర్శనమాత్ర మొకింతవికటముగాఁ గన్పట్టుచుండును. పాండవుల వేషభాషాదులఁ గూర్చినవర్ణనములో నొక్కకంకభట్టువేషమును ధరించిన ధర్మజునిపాత్రమునుగుఱించిమాత్రము మన కాశీభట్టవారికిఁ బ్రశంసింపక తప్పినది కాదు.

"భీమార్జుననకులసహదేవులు విరాటునిపురములోఁ బ్రవేశింప వేసికొనిన వేషములు, నచటఁ గావించినప్రసంగములును బాగుగా నున్నవి. భీముని వంటలవాని వేషము, మాటలును జూడుఁడు! ఎంత యింపుగా నున్నవో! అర్జునుని వేషమును బ్రసంగమును బాగుగనే యున్నవి. విరాటుం డొకప్రభువుగాఁ జిత్రింపఁబడుట లేదు. ఎందులకుం బనికిరానియేబ్రాసిగాఁ జిత్రింపఁబడినాఁడు. ప్రభుత్వఠీవి లేదు. తెలివి తక్కువప్రసంగము లెచ్చు. కనఁబడినవానికెల్ల 'నారాజ్యము నీ కిచ్చెదను, నీవేలుకో' మ్మనుచువచ్చినాఁడు. ప్రభుత్వ మొనరింపఁ దగనివాఁడని దీనివలనఁ దేలుచున్నది." అని కాశీభట్టబ్రహ్మయ్యశాస్త్రిగారు భీమార్జుననకులసహదేవులపాత్రములను మెచ్చుకొనుచు, విరాటునిపాత్రాభివర్ణన మిట్లున్న దనిమాత్రము వక్కాణించిరి కాని, యందును

గూర్చి తమయభిప్రాయమును విస్పష్టముగఁ దెలుపుచుండలేదు. ఈవిషయ మటుండనిచ్చి ధర్మజుఁడు ధరించినకంకభట్టువేషమును గూర్చియు, వానిప్రసంగములను గూర్చియు. కొంకింత ముందుగాఁ జర్చింతము. ఈయపూర్వవిమర్శకు లగు కాశీభట్టవారికిఁ గంకభట్టు పాత్ర మభిమానపాత్ర మని వీరు గావించెడుప్రశంసవలననే విదితము కాఁగలదు. తమ కత్యంతాభిమానము గల కంకభట్టుపాత్రమును దిక్కనసోమయాజి పాడుచేసె నని గోలపెట్టుచున్నారు. చూడుఁడు!

"ఉత్తరదేశప్రాంతాలలో ధర్మజుఁడు బ్రాహ్మణవేషముతో విరటునికొల్వు సొచ్చె నని యున్నది. మనతిక్కనార్యుఁ డాతనికి బ్రాహ్మణసన్న్యాసివేషమును సమకూర్చె. ధర్మదేవతామహిమముచే, నున్న యునికిన, యుధిష్ఠిరునకు బ్రాహ్మణసన్న్యాసిరూపం బలవడి ధాతుపటదండకమండలుకలితమూర్తియై తనవైపునకు వచ్చుచుండఁగా దూరమునుండి కని విరాటుండు —

"సీ. కరచరణాద్యంగకము లేలాగో రత్న
భూషణప్రకరంబుపొందుఁ దొఱఁగ,
నుభయపార్శ్వంబుల నిభఘట లేలాగొ
చనుదేవు సముదాలిసమితి మొరయఁ,
బాయు, తోలంగుమం, చాయతవేత్రహ
స్తులమొత్త మేలాగొ గోడ రాదు,
ధవళాతపత్రముల్ తలచుగా నేలాగొ
పట్టరు మౌక్తికప్రభలు వెలుఁగ,
నితఁడు రాజగు, రా జగు నింతమాత్ర
గాదు, మూర్ధాభిషిక్తవర్గంబుఁ దనదు
చరణయుగ్మంబుఁ గొలిపింపఁ జాలుసార్వ
భౌమపదవికిఁ దగినయొడఁ డంగినాఁడు."

అని వర్ణించినట్లు తిక్కనార్యుఁడు వ్రాసియున్నాఁడు. ఇది యసంగత వర్ణనముగాఁ గాన్పించుచున్నది. ఏమన, దూరమునునుండి, యావచ్చు

చున్నవాఁ డెవ్వరో విరటుఁ డెఱుంగఁడు. ఆతని కీతఁడు క్రొత్త వాఁడు. రూపమున్నచో సర్వవిధముల బ్రాహ్మణసన్న్యాసివేషమునఁ గలఁడు. ఇట్టివిప్రయతిం గని, విరాటుం, డీతనితో నేనుఁగుల గుంపు లేల రావు? వందిమాగధు లేల రారు? ఛత్రచామరము లేల లేవు? ఈతనికరచరణాదులందు రత్నభూష లేల లేవని శంకించుకొనుట కవకాశ మెక్కడనుండివచ్చినది? ఒకగోవుం గని దీనికిఁ దుండ మేల లేదు? కుంభము లేల కానరావు? దంతము లేల పొడకట్టవనుట యెట్టిదియో నిదియు నట్టిది కాదా? విప్రసన్న్యాసికిఁ గరచరణాదులందు రత్నభూష లెట్లుండును? వందిఘోష లెట్లుకలుగును? ఇభఘట లెట్లువచ్చును? ఛత్రచామరంబు లెట్లుసంప్రాప్తమగును? కంకునిపూర్వావస్థంబట్టి యీవర్ణనములు గావించె నందురా? దాని విరాటుఁ డెఱుంగఁడుగదా! ఆవిప్రయతియందు బ్రాహ్మణయతిచిహ్నములకంటె సార్వభౌమచిహ్నములు హెచ్చుగాఁ గాన్పించుచున్న వందురా? ధర్మదేవతామహిమముచే ధర్మరాజునకు సమయరక్షణార్థమై విప్రసన్న్యాసిరూపము వచ్చిన దనిన నర్థ మేమి? అది వట్టి కృత్రిమవేషధారణము కాదే! దైవమహిమచేఁ గలిగిన రూపవిశేషమే! అట్టిరూప మడుగంటిపోయి గుట్టుమట్టును జెడఁగొట్టుక్షత్రియసార్వభౌమత యెట్లు విరాటునకుఁ గాన్పించినది. పగటివేషములు వేయువారలు కృత్రిమములుగా ధరించువేషములుగూడ సరిగ నిర్దేశితవేషమునే తోఁపఁజేయును గదా! అట్టిస్థితిలో దైవాయత్త మగు నీవిప్రరూపమును దూరమునుండి చూచిన యపరిచితులకుఁగూడ సార్వభౌమత్వమును సూచించిన దనిన దైవమహిమములోఁ గొఱఁత కల దనియే చెప్పవలసియుండును గదా? బ్రాహ్మణవేషము సరిగ తోఁపనిచో యనవలెను గదా! ధర్మజాదులనిజరూపములు కప్పుపడి పోయి క్రొత్తచిహ్నములు కలిగి వారియజ్ఞాతవాసము నిర్బాధకముగా

సాగుట కేక దా ధర్మదేవత యారూపముల ననుగ్రహించె! అవి సరిగ లేవనుట యసంగతము కాదా? కాన, తిక్కనార్యుఁ డొనర్చిన యీవర్ణన మెంతమాత్రమును సరిగ లేదు. ఇది యొకప్రమాద మనక తప్పదు. సమయభంగకరముగా నున్నది. కథకు సందర్భించి లేదు. ధర్మజునందలిసార్వభౌమత్వము పోయి చాలకాల మైనది. అదిగాక యతఁ డప్పుడప్పుడు బ్రాహ్మణవేషములో నుండుట వాడుక. ద్రౌపదీస్వయంవరాదిసమయములందుఁ బాండవులు విప్రవేషములలోనే యున్నారు. వారిసార్వభౌమత్వమును, ననఁగాఁ జక్రవర్తికులజత్వమును నప్పు డెవ్వరును గనుఁగొనియుండలేకపోయిరి. అట్టిస్థితిలో ధర్మజునివిప్రసన్న్యాసివేషమును దవ్వులనుండి చూడఁగనే, పూర్వాపరసందర్భము లేమియు నెఱుంగనివిరాటుఁ డాతనియందు, సార్వభౌమత్వమును గనిపెట్టుట వింత! మూలమునందుఁగూడ నిట్టివర్ణనము కలదు. కాని యదియు నసంగతము. మూలమునం దున్నలోపములను దిద్దివేసి చక్కఁగా వ్రాయుటకుఁ బూనుకొనినతిక్కనార్యుఁడుకూడ ధర్మజునకు దైవమహిమముచేఁ గలిగినరూపవిశేషమును మఱచిపోయి యెప్పుడో యాతనియం దుండినసార్వభౌమత్వమును మనస్సునకుఁ దెచ్చుకొని యీవిప్రయతియందు ఛత్రచామరాదికలితత్వాదు లేల లే వని శంకింపించుట వింతగా నున్నది. ఈవర్ణనము తప్పు.''

ఈవిమర్శకాగ్రేసరునివిమర్శమునకు గ్రంథకర్త చెప్పనిదానిని జెప్పినట్లుగాఁ బ్రశంసించుటయుఁ, జెప్పినదానిని జెప్పనట్లు ప్రశంసించుటయు మూలసూత్రముగా నుండును. ''ధాతుపటదండకమండలుకలితమూర్తి యై తనసైపునకు వచ్చుచుండఁగా దూరమునుండి కని విరాటుఁడు'' అని తిక్కన వ్రాయనివిశేషణమును దాను కల్పించుచున్నాఁడు. తిక్కన యతీంద్రుఁ డనిమాత్రము చెప్పినాఁడు. అతని పద్యమును జూడుఁడు.

"ఉ. దవ్వులఁ జూచి మత్స్యవసుధాపతి యీచనుదెంచుచున్నవాఁ
డెవ్వఁడొ నాదుచూడ్కులకు నెంతయు వ్రేఁగయి తోఁచె నెట్టితం
డివ్విధిఁ బొందెనో జగము లెల్లను నేలఁగఁ జాలుతేజ, మా
మువ్వురలోఁడిజోడి యగుమూర్తి, యతీంద్రునియొప్పుఁ గంటిరే?"

విరటుఁ డీయతీంద్రుని దూరమునుండి చూచి "ఈ వచ్చుచున్నవాఁ డెవ్వఁడో కాని నాచూపులకు మిక్కిలి వ్రేఁగయి తోఁచుచున్నాఁడు. ఎందుచేత నీరీతి నున్నాఁడో? సమస్తప్రపంచమును బరిపాలన చేయు శక్తి గలతేజస్సు; బ్రహ్మవిష్ణుమహేశ్వరులతో సమానమగురూపము గలవిగ్రహము; ఈయతీంద్రునిసౌందర్యమును జూచితిరా" యని తనవారిని హెచ్చరించునట్లుగాఁ దెలిపియున్నాఁడు. ఇతఁడు సామాన్యయతిగాఁ గన్పట్టలేదు గనుకనే విరటునకుఁ బైరీతిగాఁ గనుపట్టె నని తిక్కన వర్ణించియున్నాఁడు. జగములనన్నిటిని బరిపాలించు తేజస్సాతని మూర్తియందుఁ గనుపట్టుటచేతనే, యాతనికిఁ బరవశత్వమును బుట్టించి యాతనిభావములను మిన్నంటింపఁజేసినది. అతఁడు యతీంద్రవేషమును వేసికొనివచ్చినను, సార్వభౌమపదవి కర్హుఁడైనవానికిఁగల తేజస్సు తేటపడుచున్నదనుటలో వింత యేమియును లేదు. యతీంద్రునిలో నున్నయాతేజస్సే విరటునిహృదయము నాకర్షించినది. అది దైవమహిమ మని యేల యనుకొనరాదు? తిక్కన యుత్తరదేశభారతప్రతుల ననుసరించి ధర్మజునకు విప్రవేషము సమర్చిపెట్టక తనకాలమునాఁటి దక్షిణదేశప్రతుల ననుసరించియే ధర్మజునకు యతీంద్రవేషము సమర్చిపెట్టినాఁడు. అంతియకాని తాను స్వతంత్రించి యీమార్పును దెచ్చినవాఁ డని యూహింపఁజాలము. విరటుఁడు యతీంద్రునియందు నొకదివ్యతేజస్సును గనుటచేతనే యాతఁ డొకసార్వభౌముఁడుగ నుండువాఁ డని భావించి, యొంటరి వచ్చుచుండుటచేతఁ, "కరచరణాద్యంగకము లేలొకో సన్నభూషణప్రకరంబుపొందుఁ దొఱఁగె"

ననుసీసపద్యమున వర్ణించినవిధముగా రత్నభూషణముల, నిభఘటలను, వేత్రహస్తులను, ధవళాతపత్రములను బ్రశంసింపుచు, నయ్యవి లేవేమి యని శంకించుట సంభవించెను. ఇం దొకవిధమైన కవితాచమత్కారము కానంబడుచున్నయది. కవిహృదయముఁ దెలిసికొనుట కవికే సాధ్యమగును గాని కవితావాసన యించుకయు లేక చొప్పదంటుప్రశ్నలను వేయువిమర్శకుల కంతగా బోధపడు నని యూహింపఁజాలము. తిక్కనసోమయాజి నర్థన మసంగతము కాదు. గ్రుడ్డిలో మెల్ల యన్నట్లు మూలగ్రంథమునఁగూడ నిట్లే వర్ణింపఁబడినది. అదియు నసంగత మనిరి. గుడిమ్రింగువానికి గుడిలోనిలింగ మొకలెక్కలోనికి రాదుగదా! మూలభారతగ్రంథకర్తనే ధిక్కరింపఁగలిగినవారికిఁ దిక్కనసోమయాజి యెంతటివాఁడు? "మూలమునం దున్నలోపములను దిద్దివేసి చక్కఁగా వ్రాయుటకుఁ బూనికొనిన తిక్కనార్యుఁడుకూడ ధర్మజునకు దైవమహిమముచేఁ గలిగినరూపవిశేషమును మఱచిపోయి యెప్పటి యాతనియం దుండినసార్వభౌమత్వమును మనస్సునకుఁ దెచ్చుకొని యీవిప్రయతియందు ప్రాచామరాదికలితత్వాదు లేల లేవని శంకింపించుట వింతగా నున్నది" యనుదానికి యతీంద్రునుండి కనుపట్టిన దివ్యతేజస్సే కారణ మైయుండు నని యిదివఱకె గ్రహించియున్నాము. దానిని గ్రహింపఁజాలక విమర్శకులు ప్రస్తావించి పలుసారులు వ్రాయుచుండుటచేత నూఁకదంపుపాట కెంతఫలిత ముండునో దీనికి నంతేఫలితము. ధర్మజుఁడు యతీంద్రవేషము దాల్చుట దైవమహిమముచేతనే యని మఱొకమాఱు తెలియఁజెప్పుచున్నాము. అతని మహిమముచేతనే విరటుఁడును వానివారును యతీంద్రునియందు దివ్యతేజస్సును గనుఁగొనుట సంభవించినది. విరటునిమనంబున కాతనిఁ జూచినవెంటనే సార్వభౌమపదవి కర్హుఁడైనవాఁ డని తోఁచించినది కూడ దైవమహిమమే కావలయును. అట్టివినిర్మలభావ మంకురించిన

తోడనే యిట్లు తలపోసికొనియెను. "ఎందునిమిత్త మాతఁడిచ్చటకుఁ జనుదెంచుచున్నాఁడో? ఈమహాత్ముఁడు చెప్పినపను లన్నియుఁ జేయుదును. ఇతఁడు కోరినయెడలఁ దృప్తితీరఁ గనకాంబరముల నిత్తును. ఇంతియ కాదు. మత్స్యవిషయరాజ్యమహిమకు యుక్తుఁడు కాఁదలంచెనేని వినమ్రుఁడనై భక్తిగౌరవములు తేటపడునట్లుగాఁ జేసి, యమాత్యసుహృద్భటార్యయుతముగా నతనికి సేవ చేయుదు" నని చెప్పెను. అట్లాతఁడు యతీంద్రుఁడని విశ్వసించిన దొక్కవిరటుఁడు మాత్రమే కాదు. విరటునికొల్వుకూటమున నున్నవారికెల్లరకు నట్లే కనుపట్టెను. అద్యది యాదివ్యతేజోమహిమము కాదా? విరటుని కొల్వునం గలసమస్తజనంబు లాయతీంద్రునియెడఁ గల్గినభక్తియుక్తిం జేసి ప్రత్యుత్థానము సేయ, విరటుండును గద్దియ డిగ్గి, యెదురు సని, నమస్కరించి యాతనియాశీర్వాదంబులు గైకొని, సగౌరవముగాఁ దోడ్కొనిచనుదెంచి, సముంచితసమున్నతాసనమున నునిచి, వినయావనతుండై కుశలప్రశ్నంబు లడుగుటకుఁ బ్రారంభించెను. ఈసందర్భమునఁ దిక్కనగారిభారతము నొకించుక కాలము దూరముగా నుంచి కాశీభట్టబ్రహ్మయ్యశాస్త్రిగా రెంతో మెచ్చుకొన్న యుత్తరదేశభారతప్రతులలో విప్రవేషమును దాల్చినధర్మజుని విరటుకొల్వుకూటప్రవేశమునందలి యనౌచిత్య మెంతహాస్యాస్పదముగ నున్నదో చదువరుల కొకింత విశదపఱుపవలసియున్నది. ఉత్తరదేశభారతప్రతుల కనుగుణముగాఁ దెలిఁగింపఁబడిన దనుతలంపు కలిగియున్నట్టి కృష్ణభారతమునుండి దృష్టాంతము చూపఁగలము. విప్రవేష మెట్లువర్ణింపఁబడినదో చూడుఁడు.

"సీ. చీలమండలు మోయఁ జిఱుపింజలను దీరి
నీర్కావిధోవతి నిగ్గు లీనఁ
బొలుపు మీఱెడు దర్భముడియుంగరములోడఁ
కుశపవిత్రము కేలఁ గొమరుమిగుల

నుదుట, బాహుద్వయి, నుదరంబునందును
భస్మత్రిపుండ్రముల్ పరిఢవిల్ల
వెండితీవలు నాఁగ విరియఁబాఱిన జన్ని
దములు భుజంబుపైఁ దళుకు లొత్త
తే. నుత్తరీయము చెంగుల నుత్తమముగ
నక్షములఁ గట్టి కక్షములందుఁ బెట్టి
నివురుగప్పిన నిప్పనాఁ గాంతిఁ దలిర్చి
నృపతి కొలువుండుచోటికి నేగుటయును."

ఈబికారిబ్రాహ్మణవేషమును దాల్చి వచ్చుచున్నవాని, విరటుఁడు దవ్వులఁ జూచి దగ్గరనున్నవారికి వినంబడునట్లుగా, నీ

"పురుషుఁ డెవండో బ్రాహ్మణునిపోలిక గా దిది లోక మేలఁ జా
ల్దొర యని కాక దేవుఁ డని తోఁచెను బ్రేఁగయి నాదుమానసికిన్."

అనియు,

"ఉ. ఈచనుదెంచువాఁ డరయ నెల్లవిధంబులఁ జక్రవర్తినాఁ
దోఁచెను గాని సేవకులు తోఁ జనుదేరదియేమొ కొన్నియేన్
రాచఱికంపుసేవ లవి రావదియేమొ గజేభవాహముల్
చూచినఁ గానరావు కడుచోద్య మిదేమివిశేషమో ?..."

అనియు, వాని నొకచక్రవర్తిగా భావించుచున్నాఁడు. ఈబిచ్చపు బ్రాహ్మణుని, వీని వేషమును, జూచినమాత్రముచేత, "నితఁ డెల్ల విధంబులఁ జక్రవర్తినాఁ దోఁచె"నఁట విరటునకు. ఇదెంతయు బ్రహ్మయ్యశాస్త్రిగారికి సముచితముగాఁ గనుపట్టుచుండెనుగాఁబోలు! ఎంతవిపరీతము! అంత, విరటుఁ డేమిచేసెనో, ఆబ్రాహ్మణుఁ డెట్లు ప్రవర్తించెనో యొకించుక చిత్తగింపుఁడు.

అట్లు విరటుఁడు వితర్కించుచు డోలాయమానమానసుండై గద్దియమీఁదఁ గూరుచుండియుండఁగానే యుధిష్ఠిరుండు విరాటుకొల్వుకూటంబునకుఁ దఱియవచ్చి యతనిదిక్కు మొగంబై యి ట్లని యొకట,

"తే. జయము జయము మహారాజచక్రవర్తి
నిస్స్వుఁడ, ద్విజుండ నష్టసర్వస్వుఁడ నిటు
వచ్చితిని జీవనార్థినై వసుమతీశ
పాల వసియింపఁ జిత్త మేపగిది గలదొ॥"

అంత, విరాటుండు ప్రత్యుత్థాయియై స్వాగతంబు వలికి ప్రతిగ్రహించి కుశలప్రశ్నంబు లడుగుటకుఁ బ్రారంభించెను.

చూచినారా! అచ్చటఁ దిక్కన తనభారతములో యతీంద్రునియందుఁ బ్రజ్వలింపఁజేసినదివ్యతేజ స్సిచ్చట బ్రాహ్మణునియందుఁ గన్పట్టలేదు. సాధారణబ్రాహ్మణునిగాఁ గన్పట్టువానిని విరటుఁడు చక్రవర్తిగా భావించుట వింతవిషయము. భావించినను గౌరవ మించుకయుఁ జూపక మిడిగ్రుడ్లు పెట్టుకొని చూచుచుండ నాతఁడే విరటుని సమీపించి యొకసామాన్యభద్రాజువలె 'జయము, జయము, మహారాజచక్రవర్తి' యని సంబోధించుచు, 'దరిద్రుఁడను, బ్రాహ్మణుఁడను, సర్వస్వమును బోఁగొట్టుకొన్నవాఁడను. జీవనార్థినై యిట వచ్చితిని రాజుగారికొల్వున నుండుటకు, దేవరవారిచిత్త మెట్లనుగ్రహించునో' యని మొఱవెట్టుకొన్నట్లుగా వర్ణింపఁబడియెను. ఈప్రవేశఘట్టము తిక్కనభారతమున వర్ణించుసందర్భమున నౌచిత్య మెక్కువగాఁ బాటింపఁబడినది. ధర్మజునిపాత్రమును విరటునిపాత్రము నౌచిత్యమునకు భంగము లేకుండఁ జక్కఁగాఁ బోషింపఁబడినవి.

కృష్ణభారతములో ధర్మజునిపాత్రమును, విరటునిపాత్రమును, బూర్ణముగాఁ జెడిపోయిన వనుటకు లేశమాత్రమును సందియము లేదు.

తిక్కనభారతములోని యతీంద్రునిలోఁ గన్పట్టునట్టి యాత్మగౌరవ, గంభీరభావము లుత్తరదేశభారతప్రతులలోని, తదనుగుణముగా భాషాంతరీకరింపఁబడిన కృష్ణభారతములోని, విప్రవేషధారి

యందుఁ గన్పట్టవు. విరటుఁడు తన్నాదరించి యుచితాసనము నొసంగి తనయూరు, తనపేరు, తనకులము, తనవృత్తినిగూర్చి యెట్టిప్రసంగమును జేయకముందే తనంతటఁదాను రాజును సమీపించి భట్రాజువలెఁ గైవారములు సేయుచుఁ దనదీనావస్థను వెళ్ళఁబోసికొనుచు దీనాలాపము లాడుటలో నేమియౌచిత్య మున్నది? బిచ్చగానికి వీనికి భేద మేమి?

"కం. ఏదేశంబున నుండుదు
రేదికులం బేదిగోత్ర మేరాజుకడన్
మీదర్శనంబు మున్నగు
నేదిక్కక శారహస్య మెఱిఁగితి రీరల్."

అని విరటుఁడు విప్రుని ప్రశ్నించినట్లుగాఁ గలదు. బ్రాహ్మణవేషము విస్పష్టముగాఁ గాన్పించునపుడు, వెఱ్ఱివెంగళప్పవలె 'నేదికులం' బని మరలఁ బ్రశ్నించుట యెందులకు? తిక్కనభారతమునందు:—

"ఉ. ఎయ్యది జన్మభూమి కుల మెయ్యది యెయ్యది యున్నచోటు పే
రెయ్యది మీర లిందులకు నిప్పుడు వచ్చినదానికిం గతం
బెయ్యది నాకు నంతయును నేర్పడఁగా నెఱిఁగింపుఁ డున్నరూ
పయ్యది నాఫుడున్ నరవరాగ్రణి కయ్యతిముఖ్యుఁ డిట్లనున్."

అని విరటుఁడు యతీంద్రుని ప్రశ్నించినట్లున్నది. ఆకాలమున యతులలో వ్రాత్యయతులుఁగూడఁ గలరు కావున విరటుఁడు యతీంద్రుని "కుల మెయ్యది" యని ప్రశ్నించుటలో దోషముగాని, యాక్షేపణముగాని యిసుమంతయుఁ గన్పట్టదు. అట్లు ప్రశ్నించునపుడు, బ్రాహ్మణసన్న్యాసి యని తెలిసికొనియున్నప్పుడు, 'కుల మెయ్యది' యని ప్రశ్నింప నేల యని బ్రహ్మయ్యశాస్త్రిగారివంటివిమర్శకు లడుగ వచ్చును. కాని యాకాలమున ద్విజులలోమాత్రమె కాక వ్రాత్యులలోఁగూడ యతులు కలరు. కావున నిచట యతీంద్రునికుల మడుగుట యాక్షేపణీయము కాదు. అట్లు విరటునిచేఁ బ్రశ్నింపఁబడినప్పుడు

సైతము నాత్మగౌరవమును విడువక, వెంటనే ప్రత్యుత్తరమును జెప్పక మిక్కిలిచమత్కారమును గనుపఱిచి కొంచెము ప్రసంగమును గావించినాఁడు. రాజుతో సమానమైనదర్జాకలవాఁడుగాఁ గాని, లేక, యంతకుఁ బైదర్జాకలవాఁడుగాఁ గాని ప్రసంగించినాఁడే కాని కృష్ణ భారతములోవలెఁ గాని, ఉత్తరదేశభారతములోవలెఁ గాని, దీనాలాపములతోఁ బ్రసంగించియుండ లేదు.

"ఆ. ఉన్నదున్న పలుకు నన్నరు లెక్కడఁ
గలరు తోఁచినట్లు పలుకు పలుక
నైననంద మయ్యె నంతియాకా కంటి
పట్టి చూడఁగలరె యెట్టివారు."

అని మందహాసము సేయుచు మఱియును,

"కం. నానావిధభూతమయము
మే నతిచంచలము మనము మెయికొని నిక్కం
జేనరునకుఁ జెల్లింపఁ
గా నగు సత్యంబు నదుపుక్రమ మట్లుండెన్."

'ఓ రాజా! యథార్థస్థితిని బలుకుమనుష్యు లెక్కడఁగలరు? తమకుఁ దోఁచినరీతినే పలుకుచుందురు. అంతేగాని యెట్టివారైనను సత్యమును బట్టిచూడఁగలరా? ఈప్రపంచము నానావిధభూతమయమై యున్నది. ఈశరీరము మిక్కిలి స్థిరముకానిది. అతిశయముతో నిక్కంబుగా సత్యమును నెఱవేర్చుట యెవ్వరికి సాధ్యంబగును? సత్యము నదుపురీతి యట్లుండనిమ్ము' అని చమత్కారపుఁబలుకులు పలుకుచుఁ దనయుదంతము నీక్రిందిరీతిఁ దెలుపుచు,

"కం. ద్విజుఁడఁ గురువిషయజాతుఁడ
సుజనప్రియుఁ డైనధర్మసుతుసఖుఁడఁ బరి
వ్రజనాశ్రమకలితుండ మ
మజవల్లభయోగ్యబహువినోదకరుండన్.

కం. ద్యూతక్రీడకుఁ గొండొక
చేతుం గపటమున నొవ్వనిజనంబులు నా
చేతిధనమెల్లఁ గొని పరి
భూతి యొనర్చిన నిరర్థబుద్ధి వడలితిన్.

చం. నృపసభయందు విద్యకుం దగినతెఱంగు [illegible] కొంగ కొంగ ధ
గ్ధపరులకుం గలిం [illegible] రింపఁ దే
వపుఁగొలు వైన నాకు నిలుపక [illegible] నిన్ను భూ
మిపతులలోన సాధు[illegible] వ్రిలితిన్.

తే. వత్సరంబునఁ గడచనఁ బ్రతికి నాఁడు
దాని నిపాలఁ జల్పి యున్నాఁడఁ [illegible]
మఱయ వారికిఁ గృతఘ్నుని [illegible]
గొఱ్ఱ చేసినవారి [illegible]."

అని యడిగినవానికెల్లను నుచితరీతిని బ్రత్యుత్తరము లొసంగెను. ఇట్లు కంకభట్టు విరటునియుచితప్రశ్నలకుఁ దగువిధమున సమాధాన మిచ్చుచుఁ జేసినసంభాషణములను, వక్రసంభాషణము లనుచుఁ, దనకుఁ గలభాషాజ్ఞానమును శ్లేషలమూలముగను, ధ్వనులమూలము గను వెలిబుచ్చి తమనిజచారిత్రమును స్ఫురింపఁజేయుచుఁ గపటవేషాను కూలవాక్యములఁ బలుకుటలోఁ దనచాతుర్యమును జూపఁదొడంగె' నని కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు తమవిమర్శగ్రంథములో బహు విధములుగా నాక్షేపించుచున్నారు. కాని గురివిందపూస తనక్రిందినలు పెఱుంగ దన్నట్లుగా దమతప్పులను దా మెఱుంగకయున్నారు.

"ఉత్తరదేశపుఁబ్రతులలో నున్నవిప్రవేషమును మార్చి తిక్క నార్యుఁడు ధర్మజుని యతివేషమునకు దింపుటలో వైరస్య మున్నది కాని సారస్యము లే" దని వ్రాయుటకు విసుఁగుఁ జెందరు. ఉత్తరదే శపుఁ బ్రతులే కాని భారతమునకు దక్షిణదేశపుఁబ్రతులతోఁ బని లేకుండెనా? ఏడువందలసంవత్సరములకుఁ బూర్వము దక్షిణదేశము

నం దున్న తిక్కనసోమయాజి యుత్తరదేశప్రబంధములలో నున్న విప్రవే షమును యతీంద్రవేషమునుగా మార్చినాఁ డని చెప్పుట కాధార మేమికలదో చూపినయెడల నెంతో సమంజసముగా నుండును. ఆనాఁడు తిక్కనసోమయాజి యీమార్పును జేయుటకు నుత్తరదేశములకుఁ బోయినవాఁ డందురా? ఈనిరర్థకపుదోషారోపణ మెందుకు? యతీంద్రుఁ డని దక్షిణదేశప్రబంధములలో నుండఁగా, నేభట్ట బ్రాహ్మణపండితుఁడో యీ గోచువ .దలసంవత్సరములలో నుత్తరదే శప్రబంధములలో విప్రవేషముగా ఒ.. ర్చియుండు నని యనుకొనరాదా? ఎందు కీవట్టికంఠశోష? ఈచమత్కారకథను దిక్కన తన భారతమునఁ బ్రవేశపెట్టి తనయుత్కృష్టమైనకవితానైపుణ్యమును జూపుచుఁ, దనప్రతిభావిశేషమును గవిప్రపంచము నెల్లకడలను వ్యాపింపఁజేయుచు, మహోన్నతమైనస్థానమునఁ బీఠము వైచుకొని యందధిష్ఠించియున్నవాఁడు. అట్టిమహోత్కృష్టస్థానమునుండి కవిబ్రహ్మగారిని దించుట కీవిమర్శకునివంటివా రెంతకాలము తలక్రిందుగాఁ దపస్సు గావించినను నయ్యది సాధ్యపడునది కాదని తెలియఁజెప్పుచున్నాను.

ఇంక ద్రౌపదీసంభాషణమునుగూర్చి యొకింత చర్చింతము. "ఈమె సుధేష్ణకడఁ గావించినసంభాషణము, ధర్మజునిసంభాషణము నకు సర్వవిధములఁ దోడ్పడి యజ్ఞాతవాసము బయల్పడిపోవుటకుఁ గావలసినసందర్భముల నన్నిటిని జక్కఁగాఁ గూర్చినది. తిక్కనార్యుని మాలిని (ద్రౌపది) సుధేష్ణతోఁ దన కైదుగురుపతులు గల రని తెలిపినది. మననవవిమర్శకులు సూచించినరీతిగా నిదియొక్కటియే చాలును రహస్యమునంతయు బట్టబయలు చేయుటకు. మఱియు నామె యంతటితోఁ బోనీయక తన్ను శత్రువులు పతులముందఱ సభలోఁ గొప్పపట్టుకొని యీడ్చి రనియు, నాయవమానము సహింపలేక

ప్రచ్ఛన్నవేషులై యున్నతనమగలును దానును నడవులలోఁ దిరిగి తిరిగి యిచ్చటికి వచ్చితి మనియుఁ, దన సైరంధ్రీవేష మొకవత్సరమువఱకు నవసర మనియు నుడివినది. పాండవులకడనుండి వచ్చితి నని చెప్పుకొనినకంకుఁడును దానొకవత్సరము వ్రతము సలుపవలసి యున్న దని చెప్పినాఁడు. అక్కడనుండియే (పాండవులకడనుండియే) వచ్చితి నని చెప్పుకొనినమాలినియును దన కొకవత్సరపువ్రత మున్న దనియే చెప్పుకొనినది కదా! ఇవన్నియును సమయభంగదములు కావా? తిక్కనార్యుఁడు తనకావ్యకళాచాతురిని సరిగ వినియోగించి యీగ్రాఁతను వ్రాసినట్లు తలంచుటకు వలను గాకున్నది." అని వ్రాయుట వట్టి యధికప్రసంగ మని చెప్పఁదగియున్నది. ఈయపూర్వ విమర్శకులు కావించునాక్షేపణములను జదువరులు పాటించుట సరి యగుపద్ధతిగా నంగీకరించునెడల నిట్టియాక్షేపణములను వందలకొలఁది మూలభారతముపైనే చేయుట కవకాశము గలదు. వీరు చేసినయా క్షేపణములు తిక్కనభారతమున కెంతవఱకు వర్తించునో యంతవఱకు మూలభారతమునకును వర్తింపఁగలవు. ఇప్పుడు వీరు ద్రౌపదీసంభాషణములనుగూర్చి యధిక్షేపించినయధిక్షేపణముల నంగీకరించునెడలఁ దిక్కన, తనకావ్యకళాచాతురిని సరిగా వినియోగింపలే దనునది, మూలభారతగ్రంథకర్తలైనవ్యాసాదులకును వర్తించును. ఇక్కడఁ బ్రత్యేకముగా నొక్కతిక్కనసోమయాజినే వెక్కిరింప నవసరము లేదనియు, నట్లు మూలగ్రంథమును ముట్టనైనముట్టక, యొక్కతిక్కన సోమయాజినిమాత్రమే యెత్తికొనుటవలన వీరిప్రసంగ మధికప్రసంగ మని చెప్పవలసివచ్చుచున్నది. సుధేష్ణతో ద్రౌపది జరిపినసంభాషణము నెత్తికొని యధిక్షేపించుటచేత నిందునుగూర్చి నాయభిప్రాయములను, యుక్తియుక్తము లగు నాసమాధానములను ముందుగా నొసంగుచున్నాను.

మొట్టమొదట, సమయభంగము కలుగకుండుటకై పాండవులకు ధర్మదేవతావరప్రసాదము గలదు. దీనిని మన మెన్నఁడును మఱవరాదు. పాండవులధర్మపత్ని యగుద్రౌపది కాలకర్మవశమునఁ బరదేశమునఁ దమ్మెఱుంగని యొక్కరాజకుటుంబమునఁ దనభర్తల వలెనే తానును సేవకావృత్తి నుండవలసివచ్చెను. అయ్యది యొకసంవత్సరకాలముమాత్రమె. ఆసంవత్సరకాలము తా మెఱుకపడకుండఁ దమతమవృత్తులను నిర్వర్తించుకొనుచు నొకరాజకుటుంబమును సేవింపుచుఁ గడుపవలయు ననుట సత్యము. ఇందుకై వీరలు మత్స్యదేశమును, దద్దేశాధిపతి యగు విరటునికొల్వుకూటమును నిర్ధారించుకొనిరి. ఇట్లు పాండవులు తా మేర్పాటుచేసికొన్న వేషములను ధరించి మత్స్యదేశమునకు రాజధాని యగువిరాటనగరంబును బ్రవేశించి క్రమముగాఁ బాండవులేవురును విరాటునికడఁ గొల్వున కమరిరి. ద్రౌపది, విరటునిభార్య యగుసుధేష్ణాదేవికొల్వునఁ జేరినది. మొదటినుండియుఁ బాండవులకు మత్స్యదేశము సుభిక్షమైనదేశ మనియుఁ, దదధిపతి యగువిరాటుఁడు సాధుజనమిత్రుఁ డనియు, నచట నితరులకెవ్వరికి నెఱుకపడకుండ నొకసంవత్సరము తమయజ్ఞాతవాసకాలము సురక్షితముగాఁ గడుపఁదగు నన్నవిశ్వాసము గలిగియుండుటచేతనే వీరెల్లరు నచటికిఁ జేరిరి. ధర్మరాజు యతీంద్రునివేషముతోఁ బ్రవేశకాలమున విరటునితోమాత్రము ప్రసంగించినాఁడు. ద్రౌపది సైరంధ్రీవేషముతో రాణిసుధేష్ణాదేవినివాసమునకుఁ బోయి యచట నామెతోనే ప్రసంగించినది. యతీంద్రుఁ డగుకంకభట్టుప్రసంగములను గూర్చి యింతకుఁబూర్వము వ్రాసియుంటిని. ఇప్పుడు ద్రౌపదీసంభాషణమునుగూర్చి యొకింత తెలియఁజెప్పవలసి యున్నది. పాండవులేవుర చరిత్రమును విరాటరాజునకే తెలియకుండె నని చెప్పినప్పు డంతఃపురము నివాసముగాఁ గలయాతనిపట్టపురాణి సుధేష్ణాదేవికి సుతరాము

తెలియ దనుట సత్యమున కంతదూరము కాదు. ద్రౌపది స్త్రీ యగుటచేతను, బరరాజ్యమునందుఁ దన్నెఱుంగనిపరరాజుకుటుంబమున నంతఃపురమున నివసింపుచు రాణికి నొకపరిచారికగా సేవ చేయుటకు నొప్పుకొని దాసదాసీజనంబులనడుమ సంచరింపవలసిన దగుటచేతను, దా నొకమహారాజునకుఁ బుత్రికయై పాండవులేవురకు ధర్మపత్నియై సౌందర్యము గలస్త్రీయైయుండుటచేత, నాత్మరక్షణోపాయమునం దేమఱియుండరా దని, తాను సుధేష్ణకడఁ గొల్వు కుదుర్చుకొనుకాలముననే, తన్నుగూర్చియుఁ దనవృత్తినిగూర్చియు నామెకుఁ గరుణ పుట్టునట్లుగామాత్రమె కాక యొకవిధమైన గౌరవమును, భయమును గూడఁ గలుగునట్లు సంభాషించినది. విరటునిభార్య యగుసుధేష్ణ ద్రౌపదివంటి తెలివిగలది కాదనుట నిశ్చయమె. మొట్టమొదట, సుధేష్ణపనికత్తె లిరువురు రాణియాజ్ఞను శిరసావహించి రాజవీధిని నడచివచ్చుచున్నద్రౌపది కాసమాచారమును దెలిపి యామెను వెంట నిడుకొని సుధేష్ణకడకుఁ గొనిపోయినప్పుడు, ద్రౌపది సుధేష్ణయెదుట నిలువంబడినవిధమును గవిబ్రహ్మ యిట్లు వర్ణించినాఁడు.

"చ. కనుఁగొని గారవంబున మొగంబునఁ గేలఁ బురఃప్రసారముం
దనువున నమ్రభావమును దంతమరీచుల సామినిర్గమం
బును దనలోఁ గడుంగొనఁగ భూరితసాదరరేఖ నిందు ర
మ్యనవుదు నంత నంత ద్రుపదాత్మజ సేరి వినీతి నిల్చినన్."

ఆపాదమస్తకము ద్రౌపదియాకారమును వీక్షింపుచు విరటునిమహిషి యగుసుధేష్ణ సంతోషమెఱుకపఱుచుచు నుచితమార్గమున నామె నిట్లు ప్రశ్నించినది.

"ఆ. ఏది కులము నామ మెయ్యది యెవ్వరి
దాన వేమిపనికిఁ బూని యిప్పు
డిటకు బుద్ధిఁ దలఁచి యేగెద వింతయు
నెఱుఁగఁ జెప్పు మాకు నెఱుఁగఁబోఁడి."

అప్పుడు ద్రౌపది యిట్లు పలికినది,

"నేను సైరంధ్రీజాతిసంభూతను; నా పేరు మాలిని యందురు. నా కేవురుభర్తలు గలరు. ఒకప్పు డొక్క కారణంబున నుద్ధతు లగు విరోధులచేత భర్తలోడుటం దల వట్టి యీడ్వఁబడి వనంబున కరిగి వ్రతము బూని వల్లభసహితముగా వన్యాహారంబులఁ గాలముఁ గడుపుచు బ్రహ్మచర్యంబు నడపితి. ఇటమీఁద నియమాచరణంబునకు నొక్క సంవత్సరంబు గొఱంత కలదు. నీవు ధర్మవర్తిని వని వినుటం జేసి నా నేర్చుపనుల వెంట నీకడ నిలువందలంచి యిందు వచ్చితిని."

అంత సుధేష్ణ ద్రౌపదిని జూచి మరల నిట్లు ప్రశ్నించినది. "అరయఁగా నీవు సురగరుడఖేచరవిద్యాధరకిన్నరయక్షసిద్ధతరుణులలో నొక్కతవు. ఎందు కీపురమునకు వచ్చితివో బొంకక చెప్పుము."

అనవుడు ద్రౌపది, "నేను పూర్వము కృష్ణునిభార్య యగు సత్యభామకును, నటుపిమ్మటఁ బాంచాలికిని బని సేసితిని; మఱియు ధర్మమునకుఁ గట్టువడి పరిచారికాధర్మములకు నెల్లఁ జాలి ప్రవర్తించితిని; ఓతల్లీ! వినుము. ఆమె నాప్రాణము దనప్రాణముగా భావించుకొని గారవించునది. నీవును నీచము లైనపనులకు నేను చాల నని యెంచి మన్ననకర్హమైనదానినిగా భావించి యాచారము దప్పని విధముగా నాసేవను గైకొనుము.

క. [illegible] గూర్ప బహువిధ
తిలకంబులు వెట్ట వింతతెరువునఁ బలుపు
వ్వులు గట్టి కట్టి ముద్దుగఁ
దల ముడువఁగ సరులు గ్రువ్వఁ దద్దయు నేర్తున్."

అని వినయనయసంభాషణంబులు సలుపుచుఁ దనయభిమతమును విస్పష్టపఱిచినది. అప్పు డామె యాశ్చర్యమును బొంది, "నీవు రూప

నిని: మహారాజు నీరూపమును జూచి యువ్విళ్లూరుచుండును; నీవలన నే నెట్లు పనులు గైకొందును? ఇంతులును విస్మయ మందుచు, వారి దృష్టులను నీపైఁ బఱపుచు నిన్నుఁ జూచుచుందురు. 'భరింప శక్యము కాని నిన్నుఁ గైకొని కర్కటి గర్భముదాల్చినట్లు నావినాశమును నేనే తెచ్చుకొనుట మేరవగునా?'' అని తనలోనిభయమును వెల్లడించెను. అట్లు కాదు వినుమని సైరంధ్రి యిట్లు ప్రత్యుత్తర మిచ్చినది.

''వెరవును లావును గల మహాపరాక్రమవంతు లైనవారలు గంధర్వు లేమఱియుండక సదా నన్ను సంరక్షింపుచుందురు. ఎవ్వఁడు నన్ను నీచబుద్ధితోఁ జూచునో యాచపలుని నారాత్రియే, బలవిక్రమములు లఖర్వము లైనను, హరిహరాదు లడ్డుకొనినను దెగఁజూతురు; మత్తేభములవలె శౌర్యమదాంధు లైనబంధుశతంబులు సంరక్షించుచున్నను వానిని సంధులసంధు లెడలించి చంపుదురు గాని యుపేక్షింపరు. అందుచేఁ బురుషులు నన్నుఁ దేఱిచూడ వెఱతురు. అదియునుంగాక నాచిత్తము వారి కగోచర మైనదిగా నుండును. అస్మదీయకుల జననశీలాచారమహిమ యట్టిది. కావున నట్టిహీనవచనంబు లాడకుము. మనంబును శాంతిపఱుచుకొమ్ము. అనుమానము విడువుము. నీకువచ్చినభయము లేదు. నన్నుఁ బరిపాలింపుము. ఎట్టిపనులైనను సుదాత్తనాగరకరీతుల నీమదికెక్కునటులు నేర్పుతోడను; భయభక్తులతోడను జేయుచుఁ దద్జ్ఞులయిన సజ్జనులు, సాధులు, వృద్ధులు వెలదలగువారు మెచ్చునట్లుగాఁ బ్రవర్తింతును. నన్నుఁ గూర్చితరవు బనులకుఁ బంపక యెంగిలికూడును బెట్టక మన్ననతోఁ జూచువారి యెడల ననురాగమును నెఱపుదు నాపతులు నాకుదయావంతులుగా నెఱుంగుదురు.''

ఇట్టిపలుకులు సైరంధ్రివలన వినినదయ్యును, సుధేష్ణాదేవి యుత్తమపట్టమహిషి గావునఁ దనసంతోషమును దేటపఱుచుచు నామెను దనకొల్వున నుంచుకొనియెను.

ఇంతియకాని చమత్కారముకొఱ కామె యేమనునో తెలిసికొనవలయు నని యుత్తమరాజపత్ని యగుసుధేష్ణాదేవి "విను నీరూపముఁ జూచి మానృపతి యువ్విళ్లూరు నే నెమ్మయిం బనిగొందు" నని ప్రౌఢముగాఁ బలికినట్లు తిక్కన యామెచేఁ బలికించెనే కాని యీ యపూర్వవిమర్శకాగ్రేసరులు వ్రాసియున్నట్లుగా "నిన్ను నాకడఁ జేర్చుకొనిన వదలుకచ్చగల నాపతి నిన్ను మఱఁగి నన్నుఁ ద్రోసిరాజనునేమో కాన నిన్నుఁ జేర్చుకొనుటకు జంకుచున్నా"నని యప్రౌఢముగాఁ బేలవంపుమాటలు పల్కినట్లు వ్రాసియుండలేదే? ఇయ్యది యీయపూర్వవిమర్శకాగ్రేసరుని యధికప్రసంగ మని యనుపించుకొనదా?

ఐ ద వ ప్ర క ర ణ ము

తిక్కన కావ్యకళాదృష్టి.

కావ్యగుణములకుఁ బెన్నిధి యగునది మూలభారతము. అందలి సారస్యమును బోఁగొట్టక యున్నదున్న ట్లనువదించుటకు మహాప్రతిభ కావలయు నందురు. అట్లగునెడ నౌచిత్యరసపోషణార్థము స్వతంత్రించి మూలగ్రంథకారునిరచనములను మార్చు టెంతటిమహాకార్య మనఁదగునో వేఱుగఁ జెప్పవలయునా? తిక్కనసోమయాజి తనభారతమున, నందు ముఖ్యముగా విరాటపర్వమునందు మూలమును

వెక్కిలింటిని జొప్పించియున్నాఁ డని మూలానువాదముల సరిపోల్చు కొనుపాఠకవిమర్శకులకు విదితము కాఁగలదు. "తనకావించినసృష్టి తక్కొరులచేతం గా" దన్నప్రబంధపరమేశ్వరునిపొగడ్తకు హేతువు లగు నీకవిబ్రహ్మగారిరసికతకును, కవితాశిల్పచాతుర్యసౌందర్యము నకును, నౌచిత్యరసపోషణమునకును మిన్న యగుతార్కాణ మీవ్యత్యయమే కాని మఱియొండు గాదు. అట్టి వివిరాటపర్వమున వందల కొలఁదిఁ గన్పట్టుచున్నను గ్రంథవిస్తరభీతిచేఁ గొలఁదిగమాత్ర మిచ్చటఁ జూపుటకు సాహసించుచున్నాను. మూలములో.-(౧) అర్ధరాత్రమున వంటయింటిలో వలలుఁ డని నూఱుపేరు పెట్టుకొని వంటలవాఁడై యున్నభీముఁడు మైమఱచి నిదురించుచుండఁగా సైరంధ్రి (ద్రౌపది) విరటునిమఱఁది యగుకీచకునితాపుచేఁ బరిభవింపఁబడి భీమునితోఁ దనభంగపాటునుగూర్చి తలపోసికొన వచ్చినఘట్టమున:—

"అరణ్యములోఁ బెఱుఁగుచుండిన మూఁడేండ్లవయస్సు గల యొకయావు మొదటిసారి యెదగొని పొగరుతో నున్నకోడెను గదిసినట్లును, నీలిచాయ నున్న యొకకొంగ పెంటికలయికఁ గోరి పోతుకొంగను జేరినట్లును సైరంధ్రి (ద్రౌపది) భీముని దరిసినది. గోమతీతీరమునందలి మహాసాలమును దీఁగవలె భీమునిఁ బొదివికొనెను. అట్లతనినిజబాహుద్వయముచేఁ బొదివికొని సులక్షణవతి యగునామె దారి తెన్ను గానరానియడవినిబడి నిదురించుసింహమును సింహివలె మేల్కొల్పెను. హస్తిని హస్తినట్లు శీలవతి యగుపాంచాలి భీమునిఁ గౌఁగిలించి, వీణనుండి వెడలుగాంధారస్వరమువంటిమధురస్వనమున భీము నిట్లు సంబోధించెను:—

"ఉత్తిష్ఠోత్తిష్ఠ, కిల శేషే, భీమసేన, యథామృతః,
నామృతస్యహి పాపీయాన్ భార్యా మాలభ్య జీవతి."

[చచ్చినట్లు పరుంటివి; భీమసేనా! లెమ్ము, లెమ్ము; బ్రదికినవానికి భార్య నగుడు చేసి యాపాపి చావకుండునా?]

అని మూలగ్రంథకారుఁడు సైరంధ్రినోరనుండి పలికించినాఁడు. అదనున కనువుగా నడువనేర్చిన ద్రౌపది, కొండవంటి యోరిమిగల ద్రౌపది, ఏవురుమగలవలపు సరిగా గడించిన ద్రౌపది, మగలవెంటఁ బడి యడవుల సిలుగులఁ బడనోపిన ద్రౌపది, ధర్మరాజాది మగల యేవురకు రాచటికపునడకలనుగూర్చి యెచ్చరింపఁగల వలంతి యగు ద్రౌపది, యుత్తమదికెక్కిననడవడు లలవడఁ జేసికొన్న కోడ లగు ద్రౌపది, కీచకుఁడు తన్నుఁ బఱచిన యాఱడి నెఱిఁగించి వాని నెసకొల్పి కసిఁ దీర్చికొన నద్దమురేయి వలలునివంటయింటి కరుదెంచిన ద్రౌపది వానిపైఁ బడి "భీమసేనా! చచ్చినట్లు పరుండితివా? లెమ్ము; లెమ్ము;" అని పలుకుట యౌచిత్య మనిపించుకొనునా? ఆమెనడతకు సరిపడునా? ఆవు, గొంగ, మొకము, ఏనిక, సీవ యుపమానములు వట్టిఛాందసమును దెలుపువర్ణనములే కాని సమయయోగ్యములు, సరసములు నగువర్ణనము లనిపించుకొనునా? ఇంతతో సరిపుచ్చఁబడినదా? అటుపై జరిగినచిత్రప్రశంసను గనుఁగొనుఁడు.

అప్పుడు భీముఁ డిట్లు ప్రశ్నించినాఁడు :

"ఏమిపనిఁబూని యింతత్వరితముగా నిచ్చటికి వచ్చితివి ?" సైరంధ్రి కీచకునిచేఁ బరిభవింపఁబడినవిధము నెఱింగియుండియు నిట్లనాలోచితముగాఁ బ్రశ్నించుటకు నిదురమబ్బున బుద్ధిబలము కొఱవడియుండుటయె కారణ మైయుండు నని మన మూహింపవచ్చును గాని తరువాతిప్రశ్నమును జూడుఁడు :

"ఏమిది; నీవన్నె మాసినది; వెల్లనై యగుపడుచున్నావు; నా కంతయు విస్పష్టముగా నెఱిఁగింపుము; అది ప్రియమో, అప్రియమో, సంతోషప్రద మయినదో, సంతాపకారణ మైనదో నాకుఁ దెలియఁ జెప్పుము; అంతయు విన్నమీఁదటఁ దగినవెర వాలోచించి కర్తవ్యమును నెఱవేర్తును."

ఇట్లు భీమునిచేతఁ బలికించుటయం దెట్టియౌచిత్యము గలదో యొకింత విచారింపవలయును గదా! ఒరు లెఱుంగకుండ మెలఁగవలసినవా రీదంపతులు. భీముఁడు పరుండినచోట దీప ముండెనో లేదో చెప్పకపోయినను దీప ముండె ననియే భావింతము. ఆదీపము నార్పి వేసియో, దూరముగా నుంచియో చీఁకటింట గుజగుజలు వోయి యుండుట గాని తమరహస్యము బయల్పడు నన్నభీతిగలవారు దీపము వెలుఁగున సుద్దులు సాగింతురా? ఇదేటియౌచితి? అనాఁటిసభలోఁ గీచకునిచేఁ బాంచాలి తాపుతిన్నప్పు డామెను భీముఁడు చూచియుండెను గదా! అప్పటికి లేనివన్నెమూపు, వెల్లబాటుఁదనము క్రొత్తగా నామెయందు భీముఁ డెట్లుగనుఁగొనెను? ఆతాపునకు నీతలపోతకు నడుమ నెంతతడవు గడచినది?

ఇట్లు మూలమునం దెంతయో యనౌచిత్యదోషము గన్పట్టుచున్నది. ఈయనౌచిత్యదోషమును గనిపట్టియె యెట్టిదోషమునకుఁ దాను పాల్పడక తిక్కన తనయౌచితి నెట్లుకాపాడుకొనఁగలిగెనో యొకింత పరిశీలింతముగాక!

తిక్కన తానుచెప్పఁదగినదానినంతయుఁ జెప్పకమానఁడు. మానఁదగినదానిఁ జెప్పఁడు. అనవసరమైనసోదెకు దిగి యక్కఱకుమాలినప్రసంగములకుఁ దావియ్యఁడు. ఆవు మెదగొని కోఁడెను గదిసె నని, యాఁడుకొంగ మగకొంగకై వలపులాడె నని, యక్కఱకుమాలిన ప్రసంగమును జొప్పింపక పాత్రమర్యాదకును, బట్టునందలిభావమునకును నొప్పిద మగురీతిని మాటిగా నాట్యకళాకౌశలము నిరూపించుచున్నాఁడు, చూడుఁడు.

"వ॥......రాత్రిసమయం బగుటయు సమస్తజనంబులుఁ గ్రమంబున నిద్రింపందొడంగినం దానును శయ్యాతలంబు విడిచి చేనిధూళి గడిగి ధౌతపరిధానపరీతయై మహానసగృహంబున సుప్తుం డైనవృకోదరుకడకుం జని,

ఉ. నన్నుఁ బరాభవించి పదనంబునకుం జని కీచకుండు ము
న్నున్న నెఱుంగుఁ దప్పక సుఖోచితశయ్యను నిద్ర సేయ నీ
కన్ను మొగుడ్పఁ బాల్పడుటకుఁ గారణ మెయ్యది భీమసేన మీ
యన్న పరాక్రమంబు వల దన్న నొకో దయమాలి తక్కటా!

వ. అనుచు మందమందసంభాషణంబుల సంబోధించుపాంచాలిపాణిస్పర్శనంబున మేల్కాంచి యాతఁ డున్న దనవుడు నే ననునమ్మానిని యొలుం గలంగి భీమసేనుండు యాజ్ఞసేని కీచకుకాచరణంబు నాకుఁ బ్రకటించి వాని నిగ్రహింప నియోగించు నది స్థైర్యగుణంబు గావలయు నట్లుం గిత్తెఱవ దాన చెప్ప విందు నని తలంచి.

తే. ఇంత ప్రొద్దుల యాచోట నేఁగుదెరఁ
గారణం బది యెవ్వరుఁ గానకుండు
నట్లుగాఁ జనుదెంచితే యంబుజాక్షి
యనిన నయ్యింతి యి ట్లను నతనితోడ.

చ. ఎఱిఁగి యెఱింగి యన్నడుగ నేమిటి కప్పు డెఱింగి యింతకు
న్మఱచుట గర్జనే నను వినంబని లేదు తగంగ యున్నరూ
పెఱఁగియు నీవ చెప్ప విన నిష్టము గల్గుట చాల లెస్స య
ప్పెఱుఁ దెలుఁగింప దివ్వినుము పెల్లముగా మొదలింటినుండియున్.

అని పలికించి తరువాతికథ చెప్పించినాఁడు. ద్రౌపది పాండవాగ్రజుఁ డగుయుధిష్ఠిరుని తొల్లింటివైభవమును, నిప్పటిపేదఱికమును దలపోసి కొని పోల్చి పొక్కుచు భీమసేనునితోఁ జెప్పకొనుచు వాపోయినసందర్భమునఁగూడ మూలగ్రంథకారునికవితాకళ మూతిముడిచిపోయినది. మూలములో:—

"దశనాగసహస్రాణి హయానామ్ హేమమాలినామ్
యం యాన్తమనుయాన్తిస్మ సోఽయం ద్యూతేన జీవతి!
రథాశ్శతసహస్రాణి నృపాణా మమితౌజసామ్
ఉపాసన్త మహారాజ మింద్రప్రస్థే యుధిష్ఠిరమ్
శతం దాసీసహస్రాణాం యస్య నిత్యం మహానసే
పాత్రీహస్తం దివారాత్ర మతిథీన్ భోజయత్యుత."

పదివేలయేనుంగులును, పదివేలగుఱ్ఱములును బంగారుచాడ్పోళ్లతోఁ దనవెంట నడచి రాఁగా నూరేగెడిధర్మరాజు నేఁడు జూదముతోఁ బ్రదుకుచున్నాఁడే? నూఱువేల రథము లలమి తేజస్సంపన్నుని మహారాజును యుధిష్ఠిరుని నింద్రప్రస్థమునఁ గొలుచుచుండెడివే! నూఱువేలమందిదాసీ లెల్లపుడును రేయింబవళ్లు తన (ధర్మసుతుని) వంటయింట వడ్డనపాత్రలు చేపట్టి యతిథులకు భోజనములు పెట్టుచుండెడివారే!

మూలమునకు విధేయముగా నుండవలె నని కాఁబోలు శ్రీకృష్ణ భారతమున నిట్లు వర్ణింపఁబడినది.

"ఉ. తిట్టుము పాడుజూద మది తెచ్చి శిరంబునఁ బెట్టి చెట్టలం
బెట్టినవాని నందఱకుఁ బెద్దగువాని దురోదరప్రియున్
గట్ట! వచింప నే మతఁడు గాక మఱొక్కఁడు రాజ్య మొడ్డి తా
నట్టడవిం జరింపఁగ మనం బొనరించునె మానభూషణా.

తే. ధనకనకవస్తువాహనతతుల నరసి
యొడ్డి రేఁబవల్ విడ కాడుచున్నయేని
జూద మది యేండ్లుఁబూండ్లుగాఁ జూడనైనఁ
దెగకయుండు ని ట్లొనరింపఁ దగులఁ డతఁడు.

కం. తనచేసినపనికిన్ యమ
తనయుఁడు నెమ్మనమునందుఁ దలఁగని చింతన్
గొని మూర్ఖునట్లు మిన్నక
కనుఁగొనుచున్నాఁడు నేఁడు కడుదీనుండై.

సీ. పదివేలహాయములు పదివేలహస్తులు
పదిపదివేల్ రథపంక్తు లెపుడుఁ
దోడ రాఁ బురవీథి వేడుకమై నేగు
పెండ్లి యొనర్చెడుపృథ్వినాథుఁ
డనిశంబు నిష్కసహస్రవేతన మిచ్చి
దాసీశతసహస్రతతుల నిల్పి
తనయింటఁ బనులు రే యనక వారలచే న
తిథుల సాపడఁ జేయు ప్రథితకీర్తి
యొరు లెఱుఁగకుండ నొక్కచో నుబుసుపుచ్చు
నట్టిఁ డైయుండి నీచయాచ్ఞాన్నభుక్తి

హృదయమున నుంచుకొంచుఁ దా నున్న వాఁడు
ధర్మసుతుఁ డక్కటక్కటా దైవఘటన.”

మూలగ్రంథమునఁ గానరానికవితాకళాప్రతిభ మూలమునకు విధేయమైనయనువాదమునం దెట్లగపడఁగలదు. వట్టిజాబితామాత్రము తయారయినది. ఇంక నీఘట్టమునఁ దిక్కనకూర్పుఁ గనుఁడు.

తిక్కనరచనము:—తనపరిభవమును దెలుపుచు ద్రౌపది భీమునితోఁ బలుకుచున్నది.

తే. పాఱుదెంచిన నక్కులపాంసనుండు
కోప మడరంగ వెనుకనకూడ ముట్టె
నఁట యెఱుంగుదు నీవు మీయన్న పెద్ద
తనముఁ జూచితి వేమంగు ననిలతనయ.

ఆ. అకట యాఁడుకూయు నాలకూయును లాఁతి
వారికైన నరయవలయు ననిన
నన్నుఁ గీచకుండు దన్నంగ నెట్టులు
చూడనేర్చె ధర్మసూనుఁ డపుడు.

తనపరిభవము ధర్మజుఁ డెట్లుచూడఁగల్గె నని భీముని ద్రౌపది ప్రశ్నించినట్లుగా రచించినాఁడేకాని మూలమునందును కృష్ణభారతమునందును ద్రౌపది పేలవపుమాటలతో ననౌచిత్యముద్ధోరణి దూషించినట్లుగా వర్ణింపలేదు. అప్పుడు భీముఁడు ద్రౌపది కిచ్చినప్రత్యుత్తరముకూడ నెంతవివేకముతో నౌచితికి భంగము లేకుండ, సమంజసముగా నొప్పియున్నదో చూడుఁడు.

“ఉ. కీచకుఁ డట్లు మీఁదు పరికింపక తన్నుఁ బరాభవింపఁగాఁ
జూచి మహోగ్రకోపవివశుం డగునన్నును జూచి ధైర్యహే
మాచలుఁ డైనధర్మసుతుఁ డమ్మెయి వారణ సేయకున్న నే
నీచతఁ వాని మత్స్యవిభునిం బరివారము నుగ్గుసేసెదన్.

క. ఆసంరంభంబున సమయభంగంబుగా జనంబులు మనల నెఱింగిరయేని,

కం. ఘుండపటిభంగిన కానల
యెండకుఁ జరిపంగవలసె నెడి నీవును నే
నుం దెచ్చినయాపదగా
నిందింపరె యెల్లవారు నీరజనయనా?

వ. కావున సత్యవ్రతనిష్ఠుం డగుయుధిష్ఠిరుండు పొగడ్తకుం దగువాఁడు గాని దూఱువడ వ్యాండు గాఁ డని వెండియు నిట్లనియె.

కం. పరిభవకరుఁ డగుకీచకుఁ
బరిమార్చుట యిపుడు గడవఁబడియెను యిమ్మై
దురపిల్ల నేల ప్రేల్మిడిఁ
బొరిఁగొని నీమనము కలఁకఁ బుత్తు లతాంగీ.

వ. మనల నెవ్వరు నెఱుంగకుండునట్లు మెలంగుఁ దలపోయవలయుఁ గాక పగతుని భంజించు టెంతటిపని యనిన విని యమ్మానిని యిట్లనియె.

చం. కినుకకుఁ జాల కెంతయును గీడ్పడి నాపదుపాటు లెల్ల ద
మ్మునఁ గలియంగ నిట్టు లొకమాత్మునిచేఁ దుదిఁ బోయి కోలుపో
యెను యభిమానవు న్వగపు నేత్రము డెందము గొందలంబుఁ బోం
దిన ధృతిమాలి రేఁ బలికితిం దగవెల్ల నెఱింగియుండియున్."

వ. ఇట్టిదికాని సమస్త నస్తవనీయుం డగుపాండవాగ్రజు నిక్కంబ నిందించినదానం గా నని పలికి మఱియును."

పైరీతి ద్రౌపది భీమునికి సమయోచితముగాఁ బ్రత్యుత్తరముఁ బలుకుచు ధర్మజు నిట్లభినందించుచున్నది.

క. ధర్మతనూభవు సంతత
ధర్మనిరతి మనము బ్రదుకఁదలఁచుట యరుదే
నిర్మలుఁ డగు నాతనిప
త్కార్యంబునఁ గాదె బ్రదుకు ధాత్రికి నెల్లన్.

సీ. చనునె వేలోకని కజాతశత్రుం డను
పేర దిగ్విజయంబు పెంపుదాల్ప
రాజసూయమహాధ్వరముఁ గోరి చేయంగఁ
దీఱెనె పెఱధరిత్రీపతులకు

ధర్మైకనిరతుఁ డాతం డొక్కరుఁడ చూవె
యనఁ జన నౌరులకు నలవియగునె
నిత్యవ్రతంబుగా సత్యంబు పాటింప
నచ్చునె యొరుల కెవ్వారికైన

తే. నయ్యుధిష్ఠిరుగాంభీర్య మతనిధైర్య
మరయ నొండెడఁ గలుగునె యతఁడు కీర్తి
ధరుఁడు గరుణోత్తరుఁడు మహీసురసమృద్ధి
కరుఁడు నిజవంశకరుఁ డుపకారపరుఁడు.

క. కలిమికి నొప్పగునీగియు
బలిమికిఁ దొడవైనయట్టిబలగము నై లో
కులచిత్తములకు వ్రేఁగగు
కొలఁది మనం బొంతిపెద్దకొడుకున కమరున్.

సీ. ఎవ్వానివాకిట నిభమదపంకంబు
రాజభూషణరజోరాజి నడఁగు
నెవ్వానిచారిత్ర మెల్లలోకములకు
నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు
నెవ్వానికడకంట నివ్వటిల్లెడుచూడ్కి
మానితసంపద లీనుచుండు
నెవ్వానిగుణలత లేడువారాసుల
కడపటికొండపైఁ గలయఁ బ్రాఁకు

తే. నతఁడు భూరిప్రతాపమహాప్రదీప
మారవిఘటితగర్వాంధకారవైరి
వీరకోటీరమణిఘృణి వేష్టితాంఘ్రి
తలుఁడు కేవలమర్త్యుఁడె ధర్మసుతుఁడు."

ఈపై రీతిగాఁ దిక్కన తన చక్కనిచిత్తారిపనితనముఁ జూపినాఁడు. ఇట్టి వెన్నో యీవిరాటపర్వఘట్టమున మనము చూడఁగలము. వాచ్యములుగ నున్నవానికి వ్యంగ్యరూపము లిచ్చి కవిత్వ మనిపించు చున్నాఁడు. స్థాయి నెఱింగి భావ మన్వయించుకొని యాలపించి

జీవము పోయుచున్నాఁడు. పట్టిమాటలజాబితా కొఱతూపము నిచ్చి వన్నెఁబెట్టినాఁడు.

(2) మూలమున విరాటుఁడు బృహన్నలను (అర్జునుని) తన కొమార్తెకు నట్టువొజ్జగ నియమించుటకుఁబూర్వము ముందుగా నతని గీతాదికళలఁ బరీక్షించుటయగాక నిజమంత్రులతో నాలోచించి (పరీక్ష్యచైనం ప్రమదాభిరాశు వై; అపుంస్త్వ మప్యస్య నిశమ్యచ స్థిరం) మించుబోఁడులం బుచ్చి పరీక్షించి పేడి యని నిశ్చయించి యతనినపుంసకత్వమును దృఢముగా నెఱింగె నని యున్నది. కాని తిక్కన యాంధ్రమునఁ బరీక్షాప్రస్తావమే వాచ్యముగాక "నైపుణంబున నుచితంబులై మై నరసి పొచ్చెమి లేమి" నని మాత్రము తెలుపఁబడినది. ఇచ్చటఁ గవిబ్రహ్మ మూలమునందలియశ్లీలతను "నైపుణంబున నుచితంబులై" దూరీకరించుట విస్పష్ట మగుచున్నది.

(3) సుదేష్ణయానతిం గొని సైరంధ్రి కీచకునింటికిఁ గల్లుగొనిపో వచ్చినపుడు కీచకుఁడు (మూలములో):—

'తాం మృగీమివసంత్రస్తాం దృష్ట్వా కృష్ణాం సమీపగాం' సమీపమునకు వచ్చుచుండెడి భీతహరిణిం బోలుద్రౌపదిని ('చకితకురంగివోలె' యని కృష్ణభారతము) వీక్షించె నని మూలము. ఇందుకు "బెబ్బులి యున్నపొదను లేడి సొచ్చుచందంబున" సైరంధ్రి కీచకుని మందిరంబుఁ బ్రవేశించె నని తిక్కనగారికూర్పు. ఇది మూలరూపమునకు జీవము పోయునట్టిది.

(4) మహావీరుఁ డైనభీమసేనుఁ డాఁడుదాని వేసముఁ దాల్చుటకును, గామప్రేరితకీచకప్రలాపములకు వలవుకత్తెవలెన ప్రతివచనంబు లాడుటకును నెందులకుసమ్మతించెను? ఒకవేళ సమయభంగ మగుచున్నభయముచేత రహస్యగోపనార్థ మాతఁ డట్లాచరించి

యుండు నని సమాధానము చెప్పఁగొందమందు రేని నర్తనశాల యంధ కారబంధురము గదా! అచ్చోట స్వస్వరూపముతో నున్నను నేమి విపత్తు సంభవించును? మోసమున మాఱువేసమునఁ గాక సింహ బలుఁ డైనకీచకుని సంహరింపఁగలనా యని భీముఁడు సంశయించెనా?" అనుప్రశ్నములకు సమాధానము మూలమున నెంతమాత్రముఁ గాన రాదు. కాని తిక్కన యాంధ్రమున నేతన్నిమిత్తమే యద్భుత మైన సంవిధానము గల్పింపఁబడిన దని విమర్శకులు కనుపెట్టఁగలరు. భీముఁడు ద్రౌపదితోఁ బ్రతిజ్ఞ చేయునపుడు "ఆపాపగుని0 దెగఁజూచి, నీకుం జూపి నీచిత్తంబు వడసెద" నని చెప్పెను. అందునిమిత్తమే యాతఁడు నర్తనాగారమున "విరాటనందన యగునుత్తరపర్యంకమున కనతిదూరమున సైరంధ్రి నోసరిల నుంచును. కనుకనే కీచకుని కామో ద్రేకసంభాషణములకుఁ "గనలియు, రోసియు, న్మదురీతి నుచిత నిగూఢభంగు లగుభాషణములను దనప్రియకు వినుపించుటకుఁ"గా బదులుపల్కెను. ఇందుఁ బ్రకటమగుచున్న తిక్కనార్యుని ప్రకరణౌచి తకల్పనాసామర్థ్యము నెంతేనిఁ గొనియాడందగును.

(౫) కీచకునితో భీముఁడు పోరాడుటకుమున్ను తనవాస్తవ స్వరూప మాతనికిఁ దెలియఁజేయుచు నీక్రిందిరీతిఁ బలికినట్లుగా మూల మునం దున్నది.

"పాపాత్మా! సింహముచే మత్తగజేంద్రముకై వడి, నాచేఁ బుడమిని ద్రోయఁబడి యీడ్వంబడుకొండను బోలునిన్ను నీయక్క చూడఁగలదు. నీవు చచ్చినయెడ సైరంధ్రి నిర్భయముగ విహరిం చును. ఆమెభర్తలును సుఖింపఁగలరు."

ఇట్టిపలుకులు భీమునిచేఁ బలికించుట కీచకుఁ డెదుర్కొనుట కును, సేవకాదులనుగూర్చి యెలుఁగెత్తి కూయిడుటకును నవకాశము

నిచ్చుటయగాక యేమియుపాటునఁ గీచకుని బట్టికొని యుక్కడఁగింపఁ గోరు భీమునుద్దేశమునకు విరుద్ధమునై యున్నది. కనుకనే తిక్కన మూలములోని పైభీమవాక్యములను బూర్తిగా వదలి యతఁడు "గ్రక్కున లేచి" యతనిం "దలపట్టి వంచి" నట్లు వర్ణించినాఁడు.

(౬) భూమ్యాకాశములు భేదిల్లునట్లు సింహనాదములు సేయుచు భీమకీచకులు పోరాడినట్లు మూలమున నున్నది. ఇందలి ప్రకరణవిరోధమును బాగుగా గుర్తించి తిక్కన వారియుద్ధమును వర్ణించుసందర్భమున:—

"క. తనయాగ్రహ పోరు గెలుఁగుదు
నని చూచుచుఁడు, ననుయాగంగ బొగడుకు భీముం
డును గొంకుచుఁ జప్పుడు సే
యని ఘాతవిమర్దనప్రహారములు పగన్."

గడంగి రని రచించినాఁడు. పురుషులు నిశ్శబ్దముగఁ బోరి రనుటయ గాక, కీచకుఁడు నట్లుచేయుట కద్భుతహేతువుం గుదుర్చుట యుత్తమ విశేషము గదా!

(౭) మూలములో వృక్షము నొకదానిఁ జేతం బట్టుకొని యేతెంచుభీమునిం గని యుపకీచకులు బెదరి యూరివైపు బరువిడుటకుఁ బూర్వము ద్రౌపదిని కట్లనుండి విడిపించి రని యున్నది. ఆసమయమున నెవనిప్రాణమును వాఁడు శ్రద్ధతోఁ ద్వరగాఁ గాచికోవలసినసందర్భములో నీచాత్ము లయినయుపకీచకులకు ద్రౌపదిని కట్లనుండి విడిపింపవలయునన్నతలం పంతసహజముగఁ దోఁచునది కాదు. కావునఁ దిక్కన తనయాంధ్రమునఁ దత్క్రమమును వ్యతిరిక్తముగాఁ జెప్పినాఁడు. ఇచ్చట నుపకీచకులు "ద్రుపదసూతిసమేతముగా నగ్రజుప్రేతము వైచి" పాఱుచుండ వాయుతనూభవుఁడు వారలను రూపడంచి వచ్చి పాంచాలిబంధమోక్షమును గావించె నని చెప్పియున్నాఁడు. ఇట్టి

మార్పువలన మానవస్వభావానుగుణత యలవడుటయేగాక తనభా ర్యను విడిపించుకొనుగౌరవము భీమునికే లభించుటవలన నౌచిత్యము ధ్రువపడినది.

(౮) కీచకసంహారమునకు నర్జునుఁ డేలపూనుకొనలే దనుటకు సమాధానము మూలమున "నతఁడు తిర్యగ్యోని నొందుటచేత" నని మాత్రము కలదు. తిక్కన యాంధ్రమున నిందు కద్భుతసుకుమార సమాధానము కానవచ్చుచున్నది. అర్జునుఁ డిట్లుపలుకుచున్నాఁడు:-

"క. నీతోడిపరిచయము లే
దే తలపోయఁగ ననింద్య వెందును నీ వి
ట్లాగురవగుటకు నామది
నేతాపము లేదు నైజ మెఱుఁగవు కంటే."

అని తాను నిజసహోదరులయట్లపోలె వేషాంతరముఁ దాల్చినయంతి యుగాక, యూర్వశి యిచ్చినశాపం బనుభవించుటకు శరీరాంతరపరి గ్రహంబు సేయుటం జేసి రిపుమర్దనంబు తనకు వెరవుగాకునికి గుప్తిమై సాభిప్రాయంబుగాఁ దెలిపిన—

(౯) పాండవు లజ్ఞాతవాసమున నున్నకాలముననే దుర్యోధ నుఁడు కౌరవసభలోఁ "బాండవులజాడలు వెదకి తెలిసికొను తెఱం గులు మీమీ యెఱింగినచందంబులు నాకుఁ దెలియంజెప్పుఁ" డని పభ్యుల నడిగినప్పుడు కర్ణుఁడు పూర్వ మంపినవేఁగులవారికంటె నేర్పరు లగుచారులను మరల పంపి వెదకింప మంచి" దని యభిప్రా యము నొసంగెను. అటుపిమ్మట దుశ్శాసనుఁ డిట్లు పలికె నని మూల మున నున్నది:—

"యేషు నః ప్రత్యయోరాజం
శ్చారేషు మనుజాధిప।
తే యాం తు దత్తదేయా వై
భూయస్తాం పరిమార్గితుమ్."

(మనుజాధిపా! ఇప్పుడు మనకార్యము నిర్వహించుకొనిరాఁగల రని యేవారు లపై విశ్వాసము గలదో వారలకుఁ గావలసినద్రవ్యము నొసంగి మరల వారిని వెదకఁబంపుము.)

అనఁగాఁ గర్ణునివాక్యమె దుశ్శాసనునోటఁ బునరుక్తమైనట్లుగా మూలమునఁ జెప్పఁబడినది. ఇది దుస్ససేనునిస్వాభిమానిత్వమునకును, వాని గాఢమైనగర్వాంధతకును నెక్కువయనుగుణముగ నుండఁజాల దని తిక్కన తనయాంధ్రమున

"చ. వలవదు రోయఁ బాండవుల వారలు రోయుట లేనిత్రిమ్మటన్
బలమతి వన్యసత్త్వముల పాల్పడి చచ్చినచోటఁ బూరియున్
మొలవదె యింత కిం కిట మనోముద మస్ఖలితంబు గాఁగ వి
చ్చలవిడి రాజ్యలక్ష్మిఁ దగుచందమునం గొనియాడు మన్నతిన్."

ఇయ్యది దుశ్శాసనునిపాత్రమునకు నుచితమైనరచనము గాదా!

(౧౦) దక్షిణగోగ్రహణసందర్భమును బురస్కరించుకొని విరాటుఁడు త్రిగర్తలపై దండయాత్ర వెడలుచుఁ దనతమ్మునితో "కంకవలలదామగ్రంథిగోతంత్రీపాలురు బాహుబలాఢ్యులును శూరులు నుగఁ గన్పట్టుటచే వారును యుద్ధము చేయఁగల రని నావిశ్వాసము కావున వారికిని గవచాదుల నొసంగి యుద్ధోన్ముఖులను గావింపు" మని తెలుపఁగా వారికి నాతఁడు రాజాజ్ఞ నెఱింగించి వారిని నాయత్తపఱిచె నని మూలమున నున్నది. ఇందు విరాటరాజు పాండవులసాహాయ్యమును గోరుట కొసంగఁబడినహేతువు దుర్బరముగాఁ గన్పట్టుటయగాక యాత్మీయబలమునందు విశ్వాసము లేక తనయాశ్రితుల సాహాయ్యమునుగూడఁ గోరుచున్నాఁడా యనుసదికి గుఱి యగుటకూడఁ గన్పట్టుచుండుటచేతఁగూడఁ దిక్కన తనయాంధ్రమున నావిధమునఁ జక్కనిమార్పు చేసినాఁడు. కంకభట్టు (ధర్మరాజు) భీమనకుల సహదేవుల నందందుఁ గని వారిని నిలువుం డని నిపుణంబుగా నిమా

గించి తాను మత్స్యభూనాథుని నల్లన సమీపించి యొకబుషిచేఁ దాను రణవిద్య నభ్యసించితి ననియు, వలలదామగ్రంథితంత్రీపాలురును సమరంబునకుఁ బేరెన్నికఁ గాంచినవా రనియుఁ జెప్పి తన్నును వారిని యుద్ధమునకుఁ దోడ్కొనిపోవుట కాతని నియ్యకొల్పెను. ఇయ్యది మూలానువాదనవిధానముల నెంత తారతమ్య మగుపించుచున్నదో వేఱుగ వక్కాణింపవలయునా?

(౧౧) చెఱగాఁ బట్టుకొనఁబడిన త్రిగర్తాధీశుఁ డగుసుశర్మను భీముఁడు ధర్మజునియాజ్ఞానుసారము విడిచిపెట్టె నని మూలమునం దున్నది కాని యుద్ధమునఁ బట్టువడినశత్రువును విడిపించుటకు రాజునకుఁ దక్కఁ దదితరుల కేమియధికారముకల దని తలపోసి తిక్కన తనయాంధ్రమునం దీవిషయము నిట్లు మార్చివేసినాఁడు. యుద్ధమున వార లొనర్చినయుపకారమును బ్రశంసింపుచు మెచ్చుకొని "ఎద్దియేని కోరుఁ" డని యడుగ నప్పుడు ధర్మరాజు విరటునితో:—

"క॰ తగ నొక్కటి వేఁడెద నను
జగతీశ్వర యిచ్చు పొమ్మ సరథగజాశ్వం
బుగ విడిచిపుచ్చు మిప్పుడ
త్రిగర్తపతి నిదియ నాకుఁ బ్రియ మెబ్భంగిన్."

అని పలికి వానియనుమతిని గైకొని విడిచిపుచ్చెను. ఇం దెంతయు నౌచిత్యపోషణము గలదు.

(౧౨) ఉత్తరగోగ్రహణమున నుత్తరుఁడు తాను కౌరవసైన్యముపై నెత్తిచనుటకుఁ దనకుఁ దగినసారథి లేఁడని విచారించునపుడు సైరంధ్రి వానితో సర్వవిధముల నప్పనికి బృహన్నల తగియుండు నని యాతనికి నమ్మికపుట్టఁ బల్కె నని మూలమునఁ గలదు. తిక్కన యాంధ్రమున నుత్తరునిపల్కులు విని ద్రౌపది యుత్తరయున్న యెడకుం బోయి బృహన్నలసారథ్యకౌశల మత్తెఱఁగ కెఱింగించి

యమ్ముదితయుఁ దానును జని యుత్తరున కత్తెఱంగు సముచితముగఁ జెప్పె నని కలదు. పాత్రౌచితీనిర్వాహణమున నిచ్చటఁ దిక్కన మూలమునకు మెఱుఁగువెట్టె ననుట నిక్కము గదా?

(౧౩) ఉత్తర సోదరసారథ్యమునకు బృహన్నలను బురికొల్పుచు నీక్రిందిరీతిఁ బలికినట్లు మూలమున నున్నది.

"అథైతద్వచనం మే ద్యనియుక్తా నకరిష్యసి;
ప్రణయా దుచ్యమానా త్వం పరిత్యక్ష్యామి జీవితమ్"

[మాయన్న నన్నుఁ బంపించి నీకుఁ జెప్పి నిన్నుఁ దోడ్కొనిరమ్మనఁగా నాకు నీతోడ నించుకచనవు కలుగుటంజేసి యట్లు యని వచ్చితిని. నామాట వినక నన్ను నరకుగొనవేని నేను ప్రాణములు విడుతును.]

తిక్కనయాంధ్రమున నుత్తరవాక్యము: నీపాల నాకుఁ జనవు కలుగుటంజేసి యెల్లవిధంబులం దెత్తు నని పూని వచ్చితి. నీవును నా పలుకులు గుఱిచేయక, నీపెంపునం బ్రకటముగా యుత్తరకుమారునకు రథంబుఁ గడప నియ్యకొని, యియ్యాపదఁ దలంగవలయును. అట్లొడంబడక తక్కుట నావలనివాత్సల్యంబు గొఱంతపఱుచుట."

ఇచ్చోట వచస్సౌకుమార్యమాధుర్యముల మాతృకాదుహితృకలకు లోకములోఁ దల్లికిఁ గూఁతునికి నుండుభేదమె కానవచ్చుచున్నది.

(౧౪) మూలములో బృహన్నలకు "శుక్లవసనము" చెప్పి యుండఁగాఁ దెలుఁగున రణోచిత మైన "రక్తాంబరము" చెప్పఁబడి యున్నది.

(౧౫) అర్జునుఁడు నిజసోదరులను దన్నును నుత్తరున కెఱింగించుసందర్భమున మొట్టమొదటనే ("అహమస్మ్యర్జునః") ఏ నర్జునుఁడ నని చెప్ప మొదలుపెట్టినట్లు మూలమున నున్నది. తిక్కన తన యాంధ్రమున:-

"శంకుఁడు ధర్మసుతుఁడు వల
లాంకుఁడా భీముండు కవలు హయశిక్షకగో
కింకరులు సెప్పఁదొడఁగితి
నింకఁ గొఱఁత వెట్ట నేల యే నర్జునుఁడన్."

ఇం దర్జునుఁడు సోదరులను ముందుగాఁ దెలిపి "చెప్పఁదొడఁగితి నింకఁ గొఱఁత వెట్టనేల" యని కడపట పేరు వెల్లడించుటయు మూలానువాదముల నౌచిత్యమునఁ గల తారతమ్యంబులు సుభువుగాఁ దెలుపఁ గలదు.

(౧౬) ఉత్తరుఁడు కౌరవసైన్యముం గాంచి భయపడినప్పుడు సాయుధహస్తుఁ డైనయర్జునుఁ డుత్తరునం దట్టిభయముఁ బోఁగొట్టి నొగపైఁ గూరుచుండఁ బెట్టి తాను రథియై కురుబలమును దఱుము సందర్భములోని మూలఘట్టము.

"మహారథ మనుప్రాప్తం దృష్ట్వా గాండీవధన్వినమ్
అనలం శివాశ్చ ఘోరాశ్చ ఘుష్యంతే చైవ సంయుగే
ఏతద్ధ్వజాగ్రం పార్థస్య దూరతః ప్రతిదృశ్యతే
మేఘః సవిద్యుత్ స్తనితో రోరవీతి చ వానరః
ఆస్థాయ చ రథం యాతి గాండీవం విక్షిప న్ధనుః
అశ్వానాం స్తనితం శ్రుత్వా వహతాం పాకశాసనమ్
రథస్యాంబుధర స్యైవ శ్రూయతే భృశదారుణః
ధారయన్నివ తేజస్వీ వసుధాం పాండవాత్మజః
ఏషతిష్ఠన్ రథిశ్రేష్ఠ రథే రథిశతప్రణుత్."

తమకౌరవసైన్యమువంకకు వడిగా వచ్చుచున్నయర్జునునిరథధ్వాన మంతటను గ్రమ్మినది. కౌరవు లతనిపతాకాగ్రముఁ గాంచిరి. అతని రథధ్వానమును, దఱుచు మొఱయు నతనిగాండీవగుణరవమును వినిరి. అమ్మహారథుని యాగాండీవధ్వనియు వినుపించుట గమనించి ద్రోణుఁ డిట్లు పలికెను.

"ఆదూరముగాఁ బ్రకాశించునది యర్జునుని కేతనాగ్రము. ఇది యాతని యరదముచప్పుడు. ఇట్లు భయంకరముగ గర్జించునది యతనిపతాకమునందలి వానరము. ఆవానరధ్వని మనసేనలనెల్ల సంక్షోభింపఁజేసినది. ఆరథశ్రేష్ఠము నధిష్ఠించియున్న యామహారథకాగ్రణి మేఘగర్జాసన్నిభగాండీవధనుష్టంకారము చేయుచున్నవాఁడు."

ఇయ్యది మూలగ్రంథకారుని కూర్పు.

పూర్వార్థమున మొదట రథధ్వానము వినఁబడెనని, పిదప ధ్వజాగ్రము కనఁబడెనని, తరువాత గాండీవజ్యారవము వినంబడెనని వైశంపాయనుఁ డనుచున్నాఁడు. ఉత్తరార్థమున మొదట ధ్వజము గానఁబడెనని, యంతట రథధ్వానము వినంబడెనని, పిమ్మట గాండీవము నారిని ధ్వనింపఁజేయుచున్న యర్జునుఁడు రథమునఁ గూరుచుండి యుంటఁ గనంబడెనని ద్రోణుఁ డనుచున్నాఁడు. ఈవినఁబడుటలోను గనఁబడుటలోను గలవ్యాఘాతము లోకింత యటుండనిత్తము. ఇది దూరమునుండి గోదవ్వులఁ జేరవచ్చు రథగమనముయొక్క పరిణతి క్రమమా యనుప్రశ్నము పుట్టుచున్నది. వీరపురుషోచిత మైనశంఖారావ మిందుఁ గానరాదు. దానికేమి? అయ్యది యర్జునుని కేతనాగ్రమని, యయ్యది తేరిచప్పు డని, యయ్యది యతనిధ్వజాగ్రమునందలి వానరగర్జ యని ద్రోణుఁడు విస్పష్టముగాఁ జెప్పుచున్నాఁడే! అది యుంగాక గాండీవధనుష్టంకారమును జేయుచు నతఁడు రథమునఁ గూరుచుండియున్నాఁ డని చూచి పలుకుచున్నాఁడే. ఇం దేమాత్రమైన నేర్పరితనము గలదా? క్రమరీతి పాటింపఁబడియెనా?

ఇచ్చటఁ దిక్కనయాంధ్రమునందలి రచనాకౌశల్య మెట్లుండెనో చూడుఁడు!

"శ్రవణపుటంబులు వ్రయ్యంగ దాఁకి సం
క్షోభంబు గావించె గుణముమ్రోఁత

బ్రహ్మాండభాండంబుఁ బగిలించి భూతని
వైచిత్య్ర మొనరించె శంఖరవము
గగనభాగం బెల్లఁ గప్పి క్రాలుచు నెగ
డడరించె నుగ్రంపుఁ బడగపఱపు;
మిఱుమిట్లు గొని చూడ్కి పఱిపోవ వెలిఁగి ప
ర్భ్రాంతి సేసెఁ గిరీటకాంతి;
తెల్ల మిది గాణ్డీవంబును, దేవదత్త
మును, కపిధ్వజమును, వాసవునివరమునఁ
గన్నమకుటంబు నగు వేఱె కొన్నిదైన
నుజ్వలాకృతభంగులై యున్న యిట్లు!"

అల్లెత్రాటిమ్రోఁత మొదట, దాని వెంట శంఖధ్వని వినంబడెను. అంతటఁ బతాకాగ్రముమాత్రము, దానితోఁ గిరీటకాంతులుమాత్రము కనంబడెను. ఆయల్లెత్రాటిమ్రోఁత గాండీవముదే యని, యాచిందము మ్రోఁత దేవదత్తముదే యని, యాపడగపఱపు వానరాంకమే యని, యాకిరీటకాంతు లింద్రదత్తమగుమకుటప్రసారితమే యని వాని పావిత్ర్యములను వైలక్షణ్యములనుబట్టి యూహించి నిశ్చయించెను. ఇంకఁ జాలును. హృద్య మగు నీసందర్భమును, కళాప్రవణతను వింత కన్న వాచ్యము చేయఁ గాదు. ఆకూర్చునకు నీకూర్చునకుఁ దఱుఁగు మెఱుఁగులు రసలుబ్ధుల కూహ్యంబులు గావా?

(౧౨) ద్రోణాచార్యుఁడు తనశిష్యుఁ డర్జునుఁడు తన కొనర్చు శరప్రయోగరూపసత్కారము వెలుంగుసందర్భమున మూలము:-

"ఇమౌ హి బాణౌ సహితౌ పాదయోర్మే వ్యవస్థితౌ
అపరౌ చాప్యతిక్రాంతౌ కర్ణౌ సంస్పృశ్య మే శరౌ."

(ఇతఁ డొక్కపెట్టున రెండుబాణముల నాపాదములఁ దాఁకునట్లును, రెండుబాణముల నాచెవులఁ దాఁకునట్లును వేసెను.)

ఇంకఁ దిక్కనయాంధ్రానువాదము:—

"ఇప్పుడు నాకుఁ బ్రణామంబుగాఁ బాదంబుల మొదలం బడ రెండమ్ము లేసి పెద్దకాలం బేనిపాసియున్నవాఁడు కావునఁ గుశలప్రశ్నంబుగాఁ జెవులు సోఁకియుం జోకములుగా రెండమ్ము లేసెను."

మూలము ననువదించుటలో "పాదంబుల మొదల", "చెవులు సోఁకియుంజోకములుగా" ననుట యెంతసాభిప్రాయమో, సుకుమారమో రసజ్ఞులే యూహించుకోఁగలరు.

(౧౮) అర్జునుఁడు కౌరవయోధులపై సమ్మోహనాస్త్రముం దక్క నన్యముం బ్రయోగింపకుండుటకుఁ గారణము మూలమునఁ గానరాదు. తిక్కన తనయాంధ్రమున నద్దానికిఁ దగిన హేతువు నొసంగి యున్నాఁడు.

"విజయుండు తనతోడంబుట్టువుల ప్రతిన లూహించి యొండు సేయనొల్లక, సపరివారంబుగా ధార్తరాష్ట్రుల భంగపెట్టందలంచి, సమ్మోహనాస్త్రంబు బ్రయోగించెను." ఇంతకంటె నుచితం బగుహేతువు మఱేమియుండును ?

(౧౯) అర్జునుఁడు సమ్మోహనాస్త్రముఁ బ్రయోగించినవెనువెంటనే శంఖమును బూరించినట్లును, నాభయంకరశంఖారావమునకు భీతిల్లి కురుప్రవీరులు మూర్ఛిల్లినట్లును మూలమునఁ గలదు. అయ్యది యప్రస్తుతమును, బ్రకరణప్రతికూలంబు నగుటచేఁ దిక్కన తనయాంధ్రమున విడిచిపెట్టినాఁడు.

(౨౦) అర్జునుఁడే విరాటరాజునకుఁ దనతోఁబుట్టువులతోఁ దన్నుఁదానే యెఱుకపఱుచుకొన్నట్లు మూలమునఁ గలదు. సోదరులందఱు నచ్చటనేయున్నప్పుడు కిరీటి తన్నుఁదా నెఱిఁగించుకొనుట యనుచితము ననవసరము గావునఁ దిక్కన భీమునిచే నర్జునుని నెఱుకపఱిచినాఁడు.

(౨౧) సంజయునిరాయబారముసందర్భము— ధర్మరాజు వాక్యము. మూలములో:—

“కర్ణశ్చ జానాతి సుయోధనశ్చ
ద్రోణశ్చ జానాతి పితామహశ్చ,
అన్యే చ యే కురవ స్తత్రసన్తి
యథార్జునా న్నాస్త్యపరో ధనుర్ధరః
జానన్తి తత్కురవ స్సర్వఏవ
యే చాప్యన్యే భూమిపాలాః సమేతా,
దుర్యోధనే రాజ్యమిహాఽధిపత్యథా
హ్యరిష్టమే త్కింను నే విద్యమానే
తే నానుబన్ధం మన్యతే ధార్తరాష్ట్రః
శక్యం హర్తుం పాణ్డవానాం మమత్వమ్
కిరీటినా తాళమాత్రాయుధేన
తద్వేదినా సంయుగం తత్రగత్వా
గాణ్డీవవిస్ఫారితశబ్దభాజా
నశృణ్వానా ధార్తరాష్ట్రా ధ్రియన్తే;
క్రుద్ధం నచే దీక్షతే భీమసేనం
సుయోధనో మన్యతే సిద్ధమర్థమ్.
ఇంద్రోఽప్యేత న్నోత్సహే త్తాతహర్తు
మైశ్వర్యం నో జీవతి భీమసేనే
ధనఞ్జయే నకులే చైవ సూత
తథా వీరే సహదేవే సహిష్ణౌ.

పై శ్లోకములలోని భావమును జెదరనీయక యందలిసడలుబాటు నిందుఁ బొరయనీయక తనమార్పునుగూర్చి సుప్రసన్నముగాఁ దిక్కనభావమును సాక్షాత్కరింపఁ జేసినవిధమును జూడుఁడు.

“కా, చాపాచార్యుఁడు భీష్ముఁడుం గృపుఁడు నశ్వత్థామయుం గర్ణుఁడున్
భూపశ్రేష్ఠుఁడుఁ దారు మున్నెఱుఁగరే పో రిట్టుఁ గయ్యంబు లాఁ
కాపాళంబులు జుట్టలా వెలిఁగియుం జా వేడి మార్కొందు రిం
తే పో! తమ్ముఁ గపిధ్వజప్రథల యంధీభూతలం జేయవే,

> గాండీవజ్యారవం బుత్కట మయి చెలువం గ్రమ్మినన్ భీమబాహా
> దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగాఁ దోఁచినన్ వే
> దండద్వంద్వంబుమాడ్కిం దఱిమి కవలు మాద్యద్గతిం దాఁకినన్ జా
> కుండం బోకుండఁ గౌరవ్యులకు వశ మె పట్టులొక్కం మార్కొల్లకుండన్."

పై నుదాహృతమూలమునకును దిక్కన తెలుఁగునకును గలభేద మొకింత యరయుదముగాక !

తిక్కన "కర్ణశ్చజానాతి........" అని మూలగ్రంథకారుఁడు వాచ్యము చేసినదానికి, సంక్షేపఱిచి, భావమునకుఁ బుష్టిఁ గల్పించి వ్యంగ్యపూర్వకముగాఁ గవితాకళను సమర్థించినాఁడు. మూలగ్రంథకారుఁడు, కర్ణుని, సుయోధనుని, ద్రోణుని, భీష్ముని వరుసగాఁ జేర్కొనినాఁడు. కృపాశ్వత్థామలపే రెత్తఁడు. తొలుతఁ గర్ణునిఁ, బిమ్మట సుయోధనునిఁ, దరువాత ద్రోణభీష్ములను- నల్వురను క్రమపఱిచినాఁడు. దేనింబట్టి యీక్రమ మేర్పరించినాఁడు ? అధికారత్వతనుబట్టియా ? ఔచితినిబట్టియా ? జ్ఞానవంతులను జేర్కొనవలయునెడ ద్రోణభీష్ములఁ జేర్కొన్నతరువాత నెవ్వరి నేనిఁ జేర్కొనఁదగును. సర్వ మెఱింగియుఁ దనపంతమే నెగ్గవలయు ననుసుయోధనుఁడు హఠయోగి; కర్ణుఁడో, రారాజుయడుగుజాడలననుసరించి తనకుఁదోఁచినట్లు నూటిగా నడచుకర్మయోగి; ఇట్టివారిని నెఱుకగలవారిలో మొదటఁ జెప్పుటయు, నిజముగా నెఱుకగలధర్మయోధులను ద్రోణభీష్ములను దరువాతఁ జెప్పుటయు నౌచితి యనఁబడునా ? ధర్మరాజు సంజయునితో వరుసగా నీనల్వుర నిట్లు నుడివె నని పురాణముల పుట్టు వెఱింగినబుద్ధిశాలురు వాదింపరు గదా. అర్హతను నధికారతారతమ్యములను నౌచితిని బాటించికాఁబోలు తిక్కన ద్రోణభీష్ములతరువాతఁ గృపాశ్వత్థామలను, బిమ్మటఁ గర్మయోగిని గర్ణుని పదంపడి హఠయోగిని సుయోధనుని జేర్కొనినాఁడు. ఎఱుకగలపెద్దలను

వరుసఁబడి తెలిపి యెఱుఁగఁజాలని, నెఱుఁగనొల్లనివారి నిద్దఱను వ్రాసినాఁడు. ఎప్పుడు, ఎక్కడ, ఎవ్వఁడు, ఎట్లు పేర్కొన్నను ద్రోణాచార్యునో, శాంతనవునో— ఇరువురిలో నొకరిని మొదల నిడి కృపాశ్వత్థామల నిద్దఱనో, యథవా యొకరినేని చెప్పి కడమవారిని వ్రాయుచుఁ గ్రమభంగముఁ బొరయనీయక మరియాదఁ గాపాడువాఁడు తిక్కన. మూలగ్రంథకారుఁ డిట్లు పాటించుట గానరాదు చూడుఁడు.

"ద్రోణుఁడు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణసుతుండును గర్ణశల్యులున్
ప్రాణము లాసుయోధనునిపాలిటి యండ్రు...................."

అని రాయబారి సంజయునినోరను—

"భీష్మద్రోణకృపాదిధన్వినికరాభీలంబు.............."

అని తత్తరపాటున నున్నయుత్తరునినోరను బలికించినాఁడు తిక్కన. ఇంతియగాదు— ఉత్తరగోగ్రహణమునఁ గురుసేనం జూపి జ్ఞప్తియుంచుకొనుటకై వేర్వేఱ వరుస నర్జునుఁ డుత్తరకుమారునకుఁ దెలుపుచున్నాఁడు.

"కాంచనమయవేదికాకనత్కేతన
ద్యుతులవిభ్రమమువాఁడు కలశజుండు;
సింహలాంగూలభూషితనభోభాగకే
తుప్రేంఖణమువాఁడు ద్రోణసుతుఁడు;
కనకగోవృషసాంద్రకాంతిపరిస్ఫుట
ధ్వజమహాలక్ష్మువాఁడు కృపుఁడు;
లలితకంబుప్రభాకలితపతాకావి
హారంబువాఁడు రాధాత్మజుండు;

మణిమయోరగరుచిజాలమహితమైన
పడగవాఁడు కురుక్షితిపతి; మహోగ్ర
శిఖరఘనతాళతరు వగునిదమువాఁడు
సురనదీసూనుఁ డేర్పడఁ జూచికొనుము."

ఇందునను దిక్కనకు మెలఁకువ గోల్పడదు. కలనికిమొనగాఁడు కలశ జుఁడు (ద్రోణుఁడు), అతని వెనుక యశ్వత్థామయు, నాతరువాతఁ గృపుఁడును నిలిచినారు. ఆపిఱుంద రాధేయుఁడు, షిమ్మటఁ గురురాజు (దుర్యోధనుఁడు), దుముదారుదారి గాంగేయుఁడు (భీష్ముఁడు). ఎత్తి పైఁబడవచ్చుశత్రువులనుండి తమరాజును రక్షించుకొనుటకై తిమ్మాఁ గడచికాని దుర్యోధనుని సమీపింపకుండ ద్రోణకర్ణాదులు మొగాళ మునను, భీష్ముఁడు వెన్నునను నిలిచినట్లు సంవిధానము. ఇది మూలము ననుసరించినదియు. పై సంఘటనమును మూలమాతృకతోఁ బోల్చి తిక్కనతీర్పరితనమును బరితరు వదలుదము. మూలమున:—

"గాండీవగుణరావము ధార్తరాష్ట్రు లింతదనుక వినలేదు గావున బ్రదికిరి. క్రోధావిష్ణుని భీమసేనుని జూచునందాఁకఁ దనపూ ర్విని సుయోధనుఁడు విశ్వసించియుండఁగలఁడు." అని మరల "భీమార్జునులును, వీరుఁ డగునకులుఁడును, సహనశీలుఁ డగుసహదే వుఁడును సజీవులై యుండునంతవఱకు నింద్రుఁడేని మాప్రభుత్వమును హరింపఁగలఁడటయ్యా?" అని యుధిష్ఠిరునినోరఁ బలికించినాఁడు. ఇందుఁ గవితాకౌశలం బెక్కడ? పూర్వార్థమున గాండీవజ్యారవ మును గ్రోధమూర్తి భీమునిఁ బ్రశంసించియు, నుత్తరార్థమున నప్ర యోజనకరమైన పునరుక్తికి స్థాన మెక్కడకలదు.

ఇంకఁ దిక్కనతీర్పరితనమును జిత్తగింపుఁడు.

"గాండీవజ్యారవము"తో మొదలుపెట్టి యర్జునునిపరాక్రమ మును వ్యంగ్యముగా సూచింపుచు గదాదండమండితుఁ డగుభీముని బాహాదండశౌర్యమును దెలిపి, నకులసహదేవుల రణవిద్యాప్రవీణతను దెలిపినాఁడు. భావానుగుణముగను, సన్నివేశసముచితముగను వృత్త మును నడిపినాఁడు. నల్వురసోదరులబలపరాక్రమశౌర్యరీతులఁ గ్రమ

ముగాఁ బ్రకటించినాఁడు. తొలుత గాండీవజ్యారవము పలుమఱు నుత్కటముగాఁ గ్రమ్ముటయుఁ, బిమ్మట బాహాదండ మేపాఱి శుంభ ద్గద జడిపింప, భీముని రౌద్రాకృతి దోఁచుటయు, పదపడి యేన్గులజో ధువలెఁ దఱుమునకులసహదేవులఁ దాఁకుటయుఁ జూపినాఁడు. అర్జు నుఁడు శ్రవణమాత్రభయంకరుఁ డని, భీముఁడు దర్శనమాత్రభయం కరుఁ డని, నకులసహదేవులు సంఘర్షణమాత్రభయంకరు లని తార తమ్యములను వ్యక్తీకరించినాఁడు. ''క్రమ్మినన్', 'తోఁచినన్', ''తాఁకినన్'', అని ధ్వని ప్రసాదించి మెఱుఁగుపెట్టినాఁడు. ఇట్టి పట్టుల నెన్నినిఁ జూపవచ్చును.)

(౨౨) స్వర్గారోహణము. మూలము:—

''వైశంపాయన ఉవాచ:—

'స్వర్గం త్రివిష్టపం ప్రాప్య తవ పూర్వపితామహాః;
యుధిష్ఠిరప్రభృతయో యదకుర్వత తచ్ఛృణు
స్వర్గం త్రివిష్టపం ప్రాప్య ధర్మరాజో యుధిష్ఠిరః;
దుర్యోధనం శ్రియా జుష్టం దదర్శాసీన మాసనే
భ్రాజమాన మివాదిత్యం వీరలక్ష్మ్యాభిసంవృతమ్
దేవై ర్భ్రాజిష్ణుభిః సాధ్యైః సహితం పుణ్యకర్మభిః
తతో యుధిష్ఠిరో రాజా దుర్యోధన మమర్షితః
సహసా సన్నివృత్తోఽభూ చ్ఛ్రియం దృష్ట్వా సుయోధనే.''

''యుధిష్ఠిరుఁడు స్వర్గమున నడుగిడెను; ఐశ్వర్యసమగ్రుఁడై సింహాస నాసీనుఁడైనదుర్యోధనుని గాంచెను. ఆదుర్యోధనుఁడు సూర్యునట్లు ప్రకాశించుచు వీరపురుషసత్వ మగుకీర్తిలాంఛనము ధరించియుండెను. అతఁడు దివ్యతేజస్సంపన్నులు, శుభకర్మకరులు నగుసిద్ధాదిదేవతలం గూడియుండెను. దుర్యోధనుని, నతనివైశ్వర్యమును జూచి యుధిష్ఠి రుఁడు కోపోద్రిక్తుఁడై తనదృష్టిని మఱల్చెను.'' యుధిష్ఠిరుఁడు స్వర్గ మున నడుగుఁ బెట్టఁగానే యుత్తమపీఠస్థుఁడు నైశ్వర్యసమగ్రుఁడు నైన

దుర్యోధనుని గనె నని వైశంపాయనునిచేఁ బలికించి “సూర్యప్రభాకలిత........” అని చెప్పించెను. ఆద్యంతములయందు దుర్యోధనునిపేరు రెట్టించిచెప్పించెను. ఇందు నేర్పు పెంపు గానంబడదు. కవితాగానకళల జీవమంతయును నెత్తుగడయందును, దీఁకుగడయందును నిక్షిప్తమై యుండనొప్పును. పైఁజెప్పిన యుక్తివాచ్యము. ఇంక నిటఁ దిక్కనతీర్పు గనుఁడు.

“..............కట్టెదురఁ గోఁగేఁ
నున్నతాసనాసీనుఁ డభ్యుదితసరసి
జాప్తసంకాశుఁ, డమృతాంశుకాంగనాది
వృతుఁడు, చిరలక్ష్మివిరాజితుఁడు, సకల
యుక్తసుఖసాధనుండు దుర్యోధనుండు.”

కనఁబడె నని ప్రారంభించి, యీమహావైభవ మంతయు నెఱింగించి చివరకు పేరు వెలువరించినాఁడు. తిక్కన కవితిలకుఁడు. ఇది తీర్పు నేర్పు కాదా ?

మూలగ్రంథకారుఁడు వ్యాసుఁడైనను, మఱి యెవ్వఁడైనను మూలగ్రంథకారునిచూపునకును దిక్కనచూపునకు నెంతవ్యత్యాసము గలదో స్థాలీపులాకన్యాయముగ నొక్కవిషయము నిచ్చట మూదవించినఁ జాలును.

ఈస్వర్గారోహణమునను మూలగ్రంథకారుఁడు (వ్యాసుఁ డగుఁ గాక; కాకపోవుఁగాక) ధర్మరాజును “యుధిష్ఠిరుఁ” డని పెక్కెడల వాడుచువచ్చినాఁడు. తిక్కనమట్టుకు నీపర్వమున నెక్కడను నాశబ్దమునకుఁ జో టిచ్చినవాఁడుగాఁడు. యుధిష్ఠిరత్వమునకు నీస్వర్గభూమి స్థానము గాదని, సమయము గాదని తిక్కనకవి బాగుగా నెఱుంగును. ఇక్కడనేకాదు, ఏపట్టుననేని తిక్కన పదప్రయోజనమునెడఁ బ్రజ్ఞ కోల్పడె నని చెప్ప నయితికాదు. స్థానమును, సమయమును గమనింపక మూలగ్రంథకారుఁ డిచ్చవచ్చినట్లు వాడినాఁడు.

కథావ్యాజమున జ్ఞానము నుపదేశించుటయే మూలకావ్యము ప్రధానోద్దేశమగుటచేతను, నాంధ్రకృతి కథాచమత్కారమును, స్వభావానుసరణమును ముఖ్యముగాఁ బాటించుటచేతను, దిక్కన మూలగ్రంథకారునికంటె నర్వాచీనుఁ డగుటచేతను, వైవ్యత్యయములు సంభవించుటకుఁ గారణము లయ్యె ననియు, వాని నెత్తి చూపుట సంస్కృతాంధ్రభారతప్రణేతల గుణతారతమ్యవిచారము చేయుటకుఁ గాదనియుఁ దిక్కన కొన్నిచోట్ల మూలమునకు మెఱుఁగు వెట్టె నన్నచో నయ్యది కేవలకావ్యశిల్పదృష్టిచేతనే కాని యన్యమునఁ గాదనియుఁ బాఠకమహాశయులకు విన్నవించుచు నీభాగము విరమించుచున్నారము.

శ్రీసతిప్రెస్, కాకినాడ, ఇ.జి. 87. 28—4—48. కా. 1000